నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

'నీటి'పై నోరు పెద్దది చేసుకుంటే వాస్తవాలు మారవు

అప్పుల్లో కూరుకుపోతున్నా... రైతులపై ఉదాసీనత

పశ్చిమ ఆఫ్రికాలో మోదీ పర్యటనవేళ.. ముగ్గురు భారతీయులు కిడ్నాప్

సంపుటి 08, సంచిక: 214 | శుక్రవారం | 04-07-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## అంగన్‌వాడీ హెల్పర్స్‌కు గుడ్‌న్యూస్

- టీచర్లుగా పదోన్నతి వయోపరిమితి పెంపు
- 45--50 ఏళ్ళకు పెంచుతూ దస్త్రంపై మంత్రి సీతక్క సంతకం
- త్వరలోనే ఉత్తర్వులు జారీ
- 4,322 మందికి ప్రమోషన్ లభించే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

అంగన్‌వాడీ హెల్పర్లు టీచర్లుగా పదోన్నతి పొందే గరిష్ట వయోపరిమితిని రాష్ట్ర ప్రభుత్వం 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచింది. దీనికి సంబంధించిన దస్త్రాంపైన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క గురువారం సంతకం చేశారు. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెల్లడికానున్నాయి. గరిష్ట వయోపరిమితిని పెంచడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న సుమారు 4322 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్లు దాటిన హెల్పర్లకు పదోన్నతి పొందే అవకాశాలు లేవు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి తరువాయి 2లో



## గ్రూప్-1 పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) గ్రూప్–1 పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తెలుగు మీడియం అభ్యర్థులకు సరైన మార్కులు వేయలేదని పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టిజిపిఎస్‌సి తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారు. కోఠిలోని తరువాయి 2లో



## త్వరలోనే గ్రామ పాలన అధికారులకు నియామక ఉత్తర్వులు

రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎంపికైన 3500ల మంది గ్రామ పాలన అధికారులకు(జిపిఒ) త్వరలోనే రెవెన్యూ శాఖ నియామక ఉత్తర్వులను అందజేయనుంది. సుమారు ఐదు వేల మంది విఆర్‌ఒలను డిప్యూటేషన్ విధానంలో జిపిఒలుగా ఉత్తర్వులు కూడా ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్ కుమార్‌తో ట్రైసా ప్రతినిధులు గురువారం సమావే శమయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంబంధించిన పలు అంశాలను ట్రైసా ప్రతినిధులు లోకేష్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. స్పౌస్, మెడికల్ గ్రౌండ్స్‌ను పరిగణలోకి తీసుకని వారిన సొంత జిల్లాలకు కేటాయిస్తామని, 'భూ భారతి' సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుదారులను జూనియర్ అసిస్టెంట్‌లతో విచారించేలా జిల్లా కలెక్టర్లర్లకు ఉత్తర్వులు జారీ చేస్తామని లోకేష్ కుమార్ హామీనిచ్చినట్టు ట్రైసా తరువాయి 2లో

తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్



# డిసెంబర్ 9న ఆవిష్కరణ

వందేళ్ళ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించాం

పెట్టుబడులను ఆకర్షించడంలో ముందంజలో రాష్ట్రం

- పెట్టుబడిదారులకు లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకారం
- హైదరాబాద్ దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు
- ప్రపంచ నగరాలతోనే పోటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- మహేశ్వరం ఇండస్ట్రియల్ పార్కులో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్ ప్రారంభం



**హైదరాబాద్ :** రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9న ఆవిష్కరించబోతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలను మార్చుకోలేదని, పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఇండస్ట్రియల్ పార్క్‌లో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను గురువారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బి.మహేశ్‌కుమార్‌గౌడ్,మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్, వైస్ చైర్మన్ అబ్దుల్ సలాం, ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ మహేశ్వరంలో ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుందని రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ నగరానికి దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదన్నారు. ప్రపంచ నగరాలతోనే పోటీ అని సీఎం అభివర్ణించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్సల్టెంట్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మలబార్ గ్రూప్ కు అభినందనలు తెలియజేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చి దిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని అన్నారు.2023–24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ద్వితీయ రంగం తరువాయి 2లో



భారత దేశంలో వ్యవసాయ కార్మికుల ఉద్యమంపై ప్రచురించిన పుస్తకాన్ని గురువారం నాడు ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో ఆవిష్కరిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

## కెసిఆర్‌కు అనారోగ్యం

ఆసుపత్రిలో చేరిక

పరిస్థితిని వాకబు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి గురువారం వెళ్లారు. ఆయనకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా కెసిఆర్ తరువాయి 2లో



## నేడు సామాజిక న్యాయ సమరభేరి

గ్రామ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేయనున్న ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరగనుంది. 'సామాజిక న్యాయ సమర భేరి సభ' పేరుతో జరిగే సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పాల్గొనను న్నారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన ఈ సమ్మేళనానికి ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఎఐసిసి సీనియర్ నాయకులు హాజరవుతారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ మండల, జిల్లా అధ్యక్షులు మంత్రులు ఎంఎల్‌ఎలు, తరువాయి 2లో

## ట్రిపుల్ ఆర్‌కు ఆగస్టులో టెండర్లు



- 14 ప్యాకేజీల్లో రోడ్ల నిర్మాణాలు
- రీజినల్ రింగ్‌రోడ్డు కోసం సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి ప్రధాని మోదీ, కేంద్రమంత్రి గడ్కరీని కలుస్తాం
- హ్యామ్ రోడ్లపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు
- టోల్ వసూలు చేయబోం
- మంత్రి కోమటిరెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎక్కువ ట్రాఫిక్ ఉన్న, అవసరం ఉన్న చోట మొత్తం 14 ప్యాకేజీల్లో రోడ్ల నిర్మాణానికి ఆగస్టు చివరి నాటికి టెండర్ పిలవనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందుకు సంబంధించిన ఫైల్‌కు ఆమోదముద్ర వేయగానే సెప్టెంబర్ నాటికి పనులు మొదలు పెట్టుందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. డిసెంబర్ లేదా జనవరి నెలలో రెండవ దశ రోడ్ల ప్రక్రియను చేపడతామని చెప్పారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రీజనల్ రింగ్ రోడ్డు కోసం ముఖ్యమంత్రితో కలిసి వెళ్లి ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలుస్తామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్, చుట్టుపక్కల ముఖ చిత్రమే మారనుందన్నారు. హ్యామ్ రోడ్లకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, టోల్ వసూల్ లాంటివి ఏమి ఉండవన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది ఉన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. హైదరాబాద్ ఎర్రంమంజిల్‌లో గురువారం రోడ్లు, భవనాల శాఖపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో ఎంఎల్‌ఎ తరువాయి 2లో

## ర్యాష్ డ్రైవింగ్‌తో చనిపోతే.. ఇన్స్యూరెన్స్ వర్తించదు: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** అతివేగంగా లేక నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రాణాలు కోల్పోతే, ఆ బాధిత కుటుంబాలకు ఇన్స్యూరెన్స్ వర్తించదు అని సుప్రీంకోర్టు తెలిపింది. ఇన్స్యూరెన్స్ కంపెనీలు ఆ ఫ్యామిలీకి నష్టపరిహారాన్ని ఇవ్వలేవని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పిఎస్ నరసింహ, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఓ కేసులో ఈ తీర్పును వెలువరించింది. కారు ప్రమాదంలో మరణించిన తన భర్తకు నష్టపరిహారంగా 80 లక్షలు ఇవ్వాలని భార్య పెట్టుకున్న దరఖాస్తును సుప్రీం విచారించింది. అయితే కారును అతి వేగంగా డ్రైవ్ చేస్తూ అతను యాక్సిడెంట్‌కు గురై చనిపోయాడు. 2024, నవంబర్ 23వ తేదీన ఇదే కేసులో కర్నాటక హైకోర్టు తీర్పును ఇచ్చింది. భార్య, కుమారుడు, బాధితుడు పేరెంట్స్ పెట్టుకున్న నష్టపరిహార అభ్యర్థనను కోర్టు కొట్టిపారేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలమేని, అందుకే స్పెషల్ లీవ్ పిటీషన్‌ను డిస్మస్ తరువాయి 2లో

## కేరళ పట్ల కేంద్రం ప్రతికూల వైఖరి

ఓనం పండుగకు అదనపు బియ్యం డిమాండ్ తిరస్కరించడం తగదు

- సిఎం పినరయి విజయన్ ధ్వజం
- కేంద్ర సర్కార్ వైఖరిని నిరసిస్తూ అన్ని పార్టీలు 'ఐక్య నిరసన' చేపట్టాలని పిలుపు



**తిరువనంతపురం :** విపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ పట్ల కేంద్రం సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నదని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధ్వజమెత్తారు. ఓనం పండుగ సీజన్ కోసం కేరళ ప్రభుత్వం చేసిన అదనపు బియ్యం డిమాండ్‌ను తిరస్కరించడం ద్వారా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేరళ పట్ల ప్రతికూల వైఖరిని కొనసాగిస్తోందని ఆరోపించారు. కేరళ ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రతికూల వైఖరికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో నిరసన తెలపాలని సిఎం పినరయి విజయన్ తరువాయి 12లో

## పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

- రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు
- వాతావరణశాఖ ప్రకటన
- గంటకు 30–40కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి వెల్లడించింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశమున్నట్లుగా తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. గంటకు 30 నుంచి 40కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ వారు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లు జలకళను సంతరించుకుంటున్నాయి. ఆలమట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు అన్ని జలాశయాల్లోకి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఎగువ నుంచి వరదనీరు వస్తుండటంతో ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి రోజూ లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతుండడంతో అక్కడి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

**పెరుగుతున్న సాగర్ జలాశయం నీటిమట్టం**

నిత్యం సుమారు 50 వేల క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి వస్తుండడం వల్ల సాగర్ జలాశయం నీటిమట్టం తరువాయి 2లో

## స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపుపై సుప్రీం కోర్టుకు రాష్ట్ర సర్కార్?

అంతకు ముందు జిఒతో పెంచే అవకాశాల పరిశీలన



ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే శాసన సభ, శాసనమండలి ఆమోదంతో ఢిల్లీకి చేరిన బిసి రిజర్వేషన్ల పెంపు చట్టంపై కేంద్ర ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేదు.దీనిని రాజకీయ కోణంలోనే చూస్తున్నందున జాప్యం జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. మరో వైపు స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియను తరువాయి 12లో

## శాంతికి చేరువలో గాజా!

- ట్రంప్ ప్రకటనపై హమాస్ హర్షాతిరేకాలు
- 10 మంది బందీల విడుదల, 18 మృతదేహాలు అప్పగింతకు రంగం సిద్ధం!




**గాజా :** గాజాలో 60 రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం చేసేందుకు వీలుగా అమలు చేసే షరతులకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ అంగీకారం తెలియజేశారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై హమాస్ ఉగ్రవాద సంస్థ హర్షాతిరేకాలు ప్రకటించింది. అదేవిధంగా మధ్యప్రాచ్యంలో వివిధ మార్గాలలో లభిస్తున్న సమాచారం ప్రకా రం, 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పం దం అమలులోకి వచ్చిన తర్వాత వివిధ దశల్లో విడతలవారీగా 10 మంది సజీవులైన బందీలను, మరో 18 మంది బందీల మృతదేహాలను ఇజ్రాయెల్‌కు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియ మూడు దశలుగా వేరు వేరు ప్రాంతాలలో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## థాయ్‌లాండ్ ఆపద్ధర్మ ప్రధాని వేచాయా చాయ్

**బ్యాంకాక్ :**థాయ్‌లాండ్‌లో ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా పుంమ్థామ్ వేచాయా చాయ్ (72) మరోసారి బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకుముందు కూడా ఒకసారి ఆయన ఆపద్ధర్మ ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థిగా రాజనీతిశాస్త్రంలో పట్టాతీసుకున్న చాయ్ మంత్రిగా, రాజకీయాలలో ఆరితేరిన నాయకుడు. ఇప్పటివరకు దేశీయాంగమంత్రిత్వ బాధ్యతలు నిర్వహించిన చాయ్ తాత్కాలిక ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహిస్తారు. ఫోన్ కాల్ సంభాషణ వివాదంలో చిక్కుకుని అపఖ్యాతిపాలైన ప్రధానంత్రి పేటోంగ్టార్న్ షినవత్రపై ప్రధాన ప్రతిపక్షంలోని కన్జర్వేటివ్ గ్రూపు నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ధర్మాసనం ఆమెపై తాత్కాలికంగా వేటు వేసింది. ఈ కేసు తేలే వరకు ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు దూరంగా ఉండాలని థాయ్‌లాండ్ ప్రధాన న్యాయస్థానం మెజారిటీ ఓటింగ్ ద్వారా తీర్పు చెప్పింది. ఈ తీర్పును శిరసావహిస్తానని పేటోంగ్టార్న్ షినవత్ర విధేయత ప్రకటించిన తర్వాత ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా పెంచాయా చాయ్ తెరమీదకు వచ్చారు. ప్రధానమంత్రి పదవి నుండి శ్రద్ధా తవిసిన్‌ను తొలగించడంతో 2024 ఆగస్టు 14వ తేదీ నుండి 16వ తేదీ వరకూ ఆయన మొదటి సారి ఆపద్ధర్మ ప్రధామంత్రి బాధ్యతలు నిర్వహించారు.

# ఆరు దశాబ్దాల 'యుఎస్ ఎయిడ్' సేవలకు వీడ్కోలు








**వాషింగ్టన్ :** దాదాపు ఆరు దశాబ్దాల సేవల తర్వాత యుఎస్ ఎయిడ్ (అమెరికా ఏజన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డవలప్‌మెంట్) కార్యకలాపాలకు మంగళవారంనాడు తెరపడింది. అమెరికా సెనేట్‌లో డోనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన మెగా బిల్లు (బిగ్ బ్యూటిఫుల్ బిల్)లో తీసుకున్న కోతలు, పొదుపు చర్యల నేపథ్యంలో యుఎస్ ఎయిడ్ కార్యకలాపాలకు సెనేట్ ఓటు చరమగీతం పాడింది. యుఎస్ ఎయిడ్ కార్యకలాపాలను నిలిపివేస్తే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో లక్షలాదిమంది ప్రజలు రాబోయే కాలంలో మరణాలకు గురవుతారన్న హెచ్చరికలు వెలువడుతున్నప్పటికీ కూడా ట్రంప్ తన వైఖరిని మార్చుకోకుండా యుఎస్‌ఎయిడ్‌ను స్తంభింపజేశారు.ఇక యుఎస్ ఎయిడ్ అమెరికా విదేశాంగ విభాగంలోవిలీనమైపోతుంది.ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న,నిరుపేద దేశాలలో సహాయ కార్యక్రమాలు నిర్వహించడంకోసం ప్రచ్ఛన్నయుద్ధకాలంలో అమెరికా అధ్యక్షుడుగా ఉన్న జాన్ ఎఫ్ కెన్నడీ 1961లో ఈ 'యుఎస్‌ఎయిడ్'ను ప్రారంభించారు. ఫారిన్ అసిస్టెన్స్ యాక్ట్ కింద 1961సెప్టెంబరు4న అమెరికాకాంగ్రెస్‌ఈ బిల్లును ఆమోదించింది. బిల్ క్లింటన్ దేశాధ్యక్షుడుగా ఉండగా దీని స్వతంత్రతను కాపాడేందుకు విదేశాంగశాఖ నుండి విడదీసి కాపాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యరక్షణ కోసం సరిహద్దులకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తూ వచ్చిన యుఎస్ ఎయిడ్ 60 ఏళ్ళ తర్వాత ఇప్పుడు ట్రంప్ పాలనాకాలంలో (1961–2025)రద్దైపోయింది. గాజాలో కూడా యుఎస్‌ఎయిడ్ కీలకభూమిక వహించింది. 2001 నుండీ 2024 వరకూ యుఎస్ ఎయిడ్ ద్వారా 23 బిలియన్ డాలర్లు పంపిణీ అయ్యాయి. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిపాలన వ్యవస్థలకు తోడ్పాటు వంటి అనేక కార్యకలాపాలకు యుఎస్‌ఎయిడ్ సహకరించింది. ప్రపంచవ్యాప్తంగా విదేశాలలో మానవతా సహాయ కార్యకలాపాలు నిర్వహించే సంస్థలలో అతిపెద్ద సంస్థ ఇప్పటివరకూ యుఎస్ ఎయిడ్ మాత్రమే. ఇప్పుడు ట్రంప్ నిర్ణయాల కారణంగా ఇద అంతర్థానమైంది. ఈ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, ప్రపంచంలో తీవ్రవాద భావాలను పెంపొందింపజేయడానికి ఈ నిధులు ఉపయోగపడుతున్నాయని ట్రంప్ ఒక దశలో ఆరోపించారు. డాడ్ ప్రత్యేక మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహించిన ఎలాన్ మస్క్ యుఎస్ ఎయిడ్‌ను మూసివేయడంలో కీలకపాత్ర వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కార్యకలాపాలను స్తంభింపజేయడానికి ఈమెయిల్ సేవలను స్తంభింపజేయాలని, యుఎస్‌ఎయిడ్ వర్కర్లకు సెల్‌ఫోన్ల ద్వారా అనుసంధాన కార్యక్రమాలను నిలిపివేయాలని ఈ సంస్థ తాత్కాలిక పాలనాధిపతిగా పనిచేస్తున్న జాసన్‌గ్రేకు ఎలాన్ మస్క్ ఈ ఏడాది జనవరి 30వ తేదీన ఆదేశాలు ఇచ్చారు. అందుకు జాసన్ గ్రే తిరస్కరించడంతో ఆ మరునాడే ఆ బాధ్యతల నుండి ఆయనను తొలగించారు.యుఎస్ ఎయిడ్‌ను విదేశాంగశాఖలో విలీనం చేస్తున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరి మూడో తేదీన అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ప్రకటించారు.

## ఇజ్రాయెల్‌తో సంబంధాలు రద్దు చేయాలి
### ఐక్యరాజ్యసమితి ప్రత్యేక నివేదకురాలు ఆల్బనీస్

**జెనీవా:** ఇజ్రాయెల్‌తో అన్ని రకాల వాణిజ్య సంబంధాలు రద్దుచేసుకోవాలని, ఆ దేశానికి అన్నిరకాల ఆయుధ సరఫరాలను రద్దుచేయాలని ఐక్యరాజ్యసమితిప్రత్యేకనివేదకురాలు ఫ్రాన్సిస్కా ఆల్బనీస్ తన తాజా నివేదికలో డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా అమెరికా మీద గురిపెట్టారు. గాజాలో జరుగుతున్న సామూహిక హత్యాకాండను ఇజ్రాయెల్ ఆడ్డూ అదుపూ లేకుండా కొనసాగించడంపై మండిపడ్డారు. ఇజ్రాయెల్‌ను దార్లోకి తేవాలంటే అన్నిరకాల సంబంధాలను ఆ దేశంతో తెంచుకోవాలని పిలుపు ఇచ్చారు. అమెరికా మిషన్ కూడా తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసింది. ఐక్యరాజ్యసమితి ఆర్థిక యుద్ధాన్ని ప్రోత్సహిస్తోందనిమండిపడింది.అమెరికాను, అమెరికా కంపెనీలను పేరుపెట్టి ప్రస్తావించడం ద్వారా ఆల్బనీస్ ఆర్థిక యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగాఉన్నఅమెరికాకంపెనీలకుఆమె హెచ్చరికలు పంపిస్తున్నారని పేర్కొంది.

**గాజాలో 118 మంది మృతి**


గడచిన 24 గంటలలో ఇజ్రాయెల్ సైన్యం దాడులలో 118 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో ఎక్కువమంది ఆహారంకోసం సహాయకేంద్రాల వద్దవేచిఉన్నపాలస్తీనియన్లే.వారిపై ఉద్దేశపూర్వకంగా అనేకరోజులుగా కాల్పులు జరుగుతున్నాయి. ఆకలితో సహాయ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు, నిరాయుధులపై ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరుపుతూ ప్రతిరోజూ సగటున పదిమందిని బలి తీసుకుంటున్నది. మరోవైపు ఇజ్రాయెల్ వైమానిక దళం నివాసిత భవనాలను, ఆసుపత్రులను ధ్వంసం చేస్తున్నది. గురువారం సహాయంకోసం వేచి ఉన్న 12 మందిని సైన్యం కాల్చి చంపింది.

# దాడులతో ఇరాన్ అణు కార్యక్రమాన్ని రెండేళ్ళు వెనక్కినెట్టాం : 'పెంటగాన్'



**పెంటగాన్:** ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలపై దాడులు చే యడం ద్వారా ఆ దేశ అణు కార్యక్రమాలను రెండు సంవత్సరాలు వెనక్కు నెట్టగలిగామని 'పెంటగాన్'లో అమెరికా రక్షణ వ్యవస్థ ప్రధాన అధికార ప్రతినిధి సియాన్ పార్నెల్ ప్రకటించారు. గురువారంనాడు ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ పన్నెండురోజులపాటు జరిగిన యుద్ధంలో ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఒకటీ లేదా రెండు సంవత్సరాలు వెనక్కు నెట్టగలిగామన్నారు. ఇరాన్‌లో అణు క్షేత్రాలను సంపూర్ణంగా నాశనం చేయలేకపోయామన్న పెంటగాన్ ఇంటిలిజెన్స్ అంతర్గత నివేదిక కొద్దిరోజుల క్రిందటే బయటకు పొక్కడంతో నానా యాగీ జరిగింది. కానీ ట్రంప్ మాత్రం ఇప్పటికీ ఇందుకు భిన్నంగా ఇరాన్ అణు వ్యవస్థను సర్వనాశనం చేశామని చెప్పుకుంటున్న తరుణంలో సియాన్ పార్నెల్ చేసిన సాధికార ప్రకటన ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ జూన్13న ఆకస్మిక మెరుపుదాడులతో యుద్ధం ప్రారంభించింది. ఈ యుద్ధం 12 రోజుల పాటు కొనసాగింది. ఐతే చివరి రెండు రోజుల్లో జూన్ 22న ఇరాన్‌లోని మూడు ప్రధాన అణుస్థావరాలైన ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లను ధ్వంసం చేశాయి. అమెరికా బి–2 బాంబర్ వాహక యుద్ధ విమానాలు 13,500 కేజీలు బరువైన బంకర్ బస్టర్ బాంబులను, క్షిపణులను, తోమాహక్ రాకెట్లను ఇందుకోసం ఉపయోగించాయి. 37 గంటలపాటు ప్రయాణం చేసి వెళ్ళి ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసినట్లు పెంటగాన్ వర్గాలు ప్రకటించాయి. ఐతే పూర్తిస్థాయిలో అవన్నీ ధ్వంసంకాలేదని తర్వాత నిర్ధారణైంది.

## ఆఫ్రికా వనరులు,వాణిజ్యంపై ట్రంప్ కన్ను
### ఐదు దేశాలతో వచ్చేవారం సమావేశం




వాషింగ్టన్ : ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలను విస్తరించుకునేవిషయాలు చర్చించేందుకు అమె రికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వచ్చే వారం ఒక కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఐదు ఆఫ్రికన్ దేశాలనాయకులుపాల్గొంటారు. ఆఫ్రికాఖండంలో ఉన్న అసాధారణమైన వాణిజ్య, వ్యాపార అవకాశాలపై ప్రధానంగా చర్చ జరుగుతుందని వైట్‌హౌస్ వర్గాలు తెలియజేశాయి. ఆఫ్రికా దేశాలలో ఉన్న అరుదైన ఖనిజ వనరులను, వ్యాపార ప్రయోజనాలను చేజిక్కించుకునేందుకు, చైనాను వెనక్కు నెట్టి ఆఫ్రికాఖండ దేశాల్లో పాపులారిటీ సాధించేందుకు ట్రంప్ 'మాగా' ప్రణాళికలో భాగంగా ఈకార్యక్రమాన్ని నిర్దేశించారు. ఇప్పటికే చైనా, రష్యాలు తమకు అనుకూలమైన భూమికలను నిర్మించుకున్నాయి. ప్రపంచంలో అమెరికాకు తిరిగి పూర్వవైభవం తీసుకువస్తానని ఎన్నికల్లో ప్రజలకు ట్రంప్ వాగ్దానం చేశారు. ఆఫ్రికా ఖండంలో వాణిజ్యానికి అపూర్వమైన అవకాశాలు ఉన్నాయని ట్రంప్ చెప్పారు. ఐతేయుఎస్ ఎయిడ్ కార్యక్రమాన్ని రద్దుచేయడంతో పేద ఆఫ్రికా దేశాలలో ప్రజలు తీవ్ర కష్టాలను ఇకమీదట ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఆఫ్రికాదేశాలతో ట్రంప్ దౌత్యసంబంధాలకు ఇకమీదట విఘాతం కలిగే అవకాశాలు ఉన్నా యి. ఈ కీలక తరుణంలో ట్రంప్ సమావేశం ప్రాముఖ్యత సంతరించుకోవడమేకాదు, ఆఫ్రికాదేశాలకు యుఎస్ ఎయిడ్ గురించి ఆయన ఎలాంటి సమాధానం ఈ సమావేశంలో చెబుతారన్న విషయం ఆసక్తికరంగా మారింది.

## బాలిలో పుట్టి మునిగి నలుగురు మృతి
### మరో 30 మంది గల్లంతు



**బాలి :** ఇండోనేసియాలో పుట్టి మునిగి నలుగురు మరణించారు. మరో 30 మంది ఈ ప్రమాదంలో కనిపించకుండా గల్లంతయ్యారు. మరో 31 మంది సజీవంగా ఒడ్డుకు చేరుకున్నారు. గల్లతైనవారి కోసం ఒక హెలికాప్టర్ పర్యవేక్షణలో 15 బోట్లలో బయలుదేరిన సహాయ బృందాలు ము మ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సుమారు మూడు మీటర్ల ఎత్తుకు ఎగసిపడుతున్న అలలు సహాయ బృందాల గాలింపు చర్యలకు ఆటంకంగా మారాయి. ఇప్పటివరకూ ఐదు మృతదేహాలను స్వాధీనం చేసుకోగా 31 మందిని సజీవంగా కాపాడారు. ఇందులో ప్రయాణిస్తున్నవారిలో ఎక్కువమంది ఇండోనేసియాకు చెందినవారే. ఈ నీటి వాహనంలో 53 మంది ప్రయాణికులు, 12 మంది పడవ సిబ్బంది ఉన్నారు. ఇండోనేసియాలోని ప్రధాన భూభాగం తూర్పు జావా పట్టణం కెటపాంగ్ పోర్టు నుండి ఐదు కి.మీ దూరంలో ఉన్న గిలిమనుక్ పోర్టుకు బయలుదేరిన అరగంట వ్యవధిలోనే దారిమధ్యలో సముద్రంలో సంక్లిష్టమైన వాతావరణంలో చిక్కుకుని మునిగిపోయింది. బుధవారం పొద్దుపోయిన తర్వాత పర్యాటకులతో ఈ ఫెర్రీ బయలుదేరింది. తాము ప్రయాణిస్తున్న నీటి వాహనం ఆకస్మికంగా మునిగిపోయిందని బాలిలోని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులు ఎకా టోనియాన్ స్యాన్ చెప్పారు. సమీపగతంలో ఇండోనేసియాలో జరిగిన ఇలాంటి ఘటనల్లో దాదాపు వందమంది వరకూ పర్యాటకులు మరణించారు.

# వీలైనంత త్వరగా మొబైల్, కంటేనర్ అంగన్‌వాడీ సెంటర్లు

### ప్రభుత్వ కార్యాలయాలకు శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తరలించండి
### సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తక్షణమే సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోకి మార్చాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. వీలనైంత త్వరగా అంగన్‌వాడీ సెంటర్లను అందుబాటులో ఉండేలా మొబైల్ అంగన్‌వాడీ, కంటేనర్ అంగన్‌వాడీల ను ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించి వెంటనే నిపుణులతో చర్చించి డిజైన్‌ను సిద్ధ చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపైన సచివాలయంలో మంత్రి సీతక్క గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, పోషకార మిషన్, ఉద్యోగ ఖాళీల భర్తీ, కారుణ్య నియమకాలు, అంగన్‌వాడీ సేవల్లో మహిళా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం, చిన్నారుల పోషకాహార మెరుగుదలకు అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకునేందుకు అన్ లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారుల్లో పోషకాహర లోపాలను తగ్గించే విధంగా కార్యచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల్లో పోషకాహర మెరుగుదల పరిశీలించేందుకు ప్రోగ్రెస్ రిపోర్ట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహారం విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా వందరోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సుప్రీం కోర్టు కేసు నేపథ్యంలో అంగన్‌వాడీ ఖాళీల భర్తీ, కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

**బాలామృతంలో మార్పులు...**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే బాలామృతంలో పలు మార్పులు చేశారు. నిపుణుల సిఫార్సు మేరకు టిజి ఫుడ్స్ పంచదార లేకుండా సరికొత్త బాలమృతంను సిద్ధం చేసింది. దీనిని మంత్రి సీతక్క రుచి చూసి పలు సూచనలు చేశారు . పిల్లలకు తీపి అనుభూతి కలిగించేలా కర్జూరా పౌడర్‌ను మిక్స్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహారం కోసం కిచిడీ మిక్స్, ఉప్మా మిక్స్‌లను కూడా సిద్ధం చేశారు. కాగా కిచిడీ మిక్స్, ఉప్మా మిక్స్‌లను మంత్రి సీతక్క రుచి చూశారు. ఈ సమీక్ష సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సృజన, తెలంగాణ ఫుడ్స్ ఎండి కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**మహిళా సంఘాలకు ఆర్‌టిసి ద్వారా రూ కోటీ ఆదాయం ...**

ఆర్‌టిసి అద్దె బస్సుల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు రూ.కోటి ఆర్జించాయని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటి వరకు మహిళా సంఘాలు ఆర్‌టిసికి 150 బస్సులను అద్దె ప్రాతిపదికన అప్పగించాయి. ఒక్కో బస్సుకు ఆర్‌టిసి రూ.70 వేలు చెల్లిస్తోంది. ఒక్క నెలకు మహిళ సంఘాలు కోటి రూపాయలు రానున్నాయి. దీనికి సంబంధించి మొదటి నెల అద్దెను ఆయా మహిళా సంఘాలకు ఆర్‌టిసి చెల్లించింది. మహిళా సంఘాలకు అద్దె బస్సులకు అవకాశం కల్పించినందుకుగాను మంత్రి సీతక్క రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలిపారు. కాగా ఈ నెల 5న ప్రజా భవనలో ఆర్‌టిసి బస్సు ఓనర్లుగా మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.

## కెసిఆర్‌కు అనారోగ్యం
(మొదటి పేజీ తరువాయి)

సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారని, ఇది రెగ్యులర్ హెల్త్ చెకప్‌లో భాగమేనని బిఆర్ఎస్ వర్గాలు అధికారికంగా వెల్లడించారు. ఇదిలా ఉండగా కెసిఆర్ ఆరోగ్యం గురించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లోని డాక్టర్లు, అధికారులతో మాట్లాడి, కెసిఆర్‌కు ఉత్తమ చికిత్స అందించాలని వైద్యులను సిఎం కోరారు. కెసిఆర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఇన్సూరెన్స్ వర్తించదు
(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నామని సుప్రీం బెంచ్ తెలిపింది. 2014, జూన్ 18వ తేదీన బాధిత వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. మల్లసంద్ర గ్రామం నుంచి అరిసకేరి పట్టణానికి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. బాధిత వ్యక్తి ఎన్‌ఎస్ రవిశ కారు ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో కారులో అతని తండ్రి, సోదరుడు, పిల్లలు ఉన్నారు. చాలా నిర్లక్ష్యంగా బాధితుడు తన కారును డ్రైవ్ చేసినట్లు కోర్టు తెలిపింది. ట్రాఫిక్స్ రూల్స్ పాటించలేదని, దాని వల్లే వాహనం కంట్రోల్ తప్పిందని కోర్టు చెప్పింది. ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రవిశ ఆ తర్వాత ప్రాణాలు విడిచాడు. బాధిత వ్యక్తి ర్యాష్‌గా, నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లే యాక్సిడెంట్ జరిగిందని హైకోర్టు తన తీర్పులో చెప్పింది. ఈకేసులో వారసులెవరైనా చట్టపరమైన పరిహారాన్ని కోరలేరని పేర్కొన్నది. నిబంధనలను అతిక్రమించి తప్పు చేసిన వ్యక్తికి పరిహారాన్ని ఇవ్వడం కరెక్టు కాదు అని కోర్టు వెల్లడించింది.

## న్యాయ సమరభేరి
(మొదటి పేజీ తరువాయి)

ఎంపిలు కార్పొరేషన్ చైర్మన్లు కలిపి దాదాపు 40 వేల మంది హాజరుకానున్నారు. 'సామాజిక న్యాయ సమర భేరి పేరు'తో సభలో గ్రామ అధ్యక్షులకు ఎఐసిసి జాతీయ అధ్యక్షులు ఖర్గే దిశా నిర్దేశం చేస్తారని మహేస్‌కుమార్‌గౌడ్ చెప్పారు. సమర భేరి సభను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, 'సామాజిక న్యాయ సమర భేరి సభ'కు హాజరయ్యేందుకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గురువారం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఖర్గేకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో బస చేసిన ఖర్గేతో పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు భేటీ అయ్యారు.

## ఎల్లో హెచ్చరికలు
(మొదటి పేజీ తరువాయి)

క్రమంగా పెరుగుతోంది. సాగర్ జలాశయ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు (312.04 టిఎంసిలు) కాగా ప్రస్తుతం 519.80 అడుగులు (148.94 టిఎంసిలు)గా ఉంది. ఈ ఏడాది సాగర్ ఆయకట్టుకు ముందుగానే నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**మేడిగడ్డకు పెరిగిన వరద ఉధృతి...**అటు గోదావరి బేసిన్‌లో మేడిగడ్డ బ్యారేజికి వరద ప్రవాహం పెరిగింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ నుంచి ప్రవాహం వచ్చి చేరుతోంది. పైనుంచి 71,900 క్యూసెక్కుల ప్రవాహం బ్యారేజికి చేరుతోంది. బ్యారేజి ఏడో బ్లాక్ దెబ్బతిన్నప్పటి నుంచి పూర్తి స్థాయిలో గేట్లు ఎత్తివేసి ఉండటంతో వరదనీరు కిందకు పోతోంది. 85 గేట్లు ఎత్తి ఉండడంతో 71,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద జలకళ సంతరించుకుంది. గోదావరి, ప్రాణహిత నదులకు జులై ప్రారంభంలోనే వరద రావడంతో కళకళలాడుతున్నాయి.

## నేటికి వాయిదా
(మొదటి పేజీ తరువాయి)

రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు. వారు చేస్తోన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమే. గ్రూప్–1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95శాతం, ఆంగ్లమాధ్యమం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు.

టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎవాల్యుయేటర్‌కు ఏమైనా మార్గదర్శకాలున్నాయా అని ప్రశ్నించింది. టిజిపిఎస్‌సి నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను ఉన్నత న్యాయస్థానం రేపటికి వాయిదా వేసింది.

## డిసెంబర్ 9న ఆవిష్కరణ
(మొదటి పేజీ తరువాయి)

(మాన్యుఫాక్చరింగ్, నిర్మాణ, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా) వృద్ధి రేటు 9.6 శాతం కాగా, అదే జాతీయ సగటు 8.3 శాతం మాత్రమేనని తెలిపారు. తెలంగాణ తయారీ రంగం గ్రాస్ వాల్యూ యాడెడ్(జీవీఏ) 2022–23 లో రూ.1.34 లక్షల కోట్లు ఉండగా, 9 శాతం వృద్ధి చెంది అది 2023–24 లో ₹1.46 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. తెలంగాణ జిఎస్‌డిపిలో తయారీ రంగం వాటా 19.5 శాతమని, అదే జాతీయ స్థాయిలో 17.7శాతం మాత్రమేనని అన్నారు. 2023–24లో తెలంగాణ తయారీ రంగ ఎగుమతులు రూ.1.2 లక్షల కోట్ల మార్క్ ను దాటాయని వివరించారు. ఇవి అంకెలు కాదని, సిఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా ప్రగతిపథంలో దూసుకెళ్తున్న తెలంగాణ విజయగాథ అని చెప్పారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన 'తెలంగాణ'తో చేతులు కలపాలని మంత్రి శ్రీధర్‌బాబు మరోసారి జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. నిబంధనల పేరిట వేధించే ప్రభుత్వం కాదు ఇది... మీ భుజం తట్టి మిమ్మల్ని అన్ని రకాలుగా ప్రోత్సహించే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వమని అన్నారు.

## హెల్పర్స్‌కు గుడ్‌న్యూస్
(మొదటి పేజీ తరువాయి)

పదోన్నతి లభించనుంది. గరిష్ట వయో పరిమితిని పెంచాలని అంగన్‌వాడి హెల్పర్ యూనియన్లు ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేయగా, వాటి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అర్హత కలిగిన 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎటువంటి అడ్డంకులు లేవని అధికారులు నివేదిక సమర్పించారు. ఇటీవలే అంగన్‌వాడి టీచర్ల రిటైర్‌మెంట్ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో 50 ఏళ్ల వయస్సులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లకు మరో 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని అధికారులు మంత్రి సీతక్కకు సూచించారు. ఈ నేపథ్యంలో 45 సంవత్సరాల వయస్సు దాటిన అర్హులైన హెల్పర్లకు పదోన్నతులు కల్పించే దస్త్రాంపైన మంత్రి సంతకం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది అంగన్‌వాడి హెల్పర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారులకు నియామక ఉత్తర్వులు
(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు తెలిపారు. మరోసారి జిపిఒ పరీక్ష నిర్వహించాలని కోరగా, అందుకు సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ సమావేశంలో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్,అసోసియేట్ అధ్యక్షులు రాజుకుమార్, ఉపాధ్యక్షులు నిరంజన్, గుర్రం శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, వెంకటేష్‌తో పాటు నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆరవ జోన్ సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహశీల్దార్ పదోన్నతి కల్పించండి

అరవ జోన్ సీనియర్ అసిస్టెంట్‌లకు నాయబ్ తహశీల్దార్లుగా పదోన్నతులు కల్పించాలని ట్రెసా ప్రతినిధుల బృందం రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్‌కుమార్‌ను కోరింది. అరవ జోన్ సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతి సమస్యను న్యాయస్థానం పరిష్కరించిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి కోరారు. అందుబాటులో ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుని వెంటనే అర్హులైన వారికి పదోన్నతులను కల్పించాలని, గతంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్‌ల పరస్పర బదిలీలకు అనుమతి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్‌కుమార్‌ను కోరారు. 61 సంవత్సరాలు పై బడిన విఆర్‌ఎల వారసుల కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఇతర శాఖలకు కేటాయించిన వారిని రెవెన్యూ శాఖకు,అలాగే రెవెన్యూశాఖలో ఇతర జోన్లకు, జిల్లాలకు కేటాయించిన వారిని సొంత జిల్లాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. విఆర్‌ఎ నుండి జూనియర్ అసిస్టెంట్ గా క్రమబద్ధీకరించిన ఉద్యోగులకు ఇంక్రిమెంట్ల విషయంలో కొన్ని జిల్లాలో అడ్డంకులు ఎదురవుతున్నాయని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఆదేశాలు జారీ చేస్తే జూనియర్ అసిస్టెంట్‌ల సమస్య కూడా పరిష్కారానికి నోచుకుంటుందని తెలిపారు. దీనిపైన లోకేష్ కుమార్ సానుకూలంగా స్పందించినట్టు ట్రెసా ప్రతినిధి బృందం తెలిపింది.

## ఆగస్టులో టెండర్లు
(మొదటి పేజీ తరువాయి)

తోట లక్ష్మీ కాంతరావు, ఈఎన్‌సి టి.జయభారతి, సిఈలు మోహన్‌నాయక్, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పలువురు ఎస్‌ఈలు, ఈఈలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రతి రోడ్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ ఆరు లైన్ల రోడ్డు కోసం త్వరలో క్యాబినెట్ అమోదం లభిస్తుందని, టెండర్ ప్రక్రియ వేగవం తం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.6500 కోట్లతో రూరల్ రోడ్స్ టెండర్లు పిలిచామని, రోడ్ల నిర్మా ణం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. రోడ్లు తమ కోసం, కాంట్రాక్టర్ల కోసం కాదని, ప్రజల కోసమని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ గా ఉండేలా రోడ్ల నిర్మాణం చేపడుతామని, రూరల్ రోడ్లన్నింటినీ రానున్న మూడేళ్లలో ఏండ్లలో పూర్తిచేస్తామన్నారు. రోడ్డు సేఫ్టీ కింద బ్లాక్ స్పాట్స్ గుర్తించి పనులు జరుపుతున్నామన్నారు. చిన్న కాంట్రాక్టర్ల పెండిగ్ బిల్స్ ఈనెలలో చెల్లిస్తామన్నారు.

### వానకాలం సీజన్‌లో అలెర్ట్‌గా ఉండాలి

వానకాలం సీజన్‌లో అలెర్ట్‌గా ఉండాలని, బ్రిడ్జి, కల్వర్టులు వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల ప్యాచ్‌వర్క్‌ల కోసం ఈనెలలో సుమారు రూ. 140 కోట్లు విడుదల చేయనున్నట్లు మంత్రి చెప్పారు. హ్యామ్ రోడ్లపై సిఎం ప్రత్యేకంగా దృష్టి సారించారని, 5,190కి.మీ. రోడ్లకు సంబంధించి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.

### కెసిఆర్ వస్తే అన్ని అంశాలపై చర్చ

అసెంబ్లీకి ప్రతిపక్ష నేత, మాజీ సిఎం కెసిఆర్ రావాలని, ఆయన వస్తే అన్నిఅంశాలపై చర్చ జరుపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు హరీష్‌రావు, కెటిఆర్‌తో తమకు సంబంధంలేదని, వారు లెక్కలోకి రారన్నారు. కెసిఆర్, తాము తెలంగాణ ఉద్యమంలో పనిచేశామని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ఆయనతో అన్ని విషయాలు చర్చిస్తామన్నారు. హరీష్‌రావు ఉత్తి ఎంఎల్‌ఎ అని, ఆయన అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కూడా కాదన్నారు. అసెంబ్లీకి కెసిఆర్ వచ్చి తమ ప్రభుత్వ తప్పు ఒప్పులు, ఏమైనా లోపాలుంటే చెప్పాలన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యది

### కొణిజేటి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలి : సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో 16సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనతను మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య దక్కించుకున్నారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కొనియాడారు.

మాజీ సిఎం కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా గురువారం సిఎం రేవంత్‌రెడ్డి ఆయనను స్మరించుకున్నారు. రోశయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని తమ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసి అరుదైన గౌరవం ఆయనకు కల్పించిందని తెలిపారు. రోశయ్య సుమారు 50 ఏళ్ళు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారని, వివాద రహితుడిగా పేరు పొందారని సిఎం అన్నారు. సమైక్య ఎపికి ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తర్వాత తమిళనాడు గవర్నర్‌గా కూడా ఆయన సేవలందించారన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

నెం. G2/836/2025 తేదీ: 21.06.2025
Gaz. No.92/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం. 6, ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలములోని మేడిపూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన ఎ.5.30 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ - 28 (ML-11 Minor of MJR-1) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు 5.30 గు. భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 28 (ML-11 Minor of MJR-1) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: మేడిపూర్ మండలం: తాడూర్ జిల్లా: నాగర్ కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూమి వర్గీకరణ మెట్ట/తరి | సేకరించవలసిన విస్తీర్ణం | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 157 | పట్టా | మెట్ట | 1.10 1/2 | బర్గెల పరుశరాములు తండ్రి లక్ష్మయ్య(0.09) బుద్దారం రాములు తండ్రి లక్ష్మయ్య (0.08) బుద్దారం రాములు తండ్రి లక్ష్మయ్య (0.03) బుద్దారం నారమ్మ భర్త జంగయ్య (0.05) బుద్దారం నారాయణ తండ్రి కాశన్న (0.05) గుబ్బ రమేష్ తండ్రి అంతయ్య (0.03 1/2) బుద్దారం రాములు తండ్రి లక్ష్మయ్య (0.06) బర్గెల రాంచంద్రయ్య తండ్రి లక్ష్మయ్య(0.08) కొండకింద సుగుణమ్మ భర్త మోహన్ రెడ్డి(0.03) మల్లెపల్లి వెంకటేశ్వరమ్మ భర్త వెంకట రెడ్డి బుద్దారం బాలమ్మ భర్త రాములు బర్గెల రాంచంద్రయ్య తండ్రి లక్ష్మయ్య బుద్దారం అంజనేయులు తండ్రి నారాయణ బర్గెల విజయ్ తండ్రి రాంచంద్రయ్య | VB | 158 | 182 | 156 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 158 | పట్టా | మెట్ట | 0.30 | దొడ్డ ముత్యాలమ్మ భర్త రాంరెడ్డి (0.08) కొలను సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి (0.07) దొడ్డ రాధా భర్త రాజేందర్ రెడ్డి (0.06) దొడ్డ పూజ్యవతి భర్త శేఖర్ రెడ్డి (0.09) ముచ్చర్ల అరుణమ్మ, భర్త తిరుపతయ్య దొడ్డ అశోక్ రెడ్డి తండ్రి రాంరెడ్డి దొడ్డ సంకీర్త్ రెడ్డి తండ్రి తిరుమల రెడ్డి | 157 | 180 | VB | 159 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 180 | పట్టా | మెట్ట | 0.35 | దొడ్డ పూజ్యవతి భర్త శేఖర్ రెడ్డి (0.09) దొడ్డ రాధా భర్త రాజేందర్ రెడ్డి (0.08) కొలను సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి (0.07) దొడ్డ ముత్యాలమ్మ భర్త రాంరెడ్డి (0.11) దొడ్డ అశోక్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి దొడ్డ మమత భర్త అశోక్ రెడ్డి దొడ్డ సంకీర్త్ రెడ్డి తండ్రి తిరుమల రెడ్డి | 158 | 189 | 181 | 180 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 179 | పట్టా | మెట్ట | 0.09 | కొలను సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి (0.01) మల్లెపల్లి సుమతమ్మ భర్త కాశిరెడ్డి (0.01) వనంపల్లి వెంకటరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.02) కొలను సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి (0.02) మల్లెపల్లి జైపాల్ రెడ్డి తండ్రి పాపిరెడ్డి (0.01) యం. రమేష్ రెడ్డి తండ్రి కాశిరెడ్డి (0.01) మల్లెపల్లి కాశిరెడ్డి తండ్రి నర్సయ్య (0.01) యం. సాయికుమార్ రెడ్డి తండ్రి కాశిరెడ్డి | 180 | 177 | 180 | 178 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 189 | పట్టా | మెట్ట | 0.26 | గుడ్డటి రాంచంద్రమ్మ భర్త రంగారెడ్డి (0.02) వనంపల్లి లక్ష్మీ దేవమ్మ భర్త రాంరెడ్డి (0.01) వడకట్టు నరసింహ్మా తండ్రి శ్రీనివాసులు (0.02) వడకట్టు నరసింహ్మా తండ్రి శ్రీనివాసులు (0.03) గుడ్డటి వరలక్ష్మమ్మ భర్త తిరుపతిరెడ్డి (0.02) వడకట్టు నరసింహ్మా తండ్రి శ్రీనివాసులు (0.01) ఎడ్ల సాయన్న తండ్రి చిన్న నర్సింహ్మా(0.03) ఎడ్ల సాయన్న తండ్రి చిన్న నర్సింహ్మా(0.02) ఎడ్ల తిరుపతయ్య తండ్రి చిన్న నర్సింహ్మా(0.03) మల్లెపల్లి సుజాతమ్మ భర్త జైపాల్ రెడ్డి (0.03) మల్లెపల్లి సంజీవరెడ్డి తండ్రి పాపిరెడ్డి(0.01) గుడ్డటి రంగారెడ్డి తండ్రి రఘుమారెడ్డి(0.02) మల్లెపల్లి జైపాల్ రెడ్డి తండ్రి పాపిరెడ్డి(0.01) కె. అనిత భర్త లక్ష్మారెడ్డి వి. రాధ భర్త వెంకటరెడ్డి ఎస్. రాజశేఖర్ తండ్రి కొండయ్య ఎ. గౌతమి భర్త రవికాంత్‌రెడ్డి జి. రాంచంద్రమ్మ భర్త రంగారెడ్డి | 180 | 175 | 188 | 177 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 188 | పట్టా | మెట్ట | 0.22 | దొడ్డ లక్ష్మమ్మ భర్త రామకృష్ణారెడ్డి ((0.03) మల్లెపల్లి బాల్ రెడ్డి తండ్రి వెంకారెడ్డి (0.05) మల్లెపల్లి జైపాల్ రెడ్డి తండ్రి పాపిరెడ్డి(0.04) దొడ్డ ముత్యాలమ్మ భర్త రాంరెడ్డి (0.03) దొడ్డ ముత్యాలమ్మ భర్త రాంరెడ్డి (0.04) మల్లెపల్లి సంజీవరెడ్డి తండ్రి పాపిరెడ్డి (0.03) నీల శ్రీను తండ్రి ముత్యాలు డి. ముత్యాలమ్మ భర్త రాంరెడ్డి యం. బాల్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి మల్లెపల్లి సుజాతమ్మ భర్త జైపాల్ రెడ్డి మల్లెపల్లి సంజీవరెడ్డి తండ్రి పాపిరెడ్డి | 181 | 197 | 187 | 189 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 190 | పట్టా | మెట్ట | 0.21 | గుడ్డటి తిరుపతి రెడ్డి తండ్రి రఘుమారెడ్డి (0.03) గుడ్డటి రంగారెడ్డి తండ్రి రఘుమారెడ్డి (0.04) కొలను సుధాకర్ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి (0.02) గుడ్డటి శ్రీనివాస్ రెడ్డి తండ్రి రఘుమారెడ్డి (0.03) ఎల్లంకి ఇందిరా భర్త వెంకటేశ్వరరావు (0.04) వడకట్టు నరసింహ్మా తండ్రి శ్రీనివాసులు (0.03) గుడ్డటి వరలక్ష్మమ్మ భర్త తిరుపతిరెడ్డి (0.02) ఎస్.రాజశేఖర్ తండ్రి కొండయ్య ఎ. గౌతమి భర్త రవికాంత్ రెడ్డి | 189 | 196 | 188 | 175 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 186 | పట్టా | మెట్ట | 0.26 | గుడ్డటి జంగమ్మ భర్త కృష్ణారెడ్డి (0.05) నీల జంగమ్మ భర్త ముత్తయ్య (0.04) బోడ లక్ష్మయ్య తండ్రి జంగయ్య (0.03) నీల శ్రీను తండ్రి ముత్యాలు (0.03) కొంగండ్ల రామస్వామి తండ్రి బీరయ్య (0.04) బోడ తిరుపతయ్య తండ్రి జంగయ్య (0.04) యం. కిష్టమ్మ భర్త నారాయణ రెడ్డి (0.03) డి. ముత్యాలమ్మ భర్త రాంరెడ్డి | 187 | VB | 185 | 197 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 197 | పట్టా | మెట్ట | 0.10 1/2 | పోలాస్ అశోక్ తండ్రి మన్యంకొండ (0.01) పోలాస్ నారాయణ తండ్రి రాగయ్య (0.01) యజ్ఞ భగవాన్ తండ్రి నరహరి దీక్షితులు (0.02) పోలాస్- రేణయ్య తండ్రి రాగయ్య (0.02 1/2) పి. మహేశ్వర్ తండ్రి రాంచంద్రయ్య (0.01) పోలాస్ రాజు తండ్రి మన్యంకొండ (0.03) బి. శ్రీహరినాథ్ తండ్రి నరహరదీక్షితులు బి. సీతప్రజ్ఞ తండ్రి శ్రీహరినాథ్ పి. కృష్ణయ్య తండ్రి రాగయ్య | 190 | VB | 186 | 196 | లేవు | లేవు | లేవు | లేవు |
| మొత్తం : 5.30 | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి **జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్,** మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వ నైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సేకరించబడవు. పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము - II మరియు అధ్యాయము -III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్
DIPR RO NO.341/LA/PP/Advt/Pub/2025-26


## బిసిల గురించి మాట్లాడే అర్హత కవితకు లేదు

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ శూన్యంతో ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తన మనుగడ కోసం బిసిల జపం చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. పదేళ్లు బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం వెలగబెట్టారని, పదేళ్లలో బిసిల గురించి కవిత మాట్లాడినట్లు ఒక్క ఆధారాన్ని అయినా చూపించగలరా అని ప్రశ్నించారు. ఇప్పుడు బిసిల గురించి మాట్లాడటానికి కవితకు అర్హతలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కాదా అని నిలదీశారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌సి కవిత ఎఐసిసి జాతీయ అధ్యక్షులు ఖర్గేకు లేఖ రాయడం విడ్డూరంగా, వింతగా, విచిత్రంగా ఉందని, ఆమె లెటర్ రాయడం నవ్వి పోదురు గాక నాకేమి సిగ్గు అన్నట్టు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. పైగా కవిత జాగృతి సంస్థ తరపున రాశారా? బిఆర్‌ఎస్ తరపున రాశారా స్పష్టత లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండిన, స్థానిక సంస్థలతో పాటు విద్య, వైద్యలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతమన్నారు. బిసిల గురించి కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ సమయంలో కవిత లిక్కర్ స్కామ్‌లో జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారన్నారు. నిరుద్యోగుల ఉసురు తగిలి బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయిందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో బిసి చట్టంచేసి చట్టబద్ధత కోసం కేంద్రానికి పంపామన్నారు. కవిత ఏ రోకో చేసినా సరే కానీ పదేళ్లు అధికారంలో ఉండి ఏమి చేశారో చెప్పి రైల్ రోకో చేయాలన్నారు. కుటుంబంలో ఆస్తి పంపకాల వాట తెగిందా అని కవితని సూటిగా అడుగుతున్నానన్నారు.

**సిఎం చేసిన సవాల్‌కు మాజీమంత్రి హరీష్‌రావు సిద్ధమా?**

బనకచర్లపై సిఎం రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌కు మాజీ మంత్రి హరీష్‌రావు సిద్ధమా అని ప్రశ్నించారు. ఆనాడు ఎపి ప్రభుత్వ నేతలతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగింది. రోజా ఇంట్లో చేపల పులుసు తిని నీటి వాటా విషయంలో కాంప్రమైజ్ అయింది బిఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దలు కాదా అని ప్రశ్నించారు. బనకచర్ల విషయంలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ మధ్య ఫెఫికాల్ బంధముందన్నారు. మతతత్వ పార్టీతో లౌకికవాద పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి ఏమి సంబంధమని ప్రశ్నించారు. తెలంగాణ టిడిపి కోవర్టులు ఉన్నారని ఎంఎల్‌ఎ అనిరుధ్ రెడ్డి ప్రకటన చేసిన విషయాన్ని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ పర్యవేక్షిస్తుందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.



ఢిల్లీలో జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర నేతలు

## ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు

### హార్టికల్చర్, సెరికల్చర్ అధికారులకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి దిశా నిర్దేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అన్ని చర్యలను తీసుకోవాలని అధికారులకు రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో బుధవారం హార్టికల్చర్, సెరికల్చర్ అధికారుల సంఘం నేతల తో చైర్మన్ సమావేశమైయ్యారు. ఈ సమావేశంలోకమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, చెవిటి వెంకన్న, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవిందు, వ్యవసాయ అధికారి వెంకట హరి ప్రసాద్, రజిత, ఉద్యానవన శాఖ అధికారుల సంఘం నేతలు సందీప్, విద్యాసాగర్, పరిశ్రమల అధికారుల సంఘం నేతలు శ్రీనివాస్, ఇంద్రసేనా రెడ్డి తోపాటు ఇతర హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమల బలోపే తం కోసం తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు రాష్ట్రానికి లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు దిగుమతిని అవుతున్నాయన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు పెరగాలని ఇందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



**చైర్మన్ ముందు సమస్యల ఏకరువు :** ఉద్యానవన శాఖలో ఉద్యోగుల కొరత, కూరగాయల సాగు చేసే రైతులకు ఎదురవుతున్న సమస్యలపై అధికారులు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా గత కొన్నేండ్లుగా ఉద్యానవన శాఖలో ఉద్యోగాల భర్తీ చేయక పోవడంతో పనిభారం పెరిగిందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60మంది హార్టికల్చర్ అధికారులే వున్నారని, దాంతో రైతులకు ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించ లేకపోతున్నట్లు కమిషర్‌కు తెలిపారు. మరోవైపు కూరగాయలు సాగుచేసే రైతులకు మార్కెట్లు అందుబాటులో లేకపోవడం, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులు కూడా యంత్ర పరికరాలతో పాటు ఆధునిక పద్ధ తులను అవలంబించకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు. లాభసాటి సాగైన పట్టు పరిశ్రమలో సైతం ఉద్యోగుల కొరత తీవ్రంగా వుందని, ఏటా ఐదారు పంటలు సాగుచేసుకునే అవకాశం వున్నా అవగాహన లేకపోవడంతోనే రైతులు ఇటువైపు రావడం లేదని కమిషన్‌కు విన్నవించారు. పట్టు పురుగుల పెంపకం ద్వారా ప్రతి నెల ఆదాయం రాబట్టు కోవచ్చని, కానీ ఈ పరిశ్రమను గత 10 ఏళ్లగా తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడమే కాకుండ గత ప్రభుత్వం సెరికల్చర్ డిపార్ట్‌మెంట్, హార్టికల్చర్ లో కలపడం వల్ల.. నిర్వీర్యమైందని పట్టు పరిశ్ర మ శాఖ అధికారులు తెలిపారు. ఎలాంటి నష్టం లేని పంట పట్టు పురుగుల సాగని, దీన్ని ప్రోత్సహి స్తే.. రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశాలు పుష్కలంగా వున్నాయని వివరించారు. దీంతో రెండు శాఖల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, ఇతర అంశాలన్ని రాత పూర్వకంగా ఇవ్వాలని కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అధికారులను కోరారు.

## ప్రజా వ్యతిరేక విధానాల ఉపసంహరణకు డిమాండ్

### భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియూసి)రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం ( సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు, బిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి పి నారాయణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి .అనురాధ,స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.కుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఇ.విజయ్,బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామళ్ళ ఐలన్న పిలుపునిచ్చారు హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఎసి నేతలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారాంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తన కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చి కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ను విజయవంతం చేయాలని వారు కోరారు. భవన నిర్మిణ కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాస్తూ భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో మార్పులు తెచ్చారని వీటిని తిప్పి కొట్టాలన్నారు. అందుకే ఈ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం అంతా ఐక్యంగా పోరాడాలని కోరారు . ఇందులో భాగంగా ఈనెల 4, 5 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించాలని, 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ 6,7,8 తేదీల్లో అడ్డాల వద్ద ప్రచార జాతలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి)వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, కమతం యాదగిరి,భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరి రాములు, స్ఫూర్తి సంఘం అధ్యక్షులు జి చంద్రమౌళి కార్యదర్శి ఎన్ రవి, సిహెచ్ శ్రీనివాస్, సరళ, రాజు తదితరులు పాల్గొన్నారు.







## 4 లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

### వామపక్ష యువజన సంఘాల నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా యువజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వామపక్ష యువజన సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొనున్నట్లు వారు వెల్లడించారు. ఎఐవైఎఫ్ రాష్ట్రకార్యాలయంలో బుధవారం ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ, పివైఎల్ సంఘాల రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షు డు కోటా రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుండే కార్మికుల అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కుదించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభు త్వం 4కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని మండి పడ్డారు. ఈ కోడ్‌ల విధానా న్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో యువత పెద్దఎత్తున పాల్గొన్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నె ర్లకంటి శ్రీకాంత్, పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రవి కుమార్ పాల్గొన్నారు.

## చలన చిత్రాల పైరసీని అరికట్టేందుకు కమిటీ

### ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌డిసి కార్యాలయంలో బుధవారం ఎఫ్‌డిసి ఎండి సి.హెచ్ ప్రియాంకతో కలిసి దిల్‌రాజు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉపముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహించామని, సినీ పరిశ్రమ ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎఫ్‌డిసి నోడల్ ఏజెన్సీగా, ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటుచేసి తద్వారా సినిమా షూటింగ్‌లకు ఆన్‌లైన్ అనుమతుల ప్రాసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్‌డిసి ఎండి సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, సినీ పరిశ్రమకుకు సంబంధించిన సమస్యలను ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



## 8న అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లండి: ఎమ్మెల్సీ కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాలల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో రాష్ట్రంలోని అఖిలపక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న తలపెట్టిన రైల్ రోకో పోస్టర్‌ను ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ బిల్లులను నెలల తరబడి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. బిసి రిజర్వేషన్లు తేలకుండా ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని ఆమె ప్రశ్నించారు.

రిజర్వేషన్లను తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కవిత విజ్ఞప్తి చేశారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్.

NIT No. 15/EE-7(4B)/CRZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నిర్వహణ పనులు

**పని పేరు:** క్ర.సం.1 నుండి 10 వరకు. **అంచనా విలువ:** రూ.49.08లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04.07.2025న మ.02.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 08.07.2025న మ.02.15గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ పీర్ సింగ్, ఇఇ (ఎఫ్ఎసి), సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్ మస్కతి గ్రౌండ్, దరబ్ జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్. ఫోన్ నం. 9154960551. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 4543-PP/CL/ADVT/1/2025-26, Date: 03-07-2025

శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము
గ్రా|| చెరువుగట్టు, మం|| నార్కట్‌పల్లి, జి|| నల్లగొండ - 508254, తెలంగాణ.

లేఖ నెం: 88/ఎస్.పి.జె. ఆర్.ఎస్.డి./2025, టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన తేది: 03.07.2025

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియపరుచునది ఏమనగా! శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము, చెరువుగట్టు నందు ఈ దిగువ చూపబడిన కాలపరిమితికి ఈ దిగువ చూపబడిన గుట్టపైన కొబ్బరికాయలు విక్రయించుకొను హక్కును దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో తేది: 09-07-2025, బుధవారము రోజున ఉ.11.00 గంటల నుండి గట్టుపైన మహామండపము నందు నిర్వహించుటకు నిర్ణయించడమైనది. ఇట్టి హెచ్-1 వేలము హక్కుకు మొదటగా బహిరంగ వేలము తదుపరి సీల్డు టెండర్లు నిర్వహించబడును. ఇట్టి హెచ్-1 వేలము హక్కుకు టెండరు షెడ్యూలు పొందిన వారు తేది: 09-07-2025 రోజున ఉ. 11.00 గంటలకు దేవస్థాన మహామండపము నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అట్టి సీల్డు టెండర్లను అదే రోజు మ. 12.00 గంటలకు తెరువబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిటు (రూ) |
|---|---|---|
| | తేది. 15-07-2025 నుండి 14-07-2026 వరకు | |
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు (H-1) | 5,00,000.00 |
| 2. | గొర్రెపొట్టేళ్ళు, మేకపోతులు సేకరించుకొను హక్కు | 3,00,000.00 |
| 3. | పాదరక్షలు భద్రపర్చుకొను హక్కు | 20.000.00 |

ఇట్టి సీల్డు టెండరులో పాల్గొనుటకు ఆసక్తి కలవారు తేది: 07-07-2025 మరియు 08-07-2025 రోజులలో కార్యాలయ పనివేళలు ఉ. 10.00 గంటల నుండి సా. 5.00 గంటల వరకు ఒక్కొక్క షెడ్యూలుకు రూ.500/- చెల్లించి రశీదు పొందగలరు. ఇట్టి టెండర్లకు సంబంధించిన పూర్తి వివరములు దేవస్థాన కార్యాలయ పని వేళలలో అడిగి తెలుసుకొనగలరు. లేదా దేవస్థాన ఫోన్ నెం: 9491000701 లను సంప్రదించగలరు.

సం/- ఎస్.నవీన్, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 4555-PP/CL/ADVT/1/2025-26, Date: 03-07-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 04 జులై

## బిజెపి బిసి జపం ఏమాయే!

ఎట్టకేలకు రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులుగా న్యాయవాది, శాసనమండలి మాజీ సభ్యులు నారపరాజు రామచందర్ రావు ఎన్నికయ్యారు. ఆయనకు బాహ్య సవాళ్ల కంటే అధికంగా అంతర్గత సవాళ్ళే స్వాగతం పలుకుతున్నాయి. రామచంద్రరావు ఎన్నిక ఏకగ్రీవమని బిజెపి జాతీయ పరిశీలకురాలు శోభా కరద్లాంజే ప్రకటించినప్పటికీ, నామినేషన్‌ల పర్వంలోనే నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి తనను నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారంటూ సీనియర్ శాసనసభ్యుడు రాజాసింగ్ పార్టీకి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ కార్యాలయం వద్దే ప్రకటించారు. ఆయన అతివాద హిందూత్వవాదిగా పేరు. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత వరుసగా మూడు సార్లు బిజెపి టిక్కెట్‌పై విజయం సాధించిన ఏకైక ఎంఎల్‌ఏ. గత శాసనసభలో ఆ పార్టీ తరుపున కూడా ఆయనొక్కరే గెలిచారు. వర్తమాన శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది మంది బిజెపి సభ్యులలో రాజాసింగ్ మినహా, మిగతావారంతా కమలం గుర్తుపై మొదటిసారి ఎన్నికైన వారే. రాజీనామా ద్వారా విసిరిన సవాలు నూతన అధ్యక్షుడు రామచందర్‌రావుకు ఒక సవాలే. అంతకు మించి బిజెపిలో కొత్త, పాత నాయకుల మధ్య అంతరాలకు తోడు, ఎంపిలు, ఎంఎల్‌ఏలు వ్యక్తులుగా, బృందాలుగా విడిపోయారనేది సర్వవిదితమే. శాసనసభ ఎన్నికలకు ముందు దూకుడుగా వ్యవహరించిన నాటి అధ్యక్షుడు బండి సంజయ్‌ను అకస్మాత్తుగా తొలగించి, పాతకాపు కిషన్‌రెడ్డికి కాషాయపార్టీ అధిష్ఠానం పగ్గాలను కట్టబెట్టింది. ఆయన పదవీ కాలం పూర్తయి గడిచినప్పటి నుంచి, ఆ పార్టీలో అనేక మంది ఆ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వారిలో బైట పార్టీ నుంచి వచ్చిన ఎంపి ఈటల రాజేందర్, మాజీ అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపి ధర్మపురి అరవింద్‌ల మధ్యే పోటీ కేంద్రీకృతమైందనే వార్తలు వచ్చాయి. చివరి నిమిషంలో అనూహ్యంగా మొదటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపితో మమేకమైన రామచందర్‌రావుకు ఆ పదవి దక్కింది. ఈ పరిణామం ముఖ్యంగా ఈటల రాజేందర్‌ను నిరాశకు గురి చేసిందనే చెప్పవచ్చు. అలాగే బైట పార్టీల నుంచి బిజెపిలో చేరిన వారిని అభద్రతలోకి నెట్టివేసింది. కొత్తగా చేరాలనుకునేవారు పునరాలోచన చేసుకోవాల్సిన పరిస్థితి. ఎందుకుంటే, గతంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, టిడిపిలో నుంచి బిజెపిలో చేరిన నాగం జనార్ధన్‌రెడ్డి, జగ్గారెడ్డి, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి వంటి అనేక మంది క్రియాశీల నాయకులు, అందులో ఇమడలేకపోయారు. రాష్ట్ర రాజకీయాలలో తమ పాత పార్టీలో కంటే అధిక ప్రాధాన్యం లభిస్తుందని బిజెపిలో చేరిన తరువాత, గతం కంటే ప్రాధాన్యత తరిగిపోవడం అలాంటి వారికి మింగుడు పడక వేరే దార్లను వెతుక్కోవాల్సి వచ్చింది. ఈటలకు అధ్యక్ష పదవి నోటి దాకా వచ్చి వెనక్కి పోవడంతో తమ గతేమిటనే భావన ఇతర పార్టీలో నుంచి బిజెపిలో ఉన్న ప్రస్తుత నేతల్లో కమ్ముకుంది. మరోవైపు బిజెపిలో ఎదిగొచ్చిన యువనేతలు తమ ఎదుగుదలను పాత తరం లాబీ అడ్డుకుంటుందనే అసహనంతో ఉన్నారు. ఎంపి ధర్మపురి అరవింద్ కొత్త అధ్యక్షుడి పదవీ స్వీకార కార్యక్రమానికి వ్యక్తిగత కారణాలను చూపి గైర్హాజరవడం కూడా చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి బిజెపి శ్రేణుల్లోనే ఒకలాంటి నిరాశ ద్యోతకమైనట్లుగా వార్తలు తెలువుతున్నాయి. ఇక మరో ముఖ్యవిషయం బిసిని అధ్యక్ష పదవికి ఎన్నిక చేయకపోవడం. శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే బిసిని ముఖ్యమంత్రిని చేస్తామనే వాగ్దానమే ఇందుకొక ప్రధాన కారణం. అధికారంలోకి రాలేకపోయినప్పటికీ, తమ మాటకు బలం చేకూర్చేందుకైనా కనీసం ఎన్నికైన బిజెపి బిసి ఎంఎల్‌ఏలలో ఒకరికి శాసనసభానాయకత్వాన్ని కట్టబెడతారేమోనని అనుకున్న విశ్లేషణలు పటాపంచలయ్యాయి. దీంతో బిసి వర్గాలలో బిజెపిపై భ్రమలు పలుచబారాయి. అందుకు పరిహారంగానా అన్నట్లుగా బండి సంజయ్‌ను కేంద్ర సహాయ మంత్రిని చేయడం సహా, బిసి ఉద్యమకారుడు ఆర్.కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి తరపు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయించి, బిజెపి తరుపున తిరిగి పెద్దల సభకు పంపారు. ఒకవైపు అధికార కాంగ్రెస్ బిసి జనగణన చేపట్టి, రాష్ట్ర అధ్యక్షుని సహా, పదవుల్లో కీలక స్థానాలను బిసిలకు కట్టబెడుతుంటే, బిజెపి పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బిసి సిఎంను చేస్తామన్న మాట అటుంచి, కనీసం బిజెఎల్‌పి నేతగానైనా ఆ బిసిని చేయకపోగా, ఊరించి చివరకు అధ్యక్ష పదవి విషయంలో కూడా నిరాశ పరిచిందనే అభిప్రాయం సొంత పార్టీ బిసిలలోనే వ్యక్తమవుతోంది. బైటి సవాళ్ళ విషయానికొస్తే, తెలంగాణలో అధికారంలోకి రావాలని కలలు గంటున్న బిజెపికి ప్రజల నుంచి ఎదురవుతున్న అత్యంత ముఖ్యమైన సవాలు కేంద్రంలో పదకొండేళ్ళుగా అధికారంలో కొనసాగుతనప్పటికీ రాష్ట్రానికి ప్రత్యేకించి ఒరగబెట్టిందేమిటని? నదీ జలాలు, ప్రాజెక్టులు, మెట్రో రైలు విస్తరణ, విమానాశ్రయాలు, నిధులు తదితర అంశాలపై తెలంగాణ పట్ల కేంద్రం ప్రదర్శిస్తున్న వివక్షతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేస్తున్న చురకలకు బిజెపి సమాధానం చెప్పకోలేక సతమతమవుతున్నది. రాష్ట్ర నూతన సారధికి ఇవి గడ్డు సవాళ్ళే.

## 'నీటి'పై నోరు పెద్దది చేసుకుంటే
# వాస్తవాలు మారవు




ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

> 'గత ప్రభుత్వంలో కెసిఆర్, హరీష్ తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకు గుదిబండగా మారాయి. 2015 జూన్ 15న జరిగిన సమావేశంలో నీటి కేటాయింపులపై కెసిఆర్, హరీష్ సంతకాలు పెట్టి తెలంగాణ ప్రాంతానికి మరణశాసనం రాశా రు. కల్వకుర్తి,పాలమూరు, ఎస్‌ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి నిర్మాణాలను ఆనాటి ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీంతో తెలంగాణకు 299 టిఎంసిలను వాడుకోలేకపోయాం. ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం వల్లే ఆ నీటిని తెలంగాణ వాడుకోలేకపోయింది.
> – రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జూన్ 30న మూడు వార్తలు అందాయి.అందులో ఒకటి దుర్వార్త. రెండు శుభవార్తలు. పాశ మైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించి 40 మందికి పైగా కార్మికులు దుర్మరణం పాలు కావడం దుర్వార్త. బిజెపి తెలంగాణ అధ్యక్షుడిగా నారపరాజు రామచంద్రరావు నియామకం, గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులను కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం శుభవార్తలు. బండి సంజయ్ లేదా ఈటల రాజేందర్‌లలో ఎవరయినా బిజెపి సారధి అయితే 'పోటీ' వేరే రకంగా ఉండేదని రేవంత్ అంచనా.రామచంద్రరావు విషయంలో బిజెపి శ్రేణుల్లోనే అసంతృప్తి, నిరాశ అలుముకున్నందున సిఎం ఇక బిజెపిని సీరియస్‌గా తీసుకోకపోవచ్చు. బనకచర్ల వివాదానికి పర్యావరణ అనుమతి తిరస్కరణ పరిణామం రేవంత్ రెడ్డికి ఉపశమనం కలిగిస్తుంది. శాశ్వతంగా ఆ ప్రాజెక్టు రద్దు కోసం తమ పోరాటం కొనసాగుతుందని జూలై 1న సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

'గత ప్రభుత్వంలో కెసిఆర్, హరీష్ తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకు గుదిబండగా మారాయి. 2015 జూన్ 15న జరిగిన సమావేశంలో నీటి కేటాయింపులపై కెసిఆర్, హరీష్ సంతకాలు పెట్టి తెలంగాణ ప్రాంతానికి మరణశాసనం రాశారు. కల్వకుర్తి,పాలమూరు, ఎస్‌ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి నిర్మాణాలను ఆనాటి ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీంతో తెలంగాణకు 299 టిఎంసిలను వాడుకోలేకపోయాం. ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం వల్లే ఆ నీటిని తెలంగాణ వాడుకోలేకపోయింది. గోదావరి బేసిన్‌లో 1486 టిఎంసిలు ఉంటే 968 టిఎంసిలు తెలంగాణకు 518 టిఎంసిలు ఆంధ్రాకు కేటాయించారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కెసిఆర్ ధన దాహంతో రీఇంజనీరింగ్ పేరుతో ఊరు పేరు అంచనాలు మార్చారు. లక్ష కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టుతో 50 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారు. బనకచర్లపై కెసిఆర్, హరీష్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కెసిఆర్ అండ్ కో& బనకచర్లను ఒక భూతంగా చిత్రీకరించాలని క్షుద్ర రాజకీయాలు, కుట్రలు చేస్తున్నారు. గోదావరి నుంచి 3వేల టిఎంసిలు వరద జలాలు సముద్రంలో కలుస్తున్నట్టు కెసిఆర్ ప్రకటనలు చేశారు. దాన్ని చంద్రబాబు అనువుగా తీసుకున్నారు. అసలు ఈ రాచపుండు సృష్టించిందే కెసిఆర్. చంద్రబాబు ప్రతిపాదనలకు కొనసాగింపుగా ఇదే ప్రజాభవన్‌లో జగన్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి కెసిఆర్ గోదావరి జలాలు తీసుకుపొమ్మన్నారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయిన తరువాతే మిగులు జలాల లెక్క తేలుతుంది. మిగులు, వరద జలాల లెక్క తేలాలంటే ఇరు రాష్ట్రాలు చర్చించుకోవాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

'ఉత్తమ్ కుమార్ రెడ్డికి,నాకు రాయలసీమ రొయ్యల పులుసుతో పనిలేదు.తెలంగాణ ప్రజల హక్కులతోనే పని.కృష్ణా బేసిన్‌లో మేం కట్టుకునే





ప్రాజక్టులకు ఏపీ అభ్యంతరాలు చెబుతోంది.నికర జలాల కేటాయింపు ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు అభ్యంతరాలు ఎందుకు సమస్య చర్చలతోనే పరిష్కారమవుతుంది.పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం లిటిగేషన్లు పెడుతోంది.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ విషయంలో ఎందుకు బాధ్యత తీసుకోరు? ఈ వివాదాన్నిపెంచి బిఆరెస్ పార్టీని బతికించుకుని రాజకీయ లబ్ది పొందాలనుకుంటోంది.వాళ్ల ఆరాటం నీటి కేటాయింపుల కోసం కాదు.ఇదొక రాజకీయ వ్యూహం.అంతరించి పోతున్న బిఆరెస్‌ను పునరుజ్జీవింపజేసేందుకు వీళ్ల ఆరాటం.రెండురోజులు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు పెడదాం.ఒక రోజు కృష్ణా బేసిన్ పై, ఇంకో రోజు గోదావరి బేసిన్‌పై చర్చ పెడదాం. ఈ రాచపుండును తెలంగాణ ప్రజలకు అంటగట్టింది ఎవరో తేలవలసిన అవసరం ఉంది. బిజెపి బిఆర్‌ఎస్‌ను బతికించేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇందుకు కిషన్ రెడ్డి పరోక్షంగా సహకరిస్తున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడే ప్రతి మాట కెటిఆర్ ఆఫీస్ నుంచే వస్తుంది'' అని సిఎం జూలై 1న ఆరోపించారు. రేవంత్ రెడ్డి గడచిన 18 నెలల్లో పరిపాలనపై పట్టు సాధించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకుడిగా ప్రవర్తిస్తున్నా రు. వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అంద ర్నీ ఒక మాట మీద నిలబెట్టి నడిపిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే సొంత కాంగ్రెస్ పెద్దలతోనూ సఖ్యతగా మసలుకోవడం కత్తిమీద సాము వంటిది.ఎవరితోనూ గొడవ పెట్టుకోకుండా పరిపాలన సక్రమంగా నడిపిస్తున్నట్టు కనపడుతుం ది. అవినీతిపరులైన అధికారులను సస్పెండ్ చేసి చర్యలు తీసుకుంటున్నారు.

పలువురు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డితో టచ్‌లో ఉన్నట్టు గాంధీభవన్ వర్గాలంటున్నవి. రేవంత్ రెడ్డికి మద్దతుగా పార్టీ వైపు నుంచి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తదితరులు బిఆర్‌ఎస్ ను చెండాడే పనిలో ఉన్నారు. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,సీతక్క వంటి కొందరు మంత్రులు సైతం సీఎంపై ప్రతిపక్షాలు 'దాడి' చేసిన వెంటనే ప్రో యాక్టివ్‌గా ఎదురుదాడి చేస్తున్నారు.అయితే ఈ సన్నివేశాలను డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్నప్పటి సన్నివేశాలతో పోల్చలేం.అప్పట్లో వైఎస్.పై ఈగ వాలితే మంత్రుల బృందం ప్రత్యర్థులపై అమాంతం విరుచుకుపడేది.

రేవంత్ రెడ్డిని టిపిసిసి అధ్యక్షుడిగా నియమించిన రోజునే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి సిఎం అని ప్రచారం జరిగింది. కామారెడ్డిలో కెసిఆర్ మీద రేవంత్ రెడ్డిని పోటీకి నిలబెట్టడం ద్వారా కూడా ఏఐసిసి అలాంటి సంకేతాలు పంపింది.మాజీ మంత్రులు,సీనియర్లను కాదని రేవంత్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమించినప్పుడు సహజంగానే పార్టీలో వ్యతిరేక స్వరాలూ వినిపించాయి.ఎన్నో అవాకులు చవాకులు మధ్య ప్రతిరోజు ఒక గండం ఆయనకు ఎదురైంది.రేవంత్ దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి అటు బిజెపీ, కెసిఆర్ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి 64 సీట్లు ఇచ్చారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ఒక ఎత్తైతే పార్టీలోనే సీనియర్ నాయకులను తృప్తి పరచడం మరొక ఎత్తు. ఓటుకు నోటు కేసులో అరెస్ట్ అయి చర్లపల్లి జైలు నుంచి నెలరోజుల తర్వాత బయటకు వచ్చినప్పుడే 'కెసిఆర్‌ను ఓడించడమే నా లక్ష్యం' అని రేవంత్ ప్రకటించారు. కొడంగల్‌లో ఓడిపోయిన తర్వాత 4 నెలలకు పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఎంపిగా గెలిచారు. ఆనాటి నుంచి రేవంత్ రెడ్డి పేరు ప్రజల్లో మారుమోగుతూ వచ్చింది. రేవంత్ రెడ్డి బిజెపి మీద కాకుండా బిఆర్‌ఎస్ పైనే 'ఫోకస్' పెట్టారు. ప్రధానంగా గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ పట్ల, రేవంత్ పట్ల సానుకూల వైఖరిని ప్రదర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగడం కాంగ్రెస్ పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. కాగా ఇప్పుడు కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాలు రేవంత్ రెడ్డి మార్పుపై ఊహాగానాలు చేస్తున్నవి. అలాంటి పొరబాటు చేయడానికి కాంగ్రెస్ హైకమాండ్ సిద్ధంగా లేదు.10 మంది బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడం మంచి శకునమే.బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ సహా ఆయన కుటుంబ సభ్యులంతా అవినీతిలో కూరుకుపోయినట్టు ప్రజలు భావిస్తున్నారు.అందువల్ల ఇప్పుడప్పుడే బిఆర్‌ఎస్ కోలుకోలేని పరిస్థితిలో ఉన్నది.రేవంత్ రెడ్డిని హేళన చేయడమో,అవమానించడమో పనిగా పెట్టుకున్న బిఆర్‌ఎస్ నాయకత్వం ఇప్పటికీ తన తప్పులను సరిదిద్దుకొని ప్రజల ముందుకు వెళ్లే ఆలోచనలో లేదు.

## కడవెండి – ఒక అగ్నిశిఖ



నేడు
దొడ్డి కొమురయ్య వర్ధంతి

ఊరు వీరుని దేహంలో హృదయం స్పందించినట్లు, అమరజీవి ధమనులలో విమల రక్తం ముడుకున్న ట్లు, సమర శీలి నాసికలో శ్వాసలు ప్రసరించినట్లు సాధారణ గ్రామమూర్తి, ఇతిహాసపు పుటలలో స్పందించుము, జ్వలించుము, ప్రసరించుము, అంటూ కొమురయ్య అమరత్వంపై సరోజిని నాయుడు తమ్ముడు హరీంద్రనాథ్ చటోపాధ్యాయ కవిత రాశారు. విప్లవాలు పంచారు. తెలంగాణలో నూతన యుగ ఆవిష్కరణ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం (1940–1951)వలన జరిగింది. ఆ విప్లవల క్ష్యాలు నీరుకారిపోకుండా, వెనుకడుగు వేయకుండా కొనసాగింపులో ఉన్న అద్వితీయ ప్రస్థానం తెలంగాణలో ఆవిష్కృతం అవుతున్నది. అది సాయుధ, ఇతర ప్రజాస్వామిక రూపాలతో ఉద్యమ జ్వాలను రగిలిస్తూనే ఉంది. భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా ప్రారంభమై, రైతాంగంలో బలపడిన ప్రజా ఉద్యమం సాయుధ పోరాటం. సంస్థానాధీశులు. జాగీర్దార్, దేశముఖ్‌లుగా పాలన యూనిట్స్‌ను కలిగివున్న నిజాం రాజ్యంలో ఉన్న ఒక ప్రాంతం విస్నూరు. దీని దేశముఖ్ పేరు రాపాక రామ చంద్రారెడ్డి. 60 గ్రామాలు ఇతని అధీనంలో ఉండేవి. ఇందులో కడవెండి అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలోనే దేశముఖ్ తల్లి జానమ్మ ఉంటూ తన అకృత్యాలను కొనసాగిస్తూ ఉండేది. నలభై ఎకరాల సాగును 400 వందల ఏకారాలకు చేర్చింది. అన్ని గ్రామాలలాగే కడవెండి కూడా రాచరిక, భూస్వామ్య పాలన దుష్ఫలితాలను అనుభవిస్తున్నది. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్ట్ పార్టీ ప్రవేశించకముందే ఈ గ్రామం దేశముఖ్ అకృత్యాలను, పెత్తందారీ సంస్కృతిని విమర్శించడం ,ధిక్కరించడం మొదలు పెట్టింది. స్వీయ చైతన్యంతో అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటితమైంది.1944 భువనగిరి రావి నారాయణ రెడ్డి ఆంధ్ర మహాసభ పిలుపుతో కడవెండి గ్రామం అగ్నిశిఖగా మారింది. తమ సంఘటిత శక్తికి భరో సా ఉందని, దున్నేవానికి భూమి, అక్రమ పన్నుల రద్దు వం టి కమ్యూనిస్టు నినాదాలతో ప్రేరితమై, సంతోషంతో, ఉత్తేజంతో, దొరల అక్రమాలను ఎదుర్కోవడం కోసం దొడ్డి కొమురయ్య, మల్లయ్య, నల్లా నరిసింహ, కొండల్ రెడ్డి, కొండయ్య, అస్నాల నర్సోజీ, మోహన్ రెడ్డి, దావిద్ రెడ్డి వంటి వారితో గ్రామ రక్షణ కమిటీ ఏర్పడింది. నల్లా వజ్రమ్మ, శేరమ్మతో మహిళా దళం ఏర్పడింది. దొడ్డి కొమురయ్య మల్లయ్య సోదరుల నాయకత్వంలో కడవెండి ఒకతి రుగుబాటు తోట అయ్యింది. విరుగకాయు పళ్లలాగ .. ఎంత బాధిస్తే అంత ఎర్ర నౌతాము అని చాటి చెప్పింది. దేశముఖ్ వారి గుండాల ఆగడాలను దెబ్బకు దెబ్బ రీతిలో సమాధానం చెపుతున్నది. పాలకుర్తి ఐలమ్మ కౌలు పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచి విజయం సాధించింది. నును లేత యవ్వనంలో ఉన్న కొమురయ్య కమ్యూనిస్ట్ శిక్షణ శిబిరాలలో కర్రలు ఒడిసెలు వంటి ఆయుధాల సాయుధ శిక్షణలో, సిద్ధాంత అవగాహనలో ఆరితేరాడు. గుత్పల సంఘాలు ఏర్పడి పాలకుర్తి పరిసర ప్రాంతాలకు విస్తరించడంలో కొమురయ్య చైతన్యవంతంగా పాల్గొన్నాడు.'మన నెత్తురు మన చెమట మాగాణిని తడుపుతాయి' 'ఏటికి ఏతము ఎత్తి వెయ్యి పుట్లు పండిస్తాము ఎందుకు ఒక మెతుకు ఎరగం అంటూ', గాలి మీద బత్కలేము, కడుపు మంటను భరించలేం, కనుక తెగించి పోరాడుదాం అని కొమురయ్య ప్రజలలో ప్రచారం చేశాడు. ఈ క్రమంలో కడవెండి గ్రామానికి 1946 జూలై 4న నిజాం రాజ్య రెవెన్యూ అధికారులు లెవీ ధాన్యపు సేకరణకు రావడం జరిగింది. తమ దగ్గర తిండికి ధాన్యం లేదని, లెవీ సేకరణకు ఒక్క గిం జ లేదని రైతులు కూలీలు తేల్చి చెప్పారు. తమ గ్రామంలో కల జానమ్మ దొరసాని ఇంట్లో 800 బస్తాల ధాన్యం ఉంద ని దానిని సేకరించమని చెప్పారు. ధాన్యపు గిడ్డంగులలు కాపాలా కాస్తున్న దొర గుండాలకుకు వ్యతిరేకంగా కడవెం డి గ్రామంలో పెద్ద ఊరేగింపును గ్రామ కమిటీ తీసింది. ఊరేగింపుపై మిస్కిన్ అలీ నేతృత్వంలో దొర గుండాలు కా ల్పులు జరిపారు. నాయకత్వం వహిస్తున్న కొమురయ్య గుళ్ల వానకు బెదరలేదు, చలించలేదు, వళ్లంతా తూట్లు తూ ట్లు అవుతున్నా ఆంధ్ర మహాసభకు జై,కమ్యూనిస్ట్ పార్టీకి జై అంటూ ప్రాణాలు వదిలాడు.ఇంకా అనేక మందికి గాయాలయ్యాయి. ఈ వీర మరణం తెలంగాణ చరిత్రను నూతన యుగంలోకి తీసుకెళ్లింది. దొడ్డి కొమురయ్య అంత్య క్రియలకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. తొలి అమరుడిగా నిలిచిపోయాడు. కడవెండి వీర భూమిగా మారి లక్షలాది ప్రజలకు స్ఫూర్తిని ఇచ్చింది. విప్లవాన్ని ఎలా నడపాలో తిరుగుబాటును ఎలా లేపాలో అనేదానికి కడవెండి నమూనాగా నిలిచింది. కొమురయ్య అమరత్వంను గానం చేస్తూ, పెనుమంటల ఎర్ర జెండాలను మోస్తూ ప్రతిజ్ఞ చేస్తూ , సాగిస్తాము సమరం, సాధిస్తాము విజయం అంటూ వందలాది సాయుధ దళాలు ఏర్పడి తమ గ్రామాల రక్షణ బాధ్యతను తీసుకున్నాయి. సంకెళ్లు లేని జగతి కోసం అంకితం మా బతుకులు అని శ్రామిక జనావళి గెరిల్లా పోరాటం చేశారు. రాచరికాన్ని కూల్చి ప్రజా రాజ్య స్థాపన లక్ష్యంతో కమ్యూనిస్ట్ పార్టీ నేతృత్వంలో మహత్తర సాయుధ పోరాటంగా మారింది.అన్యాక్రాంతమైన భూములను తిరిగి రైతులకు అప్ప చెప్పింది.బారెన్ బాస్టింగ్ పోరాట రూపంతో గిడ్డంగులపై దాడి చేసి ధాన్యాలను రైతులకు పంపిణీ చేసిం ది. మూడు వేల గ్రామాలను విముక్తి చేసి 10 లక్షల ఎకరాలను పంపిణీ చేసింది. గ్రామ రాజ్య కమిటీలతో ప్రజా పాలన చేసింది. ఉధృతమవుతున్న పోరుతో నిజాం రాచరికం ప్రాభవం హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం అయ్యింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన స్వతంత్ర రాజ్యాంగ ఉంటానన్న ఉస్మాన్ అలీ ఖాన్ కలలను ఛిద్రం చేసింది. మతోన్మాద రాజ్యాన్ని కోరుకున్న రజాకార్లను అంతమొందించింది. ఎన్నో రాజకీయ సాంఘిక ఆర్థిక మార్పులను తెచ్చి హైదరాబాద్ రాజ్యంను భారత్‌లో విలీనం చేసింది. దొడ్డి కొమురయ్య అమరత్వం తదనంతర సమరశీలతతో తెలంగాణ సమాజం ఎన్నో ముందడుగులు వేసింది.


– అస్నాల శ్రీనివాస్

## నేల ఎడారీకరణ సంక్షోభం రానుందా!



నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించబడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపి ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది. భూ క్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను క్రమం తప్పకుండా చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయడం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరికొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి. ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో హరిత విప్లవం రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్ధతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది. అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రకమైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి. కాగా, నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలియన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది. వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూదిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి. మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.

## మన్యం వీరుని త్యాగం- ప్రాతః స్మరణీయం



నేడు అల్లూరి
సీతారామరాజు జయంతి

ఒక్కరి వల్ల ఏం సాధ్యపడుతుందనే దురభిప్రాయం నేటికీ చాలా మందిలో ఉంది. కాని ఒక్కరి వలనే చరిత్ర మలుపులు తిరిగిన విషయం మరువలేం. యుద్ధాలు జరిగినా, విధ్వంసం జరిగినా, మహాత్కార్యాలు జరిగినా ఒక్కరితోనే ప్రారంభమై, ఒక్కరితోనే ముగిసిన సంఘటనలెన్నో ఉన్నాయి. ఒక వ్యక్తి ప్రసంగం ప్రపంచాన్నే ఉగ్రూతలూగించింది. ఒక వ్యక్తి రచనలు, ప్రసంగాలు, పోరాటాలు జాతి వివక్షతను అంతం చేసాయి. ఒక వ్యక్తి జాత్యహంకారం ప్రపంచ యుద్ధానికే పురిగొల్పింది. విధ్వంసం సృష్టించింది. ఒక నాయకుడి ఆజ్ఞతో జనం ప్రభంజనమై పరుగులుతీసి, కదనరంగంలో కుతూహలం చూపించి, దేశానికి ప్రయోజనం చేకూర్చిన సంగతిని మరువలేం. మరుగు పరచలేం. సుభాష్ చంద్రబోస్ లాంటి వీరుల పోరాట పటిమ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తనకు నచ్చని నాయకులతో, వారి సిద్ధాంతాలతో విబేధించి, అజాద్ హింద్ ఫౌజ్ ద్వారా ఆంగ్లేయులకు చుక్కలు చూపించిన నేతాజీ స్వాతంత్ర్య సమరాగ్ని జ్వాలలను రగిలించి,అలుపెరుగని పోరాటం చేసి మరణమెరుగని మహా వీరుడిగా చరిత్ర పుటల్లో నేటికీ సజీవంగా మిగిలే ఉన్నాడు. అలాంటి వీరుల కోవకు చెందిన మరో మహనీయుడు, తెలుగు గడ్డపై పురుడు పోసుకుని, రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్య సింహాసనాన్ని గడగడ లాడించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు. భారత స్వాతంత్ర్య సంగ్రామం అనేక ఉద్యమాల సమాహారం. మహోన్నత దేశ భక్తుల త్యాగఫలం వలన భారతదేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు శ్వాసించగలిగింది. విభిన్నమైన సిద్ధాంతాలు వైరుధ్యాలు గల నాయకులెంతో మంది తమ దారులు వేరైనా ఒకే లక్ష్యసాధన కోసం శ్రమించారు. అందరి గమ్యం ఒకటే అదే భారత స్వాతంత్ర్య సాధన. భారతదేశ స్వాతంత్ర్యోద్యమం కురుక్షేత్ర రణరంగాన్ని తలపించింది. ఒక రకంగా చెప్పాలం టే నాటి కౌరవ పాండవ కురుక్షేత్ర సమరంతో భారత స్వాతంత్ర్యాన్ని పోల్చవచ్చు. అన్యాయం, అధర్మం, ద్రోహం, అరాచ కం, అంగబలం, అర్థబలం, ఆయుధబలంతో మదపు టేనుగు ల్లా చెలరేగే ఆంగ్ల పాలకులు ఒక వైపు, శాంతి, సహనం, ధ ర్మం, న్యాయం, గుండె ధైర్యం, ఆత్మాభిమానంతో భారతీయు లు మరొకవైపు... ఇరు పక్షాల మధ్య సమాన స్థాయిలో పోరా టం సాగే పరిస్థితులు లేవు. అయినప్పటికీ ధర్మమే జయిస్తుందనే భారతీయుల విశ్వాసం గెలిచింది. వీరుల త్యాగాలు ఫలించాయి. శతాబ్దాల భారతీయుల స్వప్నం నెరవేరింది. తెల్లదొరల కర్కశ పాదాల క్రింద నలిగి పోయిన భరతజాతి ఎట్టకేలకు విముక్తి పొందింది. పుణ్య ధాత్రిపై స్వేచ్ఛావాయువులు ప్రసరించాయి. భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్ ఎంతటి ధైర్య సాహసాలు ప్రదర్శించాడో, తెలుగు నేలపై అదే రీతిలో కదం తొక్కి, తెల్ల దొరలకు ముచ్చెమటలు పట్టించాడు మన తెలుగు మహాయోధుడు, మన్యం వీరుడు 'అల్లూరి' . అల్లూరి గురించి చరిత్ర పెద్దగా దృష్టి సారించక పోవడం, జాతీయ స్థాయిలో అల్లూరి సీతారామరాజు త్యాగానికి సరైన ప్రాధాన్యత లభించక పోవడం బాధాకరం. విల్లంబులతో విజృంభించి, ఆంగ్ల మత్తేభాల మదమణిచిన ఆ మహనీయుని స్మరణ తెలుగునాట మాత్రమే కాదు, దేశమంతా మార్మోగాలి. అల్లూరి స్ఫూర్తి మరణించకూడదు. అనునిత్యం అజరామరమై వెలుగొందాలి. బ్రిటీషు వారి తుపాకీ గుళ్ళకు తన గుండెనే ఎదురు చూపిన ధీశాలి, మన్యం వీరుడు, తెలుగు తల్లి ముద్దుబిడ్డ, అమాయక మన్యం ప్రజలకు ఆప్తమిత్రుడు, రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యానికి కంటి మీద కునుకు లేకుండా చేసి న మహాయోధ 'అల్లూరి'. తుపాకులతో భారతీయుల హృదయాలకు తూట్లు పొడుస్తున్న తెల్లతోలు బ్రిటీషు సామ్రాజ్యవాదులను విల్లంబులతో పోరాడి గెలవలేమని భావించిన రామరాజు 'వజ్రం వజ్రేన భిద్యతే' అన్న చందంగా ముల్లును ముల్లుతోనే తీయాలనే సూత్రాన్ని అన్వయించాడు. పోలీసు ఠాణాలపై ఆకస్మికంగా విరుచుకుపడి ఆయుధ సామాగ్రిని వశపరచుకు ని వాటితోనే తెల్ల దొరల దురహంకార మదాన్ని అణచిన అత్యంత సాహసి, మకుటం లేని మహారాజు మన సీతారామరాజు. రంప ఉద్యమం రాజు జీవితచరిత్రలో మరపురాని మహా అధ్యాయం. భావ సారూప్యత గల విప్లవ కారులతో సమాలోచనలు జరిపి, విప్లవ భావాలతోనే దేశభక్తిని రగిలించగలమని, శాంతి ప్రవచనాలతో స్వాతంత్ర్యం సిద్ధించదని పథక రచన చేసి, వ్యూహాత్మకంగానే బ్రిటీషు పరాన్న భుక్కులకు పట్ట పగలే చుక్కలు చూపించిన సాహసి అల్లూరి. బ్రిటీషు వారి దాస్యశృంఖలాల్లో మగ్గి పోతున్న భరతజాతికి స్వేచ్ఛావాయువులందించడానికి, సర్వం త్యజించి తన ప్రాణాలనే పణంగా పెట్టి పోరుబాటలోనే పయనించి విప్లవ జ్యోతులను వెలిగించి, కఠిన,కర్కశ,పాషాణ సదృశమైన తెల్ల దొరల తుపాకీ గుళ్ళకు బలైన చైతన్య కెరటం అల్లూరి. తన బలిదానం తర్వాత కూడా స్వాతంత్ర్య పిపాస ను భారతీయుల హృదయాల్లో రగిలించిన తెలుగు వీరుడు అల్లూరి సీతారామరాజు. గంటం దొర, మల్లు దొర లాంటి నమ్మిన బంట్లు రామరాజు ఉద్యమానికి ఊతంగా నిలిచారు. నమ్మిన వారే మోసం చేస్తున్న నేటి కాలంలో ఆ ఇరువురి చరిత్ర ఆదర్శప్రాయం. రూథర్ ఫర్డ్ కుటిల రణనీతి అల్లూరి ఊపిరిని తీసి నా, అల్లూరి తెగువ మరెంతో మంది విప్లవ కారులకు ఊపిరి పోసింది. గిరిజన యువతులను పీడించి, వారిపై అత్యాచారాలకు తెగబడి, గిరిజనుల బ్రతుకుల్లో చిచ్చు పెట్టిన ఆంగ్లేయులకు అల్లూరి కంటకప్రాయంగా మారాడు. కొండకోనల్లో ప్రకృతి ఒడిలో భద్రంగా జీవించే అమాయక ప్రజల భద్రతనే ప్రశ్నార్థకంగా మార్చిన దురహంకారుల పాలిట సింహస్వప్నంలా మారాడు రామరాజు. అల్లూరిని మట్టుపెట్టాలనే ఏకైక ధ్యేయంతో తెల్లదొరలు సమయం కోసం వేచి చూసారు. తెల్లదొరలకు దాష్టీకం చేస్తున్న వారే అల్లూరి ఆచూకీ గురించి ఉప్పందించి భరతజాతికి ద్రోహం చేసారు. ఇలాంటి ద్రోహచింతన వలన భారతీయులకు స్వాతంత్ర్యం సిద్ధించడంలో ఆలస్యం జరిగింది. హిట్లర్ లాంటి నియంత సైతం మన వీరులకు సాయం చేయడానికి ముందుకు వస్తే, మన వారే మన వీరులకు ద్రోహం చేసి, బ్రిటీషువారికి పాదాక్రాంతమై భారతీయుల ఉద్యమ స్ఫూర్తికి తీరని ద్రోహం చేసారు. బోస్,భగత్ వంటి మహావీరుల సరసన స్థానం సంపాదించవలసిన అల్లూరి సీతారామరాజుకు జాతీయ స్థాయిలో సరైన గుర్తింపు లభించకపోవడం అత్యంత దురదృష్టకరం. మొక్కుబడి ప్రసంగాలతో అల్లూరి ఖ్యాతిని మరుగున పడేయడం చరిత్రకే కళంకం. ఇకనైనా భారత ప్రభుత్వం అల్లూరి త్యాగనిరతిని గుర్తించి ఆ మహా స్వాతంత్ర్య సమరయోధుని ఇతర దేశభక్తుల సరసన సగర్వంగా నిలబెట్టాలి. 'భారతరత్న'తో ఆ తెలుగు మహనీయుని చైతన్య స్ఫూర్తికి తగిన గుర్తింపు నివ్వాలి. అల్లూరి స్ఫూర్తి అజరామరం అల్లూరి ఖ్యాతి ఆచంద్రతారార్కం. అల్లూరి పోరాటం భావితరాలకు మార్గనిర్దేశనం.

– సుంకవల్లి సత్తిరాజు

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఫ్యూయల్ బ్యాన్‌పై ఢిల్లీ సర్కార్ యూటర్న్

**న్యూఢిల్లీ :** జీవితకాలం ముగిసిన వాహనాలకు ఆయిల్ పంపుల వద్ద ఇంధనాన్ని నిషేధిస్తూ ఢీల్లీ ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. అయితే, ఈ నిర్ణయంపై ఢిల్లీ ప్రభుత్వం అనూహ్యంగా యూటర్న్ తీసుకుంది. ఇంధనం బ్యాన్ నిర్ణయంపై వెనక్కి తగ్గింది. ఢిల్లీలో ఇంధనం బ్యాన్ సాధ్యం కావడం లేదని తెలిపింది. వాహన వయసు ప్రకారం స్క్రాప్ చేయలేమని పేర్కొంది. కాలుష్య కారక వాహనాలను మాత్రం సీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇంధనం బ్యాన్ విధిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఢిల్లీ సర్కార్ ఉపసంహరించుకుంది. వాహన కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిపడాన్ని అనుమతించేది లేదని ఢిల్లీ ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి దానిని అమలు చేస్తున్నది. దీనికోసం దేశ రాజధానిలోని 500 పెట్రోల్ బంకుల్లో ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరా సిస్టమ్‌లను ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.

## ప్రపంచ స్థిరత్వానికి బలమైన భారత్ దోహదం

### ఘనా పార్లమెంటులో మోదీ ప్రసంగం

**అక్ర:** బలమైన భారతదేశం ప్రపంచ స్థిరత్వానికి, ప్రగతిశీల ప్రపంచ సాధనకు దోహదం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమ ఆఫ్రికాదేశం ఘనా దేశ పార్లమెంటులో గురువారంనాడు మోదీ ప్రసంగించారు. ప్రాపంచిక పరిస్థితులు మారుతున్న ఈ తరుణంలో భారత్ ఒత్తిడిచేసిన విధంగా విశ్వసనీయమైన, ప్రభావశీలమైన సంస్కరణలకు అంతర్జాతీయ వేదికలు ముందుకు వచ్చినప్పుడు భారతదేశం సుసంపన్నమైన ప్రపంచ సాధనకుదోహదపడుతుందన్నారు.ఐదు దేశాల పర్యటనలో భాగంగా నరేంద్రమోదీ బుధవారం ఘనా చేరుకున్నారు. అక్రా విమానాశ్రయంలో ఘనా అధ్యక్షులు జాన్ ద్రమణి మహమా ఆయనకు ఘన స్వాగతం పలికారు. గడచిన మూడు దశాబ్దాలలో భారత ప్రధానమంత్రి ఘనా దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఘనా పార్లమెంటులో ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న, పారిశ్రామికంగా వెనుకబడిన దేశాలు తమ గొంతు బలంగా ఐక్యంగా వినిపిస్తేగానీ ప్రగతి సాధ్యంకాదని అన్నారు. ''భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం, బలిష్ఠమైన ప్రపంచానికి భారతదేశం ఒక ఒక శక్తిమంతమైన మూలస్తంభం లాం టిది, బలమైనభారతదేశం మరింత స్థిరత్వంతో కూడిన, ప్రగతిశీల ప్రపంచ సాధనకు ఉపయోగపడుతుంది'' అన్నారు. ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలలో భారత్ కూడా ఒకటిగా రూపుదిద్దుకుందని ఆయన చెప్పారు. భారత్‌లో ఉన్న రాజకీయస్థిరత్వం, స్థిరమైన పరిపాలనావ్యవస్థవల్ల భారతదేశం త్వరలోనే ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచం చాలా వేగంగా మార్పులు సంతరించుకుందన్నారు. ప్రపంచంలో సాంకేతిక విప్లవం పోటెత్తిందని, పారిశ్రామికంగా వెనుకబడిన దేశాలు తలెత్తి ముందుకు సాగుతున్నాయని, భౌగోళికంగా ఆర్థిక మార్పులు సంతరించుకుంటున్నాయన్నారు. అంతర్జాతీయ వేదికలలో, నిబంధనలలో మార్పులు రావాలని ఈ మారుతున్న ప్రాపంచిక పరిస్థితులు కోరుకుంటున్నాయన్నారు.



### మోదీకి ఘనా అత్యున్నత పురస్కారం

మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో మొదటిసారి భారత ప్రధానమంత్రి ఘనాలో పర్యటనను ఆ దేశం చరిత్రాత్మకమైన మైలురాయిగా పేర్కొంది. ఈ సందర్భంగా మోదీకి ఘనా దేశ అత్యున్న త ''ఆర్డర్ ఆఫ్ స్టార్ ఆఫ్ ఘనా'' పురస్కారం లభించింది. గొప్ప రాజనీతజ్ఞత, ప్రపంచ ప్రభావశీలమైన నాయకత్వం ప్రదర్శిస్తున్నందుకుగాను ఆయనకు ఘన అత్యున్నత పురస్కారం ఇచ్చారు. ఘన దేశాధ్యక్షుడు జాన్ ద్రమణి మహమ బుధవారంనాడు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఎక్స్ వేదికగా మోదీ ఈ విషయం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఈ పురస్కారం తీసుకోవడ తనకు గర్వంగా ఉందని, ఇదెంతో గౌరవప్రదమైనదన్నారు. భారతదేశ 140 కోట్లమంది ప్రజల తరపున ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నట్లు మోదీ చెప్పారు. ఇరు దేశాలలో ఎంతో అత్యున్నతమైన భవిష్యత్తును కోరుకుంటున్న యువ తరానికి ఈ పురస్కారాన్ని అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఘని ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇరుదేశాలలో ఉన్న ఉమ్మడిప్రజాస్వామికవిలువలు,సంప్రదాయాలు రెండు దేశాల భాగాస్వామ్యాన్ని పెంచిపోషిస్తాయన్నారు.ఇంతకుముందుఈ అవార్డును బ్రిటన్ రాణి ఎలిజిబెత్–2, దక్షిణాఫ్రికా నల్లజాతి సూరీడు నెల్సన్ మండేలా, ఐక్యరాజ్యసమితిమాజీప్రధానకార్యదర్శికోఫీఅన్నన్, కింగ్ ఛార్లెస్–3 వంటి ప్రముఖులు తీసుకున్నారు.



## అప్పుల్లో కూరుకుపోతున్నా... రైతులపై ఉదాసీనత

### మోదీ ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ ధ్వజం



**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలపై ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత మోదీ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. రైతులు ప్రతిరోజూ అప్పుల్లో కూరుకుపోతున్నప్పటికీ, వారి దుస్థితి పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. గురువారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ రుణమాఫీ, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కోసం రైతులు చేస్తున్న డిమాండ్లను విస్మరించిందని ఆరోపించారు. రైతుల ఆత్మహత్యలు, రాష్ట్రంలో సోయాబీన్ సాగుదారులకు బకాయిలు చెల్లించకపోవడం వంటి అంశాలపై బుధవారం ప్రతిపక్ష సభ్యులు మహారాష్ట్ర అసెంబ్లీ నుండి రెండుసార్లు వాకౌట్ చేశారు. ఈ ఏడాది జనవరి–మార్చి మధ్య మహారాష్ట్రలో 767 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కాంగ్రెస్ నాయకుడు విజయ్ వాడేట్టివార్ అసెంబ్లీలో పేర్కొన్నారు. 200 కేసులను సహాయానికి అనర్హులుగా ప్రకటించగా, 194 కేసులపై విచారణ పెండింగ్‌లో ఉందని ఆయన తెలిపారు. కాగా, మహారాష్ట్రలో మొదటి మూడు నెలల్లో రైతు ఆత్మహత్యల సంఖ్య 767గా ఉన్నట్టు ప్రచురితమైన వార్తా కథనాలను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పంచుకున్నారు. 'కేవలం 3 నెలల్లోనే, మహారాష్ట్రలో 767 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు, ఇది కేవలం గణాంకాలేనా? కానే కాదు... 767 ఇళ్లు నిండా మునిగాయి. 767 కుటుంబాలు ఎప్పటికీ కోలుకోలేవు. మరి ప్రభుత్వం? మౌనంగా ఉంది. ఉదాసీనంగా వ్యవహరిస్తోంది... ఒక్కసారి ఆలోచించండి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, డీజిల్ ఖరీదైనవి కావడంతో రైతులు ప్రతిరోజూ అప్పుల్లో మునిగిపోతున్నా ఎంఎస్‌పిపై హామీ ఇవ్వడం లేదు, రైతులు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తే వారిని విస్మరిస్తారు అని మండిపడ్డారు. కానీ మోడీ ప్రభుత్వం కోటీశ్వరులకు రుణాలను సులభంగా మాఫీ చేస్తుందని దుయ్యబట్టారు. నేటి వార్తలను చూస్తే అనిల్ అంబానీ రూ. 48,000 కోట్ల ఎస్‌బిఐ 'మోసం' అని తెలుస్తోందన్నారు. 'మోదీ జీ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పారు. కానీ, నేడు రైతు జీవితాన్ని సగానికి తగ్గించే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవస్థ రైతులను నిశ్శబ్దంగా, నిరంతరంగా చంపుతోంది. అయినా మోడీ జీ తన సొంత ప్రజా సంబంధాల దృశ్యాన్ని మాత్రమేచూస్తున్నారు' అని అన్నారు. అయితే ఎన్‌సిపి–కాంగ్రెస్ ప్రభుత్వ 15 సంవత్సరాల కాలంలో మహారాష్ట్రలో 55,928 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బిజెపి ఐటి సెల్ అధిపతి అమిత్ మాల్వియా ఎక్స్‌లో ఎదురుదాడి చేశారు. చనిపోయిన వారిని లెక్కించే రాజకీయాలు అసహ్యకరమైనవి, రాహుల్ గాంధీ వంటి వారికి అద్దం చూపించాల్సిన అవసరం ఉందని మాల్వియా అన్నారు.

## మహారాష్ట్ర విధాన సభ ముందు ప్రతిపక్షాల ఆందోళన

**ముంబయి :** పంఢర్‌పూర్ వార్షిక యాత్రలో అర్బన్ నక్సల్స్ చొరబడ్డారని శివసేన శాసనసభ్యుడు మనీషా కయాండే చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష శాసనసభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం మహారాష్ట్ర విధాన భవన్ మెట్ల వద్ద నిరసన చేపట్టారు. శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు అంబదాస్ దన్వే, కాంగ్రెస్ శాసనసభా పార్టీ నాయకుడు విజయ్ వాడేట్టివార్, ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు జితేంద్ర అవ్హాద్ సహా నిరసనకారులు రాజ్యాంగ కాపీలను పట్టుకుని, మత సంప్రదాయాన్ని కించపరిచారని ఆరోపిస్తూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. పంఢర్‌పూర్ ఆలయ పట్టణం పవిత్ర ఆషాఢి వారి వార్షిక యాత్రలో పాల్గొనే భక్తులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తోందని, సమాజాన్ని విభజించిందని ప్రతిపక్షాలు ఆరోపించారు. లక్షలాది మంది 'వార్కారీలు' (విఠల్ ప్రభువు భక్తులు) ప్రతి సంవత్సరం చేపట్టే ఆధ్యాత్మిక ప్రయాణాన్ని రాజకీయం చేసే ప్రయత్న చేస్తున్నారని, కయాండే వ్యాఖ్యలు నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని విమర్శించారు. లోతుగా పాతుకుపోయిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని అవమానించే ప్రయత్నం చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. 'ఇది 'వారి'పై దాడి మాత్రమే కాదు, మహారాష్ట్ర సాంస్కృతిక గుర్తింపుపై దాడి. ప్రభుత్వం వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వార్కారీ సమాజానికిక్షమాపణ చెప్పాలి' అని శివసేన (యుబిటి) నాయకుడు దన్వే అన్నారు. ఎగువ సభలో నామినేటెడ్ సభ్యుడు కయాండే బుధవారం శాసన మండలిలో 'అర్బన్ నక్సల్స్' 'వారి' వార్షిక తీర్థయాత్రలోకి చొరబడ్డారని, 'వార్కారీలను' తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. 'వారి' సమయంలో మాంసం ముక్కలు విసిరిన సంఘటనలు గతంలో జరిగాయని ఎంఎల్‌సి చెప్పారు. ప్రముఖ వార్కారీ శాఖ నాయకుడు బండతాత్య కరద్కర్ ఇటువంటి చర్యలను వ్యతిరేకించారు. వారి పవిత్రతను కాపాడటానికి తక్షణమే చర్య తీసుకోవాలని ఆమె మహాయుతి ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి విధ్వంసక అంశాలను అరికట్టడం లక్ష్యంగా బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం మహారాష్ట్ర ప్రజా భద్రతా బిల్లును ప్రవేశపెట్టబోతోందని కయాండే అన్నారు. శివసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బుధవారం మాట్లాడుతూ, ఎమ్మెల్సీ లేవనెత్తిన విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని, విచారణ కోసం హోం శాఖకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. 'అర్బన్ నక్సల్స్' సమాజాన్ని విభజించడానికి చేస్తున్న ప్రయత్నాల గురించి తనకు ఫిర్యాదులు అందాయని, ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తుందని హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ హామీ ఇచ్చారు.

## భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**శ్రీనగర్ :** దక్షిణ కశ్మీర్ హిమాలయ పర్వతాల్లో మంచు లింగం రూపంలో కొలువైన శివుడ్ని భక్తులు దర్శించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. 3880 మీటర్ల ఎత్తులో ఉండే గుహాలో ఉన్న ఈ క్షేత్రానికి గురువారం మొదటి బ్యాచ్ భక్తులు బల్తాల్, నున్‌వాన్ శిబిరాల నుంచి బయలుదేరారు.అనంతనాగ్ లోని పహల్గాం లో నున్‌వాల్ శిబిరం నుంచి 48 కిమీ రూటు నుంచి, సెంట్రల్ కశ్మీర్ లోని గండెర్‌బాల్ సోనామార్గ్ ఏరియా14 కిమీ బల్తాల్ రూటు నుంచి గురువారం తెల్లవారు జామున బయలుదేరారు. యాత్రికులు 'భంభంబోలే..హరహరమహాదేవ్' నినాదాలతో ముందుకు సాగారు. ముందుగా భరించలేని వాతావరణంలో కష్టతరమైన మార్గం ఉన్నా వారి ముఖాల్లో ఆనందం తొంగి చూసింది. యాత్రికులు తమకు కట్టుదిట్టమైన భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న... పాలసీపై 'కాంగ్రెస్ గరం'



**న్యూఢిల్లీ :** చైనా పట్ల నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న పాలసీపై గురువారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే విమర్శనాస్త్రాలు సంధించారు. భారతదేశంలోని తయారీ కర్మాగారం నుంచి చైనా ఇంజనీర్లు నిష్క్రమిస్తున్నారనే నివేదికలు,అరుదైన భూమి అయస్కాంతాల ఎగుమతిపై చైనా ఆంక్షలపై ఖర్గే మోదీ ప్రభుత్వాన్ని ఆయన లక్ష్యంగా చేసుకున్నారు. ప్రభుత్వం 'అరచైనా గ్యారెంటీకి గడువు తేదీ (ఎక్స్‌పైరీ) ఏదీ ఉండదా' అని ఎద్దేవా చేశారు. ప్రత్యేక ఎరువుల సరఫరాపై చైనా ఆంక్షలపై ప్రభుత్వ మౌనాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. నరేంద్రమోదీజీ, నివేదికల ప్రకారం భారతదేశ తయారీ రంగం నుంచి చైనా వారి ఇంజనీర్లను ఉపసంహరించుకుంది. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది నిజంకాదా మోదీజీ?. డొక్లామ్, గాల్వాన్ ఘటనలను మర్చిపోయి చైనీస్ కంపెనీలకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకడమే కాకుండా పిఎల్‌ఐ స్కీమ్ నుంచి చైనా పౌరులు సులభంగా ప్రయోజనం పొందేలా వీసాలు ఇచ్చింది వాస్తవం కాదా? అని మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో అడిగారు. దక్షిణ భారతదేశంలో ఫాక్స్‌కాన్స్ ఐఫోన్ ప్లాంట్ నుంచి చైనీస్ ఇంజనీర్లు నిష్క్రమించినట్లు వచ్చిన నివేదికలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అరుదైన భూమి అయస్కాంతాలు, ఖనిజాలపై చైనా కఠినమైన ఆంక్షలు విధించిందని, అవి ఆటోమొబైల్స్, ఇవి, రక్షణ, హై సెక్యూరిటీ కరెన్సీ ప్రింటింగ్ వంటి వాటికి చాలా అవసరమైనవి అని ఆయన తెలియజేశారు. చైనా అధికారులపై మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనేది నిజం కాదా అని కాంగ్రెస్ చీఫ్ ప్రశ్నించారు. భారత ఆటోమొబైల్ పరిశ్రమ ప్రతినిధి బృందానికి అధికారిక నియామకం ఇవ్వలేదా అని ప్రశ్నించారు. చైనా గత రెండు నెలలుగా భారతదేశానికి ప్రత్యేక ఎరువుల ఎగుమతులను నిలిపివేసి, ఇతర దేశాలకు సరఫరా కొనసాగిస్తోందని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పండ్లు, కూరగాయలు, లాభసాటి పంటల దిగుబడిని పెంచడానికి అత్యంత ముఖ్యమైన ప్రత్యేక ఎరువులను 80శాతం మేరకు భారతదేశం చైనా దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్నదని చెప్పారు. 'యూరియా, డిఏపి రసాయనిక ఎరువుల సంక్షోభాన్ని ఇప్పటికే ఎదుర్కొంటున్న మన కోట్లాది రైతులకు ఇది హాని కలిగించదా' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. 'మీ ప్రభుత్వంలో చైనీస్ గ్యారెంటీకి ఎలాంటి ఎక్స్‌పైరీ తేదీ ఏమీ ఉండదా? గాల్వన్‌లోయలో భారతదేశ సాహస సైనికులు 20మంది త్యాగం చేసిన తర్వాతమీరు ఐదు ఏళ్ల క్రితమే చైనాకు ఒక 'క్లీన్ చిట్' ఇచ్చారు. నేడు చైనా దానిని పూర్తి అడ్వాంటేజీగా తీసుకుని మాట్లాడుతుంటే మనం మాత్రం నిస్సహాయంగా చూస్తూ ఉన్నట్లు కనిపిస్తోంది' అని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

## కేరళలోనే బ్రిటన్ ఎఫ్–35 ఫైటర్ జెట్

**తిరువనంతపురం:** కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌లో జూన్ 14న అత్యవసరంగా ల్యాండ్ అయిన బ్రిటీష్ రాయల్ నేవీకి చెందిన ఎఫ్35 ఫైటర్ జెట్ నాటి నుంచి అక్కడే ఉన్నది. ఐదోతరం స్టెల్త్ జెట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలయ్యాయి. ఆ ఫైటర్ జెట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు బ్రిటన్ నుంచి ముప్పై మంది ఇంజినీర్ల బృందం తిరువనంతపురం చేరుకుంటుందని భావించారు. అయితే వారు రాకపోవచ్చని తెలుస్తున్నది. కాగా, సుమారు 20 రోజులుగా తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌లో నిలిచిపోయిన ఎఫ్35 ఫైటర్ జెట్‌ను బ్రిటన్‌కు తరలించేందుకు ఆ దేశ అధికారులు ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. నాటి నుంచి సీఐఎస్ఎఫ్ గస్తీలో ఉన్న యుద్ధ విమానాన్ని పాక్షికంగా విడదీసి మిలిటరీ కార్గో విమానం ద్వారా బ్రిటన్‌కు తరలించాలని యోచిస్తున్నారు. ఎఫ్35 ఫైటర్ జెట్ పునరుద్ధరణ కోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నది.

## 'ఆప్'కు కాంగ్రెస్‌తో పొత్తు లేదు

### లోక్‌సభ ఎన్నికల వరకే 'ఇండియా' కూటమి

### ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



**అహ్మదాబద్ :** ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్‌తో పొత్తులేదని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. గుజరాత్‌లో అధికారంలో ఉన్న బిజెపికి కాంగ్రెస్ సహాయం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్) కూటమి గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల కోసం మాత్రమే ఉద్దేశించబడిందన్నారు. గురువారం కేజ్రీవాల్ గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ 2027లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడుతుందని, విజయం సాధిస్తుందని చెప్పారు, రాష్ట్ర ప్రజలు ఇప్పుడు బిజెపి, కాంగ్రెస్ కాకుండా ప్రత్యామ్నాయ పార్టీలవైపు దృష్టి సారిస్తున్నారని చెప్పారు. తమకు కాంగ్రెస్‌తో పొత్తు లేదని, ఒకవేళ కూటమి ఉంటే విశావదర్‌లో ఉప ఎన్నికలో ఎందుకు పోటీ చేశారని, ఆప్‌ను ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. తమ ఓట్లను కోయడం ద్వారా ఆప్‌ను ఓడించడానికి బిజెపి కాంగ్రెస్‌ను పంపిందని ఆరోపించారు. కాంగ్రెస్ విఫలమైనప్పుడు వారిని బిజెపి మందలించింది దని పేర్కొన్నారు. ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల కోసం మాత్రమేనని, ఇప్పుడు తమ వైపు నుండి ఎటువంటి పొత్తు లేదని కేజ్రీవాల్ అ స్పష్టం చేశారు. గత నెలలో జునాగఢ్ జిల్లాలోని విశావదర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఆప్ నాయకుడు గోపాల్ ఇటాలియా బిజెపికి చెందిన కిరీట్ పటేల్‌ను 17,000 ఓట్ల తేడాతో ఓడించి గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రాన్‌పారియా 5,501 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. బిజెపి తన 30 ఏళ్ల పాలనలో గుజరాత్‌ను నాశనం చేసిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. బిజెపి అధికారాన్ని నిలుపుకోవడానికి కాంగ్రెస్ సహాయపడటం వలన ప్రతిపక్షంగా విఫలమైందన్నారు. 'రైతులు, యువకులు లేదా మధ్యతరగతి వారైనా, సమాజంలోని ప్రతి వర్గం బిజెపి పట్ల అసంతృప్తిగా ఉంది. నిరుద్యోగం ఉన్నప్పటికీ, సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్ట్ ప్రాతిపదికన మాత్రమే ఉద్యోగాలు ఇస్తున్నారు. అయినప్పటికీ, ప్రజలకు వేరే మార్గం లేకపోవడంతో బిజెపి ఎన్నికలలో గెలుస్తోంది' అని కేజ్రీవాల్ అన్నారు. బిజెపిని ఓడించాలని ప్రజలు చర్చించంకుంటున్నారని, అయితే ఎవరికి ఓటేయాలని కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రతి ఎన్నికల్లో బిజెపి గెలవడానికి కాంగ్రెస్‌కు కాంట్రాక్ట్ ఇచ్చిందని, ఈ విషయంలో కాంగ్రెస్ చాలా చురుకుగా పనిచేస్తుందని కేజ్రీవాల్ విమర్శిచారు. విశావదర్ ఉప ఎన్నిక తర్వాత, ఆప్ ఈ రెండు పార్టీలకు బలమైన ప్రత్యామ్నాయంగా ఉద్భవించిందని, ప్రజలు తమ పార్టీపై ఆశలు పెట్టుకున్నారని కేజ్రీవాల్ అన్నారు. బిజెపిని ఓడించడమే లక్ష్యంగా ఆప్ కార్యకర్తలు గుజరాత్‌లో తీవ్రంగా ప్రచారం చేస్తారని, ఇంటింటికీ వెళ్తారన్నారు. 2027 అసెంబ్లీ ఎన్నికల కోసం రెండున్నర సంవత్సరాల ముందు నుంచే ప్రజలను సమాయత్తం చేస్తారన్నారు. తాము నేటి నుంచి 'గుజరాత్ జోడో అభియాన్'ను ప్రారంభిస్తున్నామన్నారు. అవినీతి రహిత గుజరాత్‌ను కోరుకునే యువత పెద్ద సంఖ్యలో మాతో చేరాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.


## వారసుడి నిర్ణయం దలైలామా చేతుల్లోనే..

### మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** బౌద్ధుల మత గురువు దలైలామా వారసుడిని ఎంపిక చేయాలని భావిస్తున్న చైనా వైఖరి పట్ల భారత్ స్పందించింది. కచ్చితంగా తమ ఆమోద ముద్ర కావాలంటూ చేస్తున్న డిమాండ్‌ను తోసిపుచ్చింది. ఈ మేరకు 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టం చేశారు. ఆ అధికారం ఇంకెవరికీ లేదని తెలిపారు. దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు సంస్థ మాత్రమే చేస్తుందని పేర్కొన్నారు. దలైలామా స్థానం టిబెటన్లకు మాత్రమే కాదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనదని రిజిజు పేర్కొన్నారు. అయితే దలైలామా తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని బుధవారం సోషల్ మీడియాలో వెల్లడించారు. భవిష్యత్తు గురువును గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని పేర్కొన్నారు. మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని తేల్చి చెప్పారు. పరోక్షంగా చైనాకు స్పష్టం చేశారు. ఆ తర్వాత దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని డిమాండ్ చేసింది. వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనా విధానాలను అనుసరించి నిర్వహించాలని వ్యాఖ్యానించింది. కాగా, 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించింది. అప్పటి నుంచి భారత్‌లోని ధర్మశాలలో దలైలామా ఆశ్రయం పొందుతున్నారు. దీంతో టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే దలైలామాను వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ప్రయత్నిస్తూనే ఉంది. మరోవైపు, దలైలామా 90వ పుట్టిన రోజు కార్యక్రమాలు బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సుగ్లాగ్‌ఖాంగ్ ఆలయంలో మొదలయ్యారు. ఆ వేడుకలకు భారత్ తరఫున రిజిజు, జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు లల్లన్ సింగ్‌లు హాజరుకానున్నారు.

## సభలో అంతరాయాలను తగ్గించుకోవాలి

### గత పద్ధతులను మార్చుకోవాల్సిన అవసరం ఉంది : స్పీకర్ ఓమ్ బిర్లా



**గురుగ్రామ్ :** త్వరలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు సభా కార్యకలాపాల్లో అంతరాయాలను తగ్గించుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు. గత పద్ధతులను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. గురువారం గురుగ్రామ్‌లో పట్టణ స్థానిక సంస్థల జాతీయ స్థాయి సమావేశంలో ప్రసంగించారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించే రాజకీయ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. గత సంవత్సరం జూన్‌లో తొలిసారి సమావేశమైన 18వ లోక్‌సభలో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడటంలో కొంత తగ్గుదల ఉందని బిర్లా అన్నారు. 'ఇది మార్పుకు సమయం. మనం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి, ప్రజాస్వామ్య సంస్థలను జవాబుదారీగా ఉంచాలంటే, సభలు సరైన రీతిలో పనిచేసేలా చూసుకోవాలి' అని ఆయన అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సభా కార్యకలాపాల్లో అంతరాయాలను తగ్గించడానికి ప్రయత్నాలు చేయాలని స్పీకర్ కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12న ముగియాల్సి ఉండగా, వారు పాటు పొడిగించారు. కాగా, సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడానికి సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించేవారని, 17వ లోక్‌సభ (2019–2024) కూడా దీనికి భిన్నంగా లేదు, కానీ 18వ లోక్‌సభలో మార్పు కనిపించిందని బిర్లా పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా లేవనెత్తడానికి వీలుగా సభ సజావుగా సాగేందుకు అనుమతించాలని రాజకీయ పార్టీలు, సభ్యులు ఆలోచించడం ప్రారంభించారని బిర్లా అన్నారు. సభ సక్రమంగా పనిచేసేలా అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేశాయన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు తమ పనితీరులో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌ను కలిగి ఉన్న పద్ధతులను పట్టణ స్థానిక సంస్థలు కూడా అనుసరించాలని బిర్లా అభిప్రాయపడ్డారు. యుఎల్‌బిల రోజంతా సమావేశాలు నిర్వహించడానికి మనం ఎందుకు ప్రయత్నాలు చేయకూడదని ప్రశ్నించారు. సమావేశాన్ని ఎనిమిది గంటలు కొనసాగించనివ్వండి. దీనికి ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ ఉండవచ్చు, సమస్యలను చర్చించవచ్చు, పారదర్శకతను నిర్ధారించడానికి జవాబుదారీతనం పరిష్కరించవచ్చు అని స్పీకర్ అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం రానున్న సంవత్సరాల్లో చట్టాన్ని అమలు చేస్తుందని బిర్లా అన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో మహిళా నాయకులను ప్రోత్సహించాలని, అలాంటి సంస్థల నుండే కొత్త జాతీయ నాయకత్వం ఉద్భవిస్తుందని అన్నారు.

## పశ్చిమ ఆఫ్రికాలో మోదీ పర్యటనవేళ ముగ్గురు భారతీయులు కిడ్నాప్

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పశ్చిమ ఆఫ్రికాలోలో పర్యటిస్తున్న సమయంలో ఆ ప్రాంత దేశం మాలీలో ముగ్గురు భారతీయులను ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. మాలీలోని వివిధ ప్రాంతాలలో తరచు ఉగ్రవాదుల దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులమధ్య ముగ్గురు భారతీయులను ఉగ్రవాదులు మంగళవారంనాడు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపట్ల భారత ప్రభుత్వం గురువారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయులను సురక్షితంగా విడిపించాలని కోరింది. వారి విడుదలకు, భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని మాలీ ప్రభుత్వానికి భారత విదేశీ వ్యవహరల మంవత్రిత్వశాఖ విజ్ఞప్తి చేసింది. కాయేస్‌లోని డైమండ్ సిమెంట్ కర్మాగారంలో పనిచేసే ముగ్గురు భారతీయులను ఉగ్రవాదులు అపహరించుకుపోయారు. అదేవిధంగా ప్రస్తుతం మాలీదేశంలో ఉన్న భారతీయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితంగా ఉండాలని భారత విదేశీ మంత్రిత్వశాఖ ఒక హెచ్చరిక కూడా చేసింది.

''జులై ఒకటో తేదీన భారతీయ ఉద్యోగులను ఉగ్రవాదులు అపహరించారు. సాయుధులైన ఉగ్రవాదులు సమన్వయపూర్వకంగా కర్మాగార ప్రాకారంలోపలికి ప్రవేశించి దాడులు చేశారు. బలవంతంగా ముగ్గురు భారతీయులను లాక్కెళ్ళారు, వారిని బందీలను చేశారు'' అని విదేశీమంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఐతే తామే భారతీయులను కిడ్నాప్ చేశామని ఇప్పటివరకూ ఏ ఉగ్రవాద సంస్థా ప్రకటించుకోలేదు. ఐతే భారతీయుల కిడ్నాప్ గురించి అల్–ఖైదా ఉగ్రవాద సంస్థ ఇప్పటివరకూ ఇలాంటి ప్రకటన చేయలేదు. అల్–ఖైదా అనుబంధం జామాత్ నుస్రత్ అల్–ఇస్లామ్ వాల్–ముస్లిమిన్ (జెఎన్ఐఎం) సంస్థ మాత్రం మాలీవ్యాప్తంగామంగళవారంనాడు జరిగిన దాడులకు తామే బాధ్యులమని ప్రకటించింది. అందువల్ల జెఎన్ఐఎం భారతీయులను చెరబట్టిందన భావిస్తున్నారు. బమాకోలోని భారతీయ దౌత్యకార్యాలయం ఈ ఘటనకు సంబంధించి అధికారులందరితో సంప్రదింపులు చేస్తోందనీ, అందరితో ఆదాన ప్రదానాలు జరుపుతోందని భారత విదేశీ మంత్రిత్వశాఖ ప్రకటించింది. స్థానిక పోలీసు అధికారులు, దర్యాప్తు సంస్థలూ కూడా ఈ విషయంపై దృష్టిసారించాయి. వారితో దౌత్యకార్యాలయం మాట్లాడుతోంది.

''భారత ప్రభుత్వం చాలా నిర్ద్వంద్వంగా ఈ విషాదకరమైన హింసాత్మక చర్యను ఖండిస్తున్నది. రిపబ్లిక్ ఆఫ్ మాలీలో ఉగ్రవాదులు హింసకు పాల్పడ్డారు. దీనిపై అక్కడి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. భారతీయులకు భద్రత ఇవ్వాలి, వారిని సురక్షితంగా విడిపించాలి'' అని ఒక ప్రకటనలో విదేశీ మంత్రిత్వశాఖ పేర్కొంది.

## వార్డు వారీగా ఆస్తిపన్ను

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా లైసెన్స్ లేని వాణిజ్య భవనాలకు ట్రేడ్ లైసెన్స్ ఇచ్చి, రెన్యూవల్ లైసెన్స్ వారికి రెన్యూవల్ అయ్యేలా, ప్రాపర్టీ టాక్స్ వార్డు వైజ్ లిస్ట్ తీసి వార్డు ఆఫీసర్స్, బిల్లు కలెక్టర్లు పన్ను వసూలు చేయాలని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ మీటింగ్ హాల్‌లో జరిగిన వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పట్టణంలోని ప్రభుత్వ భవనాలకు ఉన్న ప్రాపర్టీ టాక్స్ లిస్ట్ తీసి నోటీసులు పంపాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, శానిటరి ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్ఐలు ఆర్.సాంబయ్య, మాజిద్‌ఖాన్, శంకర్, సంగీత్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ విద్యార్థులకు 'ఉగ్రవాదం-ఆపరేషన్ సిందూర్'పై వ్యాసరచన పోటీ

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఉగ్రవాదం ఆపరేషన్ సిందూర్ అంశంపై ఇంటర్ విద్యార్థులకు ఈనెల 19న సూర్యాపేట, కోదాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జడ్పీ, ఎంబి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం (జడ్పి ఎంబి హైస్కూల్ ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు గుంటకండ్ల దామోదర్ రెడ్డి, కార్యదర్శి తాటి చంద్రశేఖర్ లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాసరచన పోటీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు తాము చదువుతున్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా ధృవీకరణ పత్రాన్ని వెంట తీసుకొని రావాలని కోరారు. ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను వారు కోరారు. ఇందులో గెలుపొందిన విజేతలకు షీల్డ్ బహుకరణతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం అసోసియేషన్ కన్వీనర్ యర్రంశెట్టి వేణుధర్ సెల్: 92905 18520 సంప్రదించాలని కోరారు.

## చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి జైలుశిక్ష

**ప్రజాపక్షం/కోదాడ:** తాను తీసుకున్న అప్పు కింద చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడకు చెందిన కొదుమూరి ప్రవీణ్ అనే వ్యక్తి రంగాపురపు ఉమామహేశ్వర్ అనే వ్యక్తి తన అవసరాల నిమిత్తం డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు తిరిగి చెల్లించాలని ప్రవీణ్ కోరగా పట్టించుకొని ఉమామహేశ్వర్ చివరకు 2014లో 5 లక్షల రూపాయల చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో ప్రవీణ్‌కోర్టును ఆశ్రయించాడు. సుదీర్ఘ విచారణల అనంతరం కేసును విచారించిన ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె. భవ్య గురువారం తీర్పు వెలువరించింది. ఇచ్చిన చెక్కు తాలుగా 5 లక్షలు ఇవ్వాలని, చెల్లని చెక్కు ఇచ్చినందుకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రవీణ్ తరుపున సీనియర్ న్యాయవాది అక్కిరాజు యశ్వంత్ రామారావు తన వాదనలు వినిపించారు.

## వార్డు అధికారులందరూ విధిగా విధులు



**ప్రజాపక్షం/యాదాద్రి :** వార్డులలో పర్యటించి వార్డులో మార్పు వచ్చే విధం గా వార్డు అధికారులందరూ విధిగా విధులు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో బాగంగా గురువారం ఆలేరు మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్స్, ఆర్పిలు , సిబ్బందితో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్డు అధికారులందరూ ఖచ్చితంగా వార్డులలో ఉండి ప్రజల సమస్యలు ఎప్పటికపుడు పరిష్కరించాలన్నారు. సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్ తప్పక నిర్వహించాలన్నారు. ప్రతిరోజు డ్రైన్స్ శుభ్రపరచి వార్డులో శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. వార్డులలో తిరిగి ఖచ్చితంగా టాక్స్ కలెక్షన్ వసు లు చేసి మున్సిపాలిటీ ఆదాయం పెంచాలన్నారు. ప్రతి వార్డులలో వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు తెలిపారు. తదుపరి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో అదనపు కలెక్టర్ మొక్క నాటి నీరు పోశారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వార్డు అధికారులు, పాల్గొన్నారు.

## సిఎంఆర్ చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రబీ 2023 /24కు సంబంధించి మిగిలిపోయిన కష్టం మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)లక్ష్యాన్ని వారం లోపు పూర్తిచేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా రైస్ మిల్లర్లతో కోరారు.గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సిఎంఆర్ పై సమావేశం నిర్వహించారు. 2023/24 రబీ సీఎంఆర్ కు సంభందించి ఇంకా 73 ఏ సి కే లు చెల్లించాల్సి ఉందని, అందువల్ల రైస్ మిల్లర్లు వారంరోజుల్లో చెల్లించడంతోపాటు,2024/25 రబి కి సంబంధించిన సిఎంఆర్ ను సైతం వేగవంతం చేయాలని ఆయన కోరారు. సిఎంఆర్ చెల్లింపులో నిర్లక్ష్యం చేయవద్దని ,జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తే ఇబ్బంది ఉండదని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు మిల్లర్లు సిఎంఆర్ చెల్లించాలని కోరారు. పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసిల్దారులు ప్రతిరోజు పర్యవేక్షించాలని చెప్పారు.జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ , రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు నారాయణ, శ్రీనివాస్, రైస్ మిల్లర్లు ,పౌర సరఫరాల శాఖ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు, ఈ సమావేశానికి హాజరయ్యారు.

## కక్ష సాధింపు చర్యలకు భయపడేదిలేదు

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** కాంగ్రెస్ పాలనలో ఒక్క రూపాయి అభివృద్ధి లేదు కాని వందలాది మందిపై కేసులు పెడుతున్నారని ఈ కక్ష సాధింపు చర్యలకు ఎవ్వరు భయపడరని మాజీ మంత్రి గుతకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన చండూరులోని మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న నివాసంలో మునుగోడు మాజీ ఎంఎల్‌ఎ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. చండూరులో మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్నకు చెందిన నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చి ఏం సాధిస్తారని ఫైరయ్యారు. బిఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టి ఓట్లు చేయించుకుందామని పగటికలలు కంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగం కుదేలైందని అన్నారు. రైతు రుణమాఫీపై క్లారిటీ లేదు,రైతు భరోసా అంతంత మాత్రమే, సన్న వడ్ల బోనస్ ఒక బోగస్‌గా మారిందని అన్నారు. తెలంగాణలో వ్యవసాయరంగం దళారుల చేతిలోకి వెళ్లిందని ఆరోపించారు. ఈ సమావేశంలో మునుగోడు మాజీ ఎంఎల్‌ఎ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి , నల్లగొండ మాజీ ఎంఎల్‌ఎ కంచర్ల భూపాల్‌రెడ్డి , బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి , రెగట్టే మల్లికార్జునరెడ్డి , చండూరు మాజీ జడ్పిటిసి కర్నాటి వెంకటేశం , మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, కోడి వెంకన్న, గుంటి వెంకటేశం పాల్గొన్నారు.

## గూడెపు వెంకటయ్యకు న్యాయం చేయండి

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మర్రిపడిగ గ్రామానికి చెందిన గూడెపు వెంకటయ్య కు గత ప్రభుత్వం సర్వే నెంబర్ 68లో 6 గుంటల భూమినికి సంబంధించి పట్టా పాస్ బుక్‌ను అందజేయడం జరిగింది. ఇటీవల వెంకటయ్య కు చెందిన 6 గుంటల భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటిస్తూ స్థానిక ఎంపిడివో స్థలంలో బోర్డును ఏర్పాటు చేయడం జరిగింది. పేద దళితుడైన వెంకటయ్యకు గత ప్రభుత్వం పట్టా ఇచ్చిన భూమిని ఇప్పడు ప్రభుత్వ స్థలం అంటూ అధికారులు వెంకటయ్య భూమిలో బోర్డును ఏర్పాటు చేయడం అన్యాయం అని తక్షణమే స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి న్యాయం చేయాలని అధికారులను కోరారు. అనంతరం ఎంపిడివోకు, తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఇప్పటికే ఇట్టి స్థలంపై ఆలేకు కోర్టులో కేసు కూడా నడుస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

### తుర్కపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆలేరులో జరుగుతున్న అభివృద్ధే ప్రజా సంక్షేమానికి నిదర్శనమని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఐలయ్య అన్నారు. గురువారం తుర్కపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నూతన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా సుక్య తండాలో, బబ్లు నాయక్ తండాలో, ధర్మారం, ములకలపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు బిలియా నాయక్ తండాలో ఎస్టీ కమ్యూనిటీ భవనం, మల్కాపూర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం, వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. దత్తాయపల్లిలో గౌడ కమ్యూనిటీ భవనం, గుజ్జవానికుంట తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలను సందర్శించారు. ధర్మారం నుండి బిలియా నాయక్ తండకు వేస్తున్న బీటీ రోడ్డును పరిశీలించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని అన్నారు. మొదటి విడతలో ఆలేరు నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసినట్లు, వాసాలమర్రి గ్రామంలో అదనంగా 130 ఇండ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో మొదటగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారి గృహప్రవేశానికి వెళ్లి యాటను, పట్టు వస్త్రాలను దంపతులకు అందజేస్తానని అన్నారు. ఇతరులు గృహప్రవేశానికి పిలిస్తే దంపతులకు పట్టు వస్త్రాలను సొంతంగా అందజేస్తానని అన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల పాలనలో గత ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇండ్లు, ఒక్క రేషన్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కానుగంటి శ్రీనివాస్ యాదవ్, నాయకులు ధనావత్ భాస్కర్ నాయక్, దేవరుప్పల ఐలయ్య, దొనికేన వెంకటేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ సంస్థలను 'ప్రైవేట్'కు అప్పగించొద్దు : శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు కార్మికులకు పిలుపునిచ్చారు. భారతదేశంలోని ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సివిల్ సప్లై ఆఫీస్‌లో సివిల్ సప్లై మేనేజర్ ప్రసాద్‌కు, అసిస్టెంట్ మేనేజర్ బెనర్జీ లకు 9వ తేదీ సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్ర కార్మిక చట్టాలను రూపొందించాలని, ఆనాడు సాధించుకున్న కార్మిక చట్టాలు యాథావిధిగా కొనసాగించాలని, నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వారికి అప్పగించవద్దని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. స్కీమ్ వర్కర్లను రెగ్యూలర్ చేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులను గుర్తించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, హమాలీ యూనియన్ నాయకులు పోలబోయిన కొండలు, నాగేశ్వరరావు, సిహెచ్ కళ్యాణ్, వెంకటేశ్వర్లు, గోపి, జక్కుల మల్లయ్య, బాలాజీ, మల్సూర్, బెల్లంకొండ రామ్మూర్తి పాల్గొన్నారు.

# వైద్యసేవల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

### సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** వర్షాల కారణంగా రాబోయే మూడు నెలలు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించార.గురువారం ఆమె మండలంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం,తహసిల్దార్ కార్యాలయం,కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ఏఎన్సి రిజిస్టర్,మందుల స్టాక్ రిజిస్టర్, ఓపి,మాత,శిశు మరణాల రిజిస్టర్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా తగినన్ని మందుల స్టాక్ ఉన్నాయా సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్న వారి వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూభారతి ద్వారా తీసుకున్న చర్యలు సంబంధిత వ్యక్తులకు జారి చేసిన నోటీసులు వివరాలను తహసీల్దార్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. భూభారతి కిందకి వచ్చిన అన్ని దరఖాస్తులకు ముందుగా నోటీసులు జారీ చేయాలని అన్ని వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని నోటీసులు సైతం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు.అనేక పనుల నిమిత్తం తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో ప్రజలతో ఆమె మాట్లాడారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసి పాఠశాల పరిశుభ్రతను వంటగదిని టాయిలెట్లు,విద్యార్థుల చదువు భోజనం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండ ఆర్‌డిఒ రమణారెడ్డి ఆయా కార్యాలయాల అధికారులు సిబ్బంది ఉన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/ హాలియా:** హాలియాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, భవిత కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అమిత్ నారాయణ గురువారం సాయంత్రం పరిశీలించారు. హాలియాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అడిషనల్ కలెక్టర్ అమిత్ నారాయణ కు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగానే గురువారం సాయంత్రం అడిషనల్ కలెక్టర్ అమిత్ నారాయణ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా న్ని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో వారితో మాట్లాడి తెలుసుకున్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో కొన్ని సౌకర్యాలు లేక విద్యార్థినీలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా వంటగది ప్రాంతంలో సరైన కాంక్రీట్ లేక దుమ్ములేస్తుందని ఇక్కడ సీసీ ఏర్పాటు చేయాలని విద్యార్థినిలు కోరినట్లు తెలిపారు. వంట గదిలో కూడా కొన్ని సమస్యలు ఉన్నాయని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినీలు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పక్కనే ఉన్న మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి కి, ఇంచార్జ్ తాసిల్దార్ రఘు, ఎండిఓ సుజాతకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం భవిత సెంటర్ ను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ నవీన్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## కార్పొరేట్ సంస్థలకు సంపద దోచిపెట్టడం ఎంతవరకు న్యాయం?

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సామాన్యులు కట్టే పన్నులతో నడిచే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు సంపద దోచిపెట్టడం ఎంతవరకు న్యాయమని, ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ ప్రభుత్వాలను ప్రశ్నించారు. గురువారం హుజూర్‌నగర్‌లో ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి అధిక పన్నులు చెల్లించే 72 శాతం సామాన్యులలో కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. అటువంటి కార్మికులకు హక్కులను లేకుండా చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మికులందరూ పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లారావు రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జెట్టి ప్రసాద్, మారుడి శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్యనుండే భాషల్లో పట్టు

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/మోతె:** విద్యార్థులు ప్రాథమిక విద్య నుండే తెలుగు, ఇంగ్లీష్ భాషలలో పట్టు సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం మండలంలోని మామిళ్ల గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదిలోని విద్యార్థులను తెలుగు, ఆంగ్ల భాష సబ్జెక్ట్‌లను చదివించారు. విద్యార్థులు మంచిగా చదివిన వారిని అభినందించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, నిత్యావసర సరుకుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పక్కన శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనంలో విద్యాబోధన చేయవద్దని, పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వ కుండా మట్టితో చదును చేయించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించి, పదవ తరగతి విద్యార్థులకు క్లాస్‌లు నిర్వహించి చాప్టర్‌పై పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల చేత బోర్డుపై మాథ్స్‌చేయించారు. అలాగే మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని కూడా అకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించారు. రెవిన్యూ సదస్సుల నివేదికలో వచ్చిన దరఖాస్తులపై పర్యవేక్షణ తీరు, రేషన్‌కార్డులకోసం వచ్చిన దరఖాస్తుల వెరఫికేషన్‌ను కలెక్టర్ తహసీల్దార్ వెంకన్నను అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యంగా ఓటర్ జాబితాలో సవరణకు వచ్చే 6,7,8 ఫార్మట్లను జాగ్రత్తగా నింపాలని సూచించారు. ఎన్నికల కమిషన్ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం బిఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వెంకన్న, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగయ్య, ఉపేంద్ర, ఉపాధ్యాయులు రామనర్సయ్య, జీవి నర్సింహరావు, వెంకట్రామిరెడ్డి, సీనయ్య, నిర్మల పాల్గొన్నారు.

## తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులు ఆదేశించారు. గురువారం స్థానిక ఏం.ఏ.ఎల్.డి కళాశాలలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 79 గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో జూలై 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి రోజు 50 మంది బిఎల్వోల ఈ శిక్షణలో పాల్గొంటారని, ఇందులో ఫారం 6 ఓటర్ల నమోదు ఫారం 7 పేర్ల తొలగింపు, ఫారం 8 వివరాల సవరణ పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో బిఎల్వోలు కీలక పాత్ర పోషిస్తున్నారని. వారు తమ నిధులను పూర్తి స్థాయిలో బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. ఓటర్ల జాబితాను ముందు ఉంచుకొని వాటిని క్షుణంగా పరిశీలించి ఏదైనా తప్పులు ఉంటే సవరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు ఫారం 7 ద్వారా పేర్ల తొలగింపు, ఫారం 8 ద్వారా వివరాల సవరణలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. బిఎల్ఓలు తమ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి జాబితాలో తప్పులు లేకుండా సరిదిద్దాలని ఆదేశించారు. గద్వాల్ తహసీల్దార్ మల్లికార్జున్, మాస్టర్ ట్రైనర్ అశోక్, నరేష్, సీనియర్ అసిస్టెంట్ నగేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా పింఛన్ల పంపిణీ



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** పింఛన్లు ఏ ఆధారం లేని వారికి భద్రత కలిగిస్తాయని, పెన్షన్ల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చేయూత పథకంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఆధారం లేని వారికి పెన్షన్ అందిస్తే వారిని ఆదుకున్న వారమవుతామని, అధికారులు పెన్షన్ల పంపిణీ పకడ్బందిగా నిర్వహించాలని, వృద్దులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం ద్వారా పంపిణీ చేస్తున్న పెన్షన్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఫించన్లకు సంబంధించి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు లాగిన్‌లో ఉన్న వివరణ ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అదేశించారు. పంచాయతీ కార్యదర్శులు చనిపోయిన వారి వివరాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రత్యేకించి వృద్ధ్యాప్య పెన్షన్లలో చనిపోయిన వారి పేర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఆన్‌లైన్ జాబితా నుండి తొలగించాలని, ఒకవేళ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు ఉంటే స్పష్టంగా పేర్కొన్నాలని అదేశించారు. ఈసమావేశంలో చేయూత పెన్షన్లు, అర్హత నియమ, నిబంధనలు, పెన్షన్ల పంపిణీలు, పంచాయతీ కార్యదర్శులు పాటించాల్సిన నియమాలు, అథెంటికేషన్ తదితర అంశాలపై సెల్ఫ్ సంచాలకులు గోపాలరావు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో వివి అప్పారావు, డిఎల్‌పివో నారాయణరెడ్డి, పోస్టల్ సూపరిడెంట్ వెంకటేశ్వర్లు, జిపిఎం రవి, టిసిఎస్ అధికారి లోకేష్ పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దరఖాస్తులు చేసుకున్న నిరుపేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన నిరు పేదలకు ఇళ్ళ స్థలాలు, ఇం దిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నల్లగొండ పట్టణ కమి టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం ఏఓకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పబ్బు వీరస్వామి మాట్లాడుతూ పట్టణంలోని నిరుపేదలకు పానగల్ అనేశ్వరమ్మ గుట్ట సర్వే నెంబర్ 33 లో ఉన్న ప్రభుత్వ భూమి లో దరఖాస్తులు పెట్టుకున్న వారికి విచారణ చేసి ఇళ్ళ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. పట్టణ కార్యదర్శి కర్ర సైది రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు సాగర్ రోడ్డులోని మాతృక భూమి సర్వే నెంబర్ 848 లో వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ వెంట ఉన్న ప్రభుత్వ భూమి ఒక ఎకరం ఉన్నందున నిరు పేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరారు. సిపిఐ సహాయ కార్యదర్శి లెనిన్, నాయకులు మదార్, సుజాత, విజయ, చింత ధనలక్ష్మి, అక్కలయ్య, యూసుఫ్, శంకర్, యేసు,కె మల్లేష్, లింగయ్య పాల్గొన్నారు.



## ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన క్రాంతికుమార్



ప్రజాపక్షం/ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎస్ఐగా క్రాంతికుమార్ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.అసాంఘిక కార్యక్రమాలు, జూదం, యువత ఆన్‌లైన్ గేమ్స్, లోన్ ఆప్స్ పట్ల అప్రమ త్తంగా ఉండాలన్నారు. జల్సాలకు అలవాటు పడి అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకోకూడదని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

## ప్రైవేట్ లాడ్జిని సీజ్ చేసిన ఎఎస్పి శేషాద్రిని రెడ్డి

ప్రజాపక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలో జాతర గ్రౌండ్ ఏరియాలో నందీశ్వర కాంప్లెక్స్ కు ఎదురుగా సాయి చరణ్ అనునాధుడు శ్రీ రాజరాజేశ్వర ప్రైవేట్ లాడ్జిలు నడుపుతూ గత కొద్ది రోజులుగా అసాం ఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఎటువంటి సరి యైన ధృవపత్రాలు లేకుండా అధిక డబ్బులకు ఆశపడి కిరాయిలకు ఇస్తు న్నాడని ఈ క్రమంలో గత కొద్ది రోజుల క్రితం తప్పుడు ధ్రువ పత్రాలు చూపి ఒక మైనర్ అమ్మాయిని అట్టి లాడ్జికి తీసుకురాగా అట్టి గుర్తింపు పత్రాలు సరిగా చూడకుండా వారికి రూమ్ కిరాయికి ఇవ్వగా తదుపరి ఇట్టి విషయంలో రుద్రంగి పోలీస్ స్టేషన్ నందు పోక్సో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయినదని పై అధికారుల ఉత్తరుల మేరకు గురువారంరోజు లాడ్జిని సీజ్ చేయడం జరిగిందని వేములవాడ ఎఎస్పి శేషాద్రిని రెడి ఒక ప్రకటలో తెలి పారు.

## స్మార్ట్‌సిటీ పనుల అవినీతిపై విచారణ జరపాలి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: గత పాలకుల నగరంలో అభివృద్ధి పనుల పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేశారని, అంచనాలు విచ్చలవి డిగా పెంచి అశాస్త్రీయంగా నాణ్యతాలోపంతో పనులు చేయడంతో రెండేళ్ల గడవక ముందే ఎక్కడికక్కడ ఊడిపోతున్నాయని, వాటి మీద విచారణ జరి పించాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ పార్టీ స్మార్ట్ సిటీ పనులు, కూడళ్ల సుందరీకరణ పనుల్లో నాణ్యత లోపిస్తుందని ధర్నాలు చేస్తే బిజెపి మాత్రం ఒక్క రోజు సైతం నోరు మెదపలేదన్నారు. అప్పుడే బిఆర్ఎస్, బిజెపి మధ్య చీకటి ఒప్పందం గుర్తించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత నగర అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు రాలేదని బిజెపి నాయకులు మాట్లాడుతుండడన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్మార్ట్ సిటీ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.159.24 కోట్లు విడుదల చేసిందని, సీఎం అస్యూరెన్స్ పనులకు రూ.32 కోట్లకు గ్రాంట్ ఇచ్చిందని, పట్టణ ప్రగతి సంబంధించి రెండున్నర కోట్లు చెల్లించిందని తెలి పారు. బిజెపి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తగదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయే ఎన్నికల్లో బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, చర్ల పద్మ, కల్ల సతీష్, దన్నా సింగ్, ఖంరొద్దీన్, షబానా మహ్మద్, జ్యోతిరెడ్డి, ముల్కల కవిత, తిరుమల, హసీనా, కుర్ర పోచయ్య, సుదర్శన్, నెల్లి నరేష్, వంగల విద్యాసాగర్ తదితరులున్నారు.

## బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ కృషి



ప్రజా పక్షం / మల్లాపూర్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణా రావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సిరిపూర్ గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ లో భాగంగా గ్రామంలో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టి రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞలు చేశారు. ప్రభుత్వం నిరుపేదల కోసం సన్న బియ్యం పంపిణీ ఇందిరమ్మ ఇండ్లు ఉచిత కరెంటు బస్ సౌకర్యాన్ని కల్పించిందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, గ్రామ శాఖ అధ్య క్షుడు బద్దం రాజశేఖర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్ల రాజన్న, ఏఎంసి డైరెక్టర్ నల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయ కులు, సోమ నాగార్జున రెడ్డి, పెంట శ్రీనివాస్,మిల్యా నవీన్, సరికెల మహి పాల్ తదితరులున్నారు.

## ఎమ్మెల్యే చొరవతో హైదరాబాద్ బస్సు ప్రారంభం



ప్రజాపక్షం/మల్లాపూర్ : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేకత చొరవతో మల్లాపూర్ మండల కేంద్రం నుండి హైదరాబాద్ వరకు ప్రత్యేక బస్సును బుధవారం రాత్రి స్థానిక నాయకులు ప్రారంభించారు. మల్లాపూర్ నుండి హైదరాబాద్ వరకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కు స్థానిక నాయకులు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శరత్ గౌడ్, జీవన్ రెడ్డి, రమేష్ రెడ్డి, బిక్షపతి, రాజు గౌడ్, లక్ష్మ ణ్, టిఆర్ఎస్ కార్యక ర్తలు తదితరులున్నారు.

## క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



ప్రజాపక్షం/ధర్మపురి : ఇంట్లో పిల్లలతో జరిగిన వాగ్వాదంతో మనస్తాపం చెంది క్షణికావేశంలో వివా హిత ఉరి వేసుకొని ఆత్మహ త్యకు పాల్పడిన ఘటన ధర్మ పురి లో చోటుచేసుకుంది. ఎస్ఐ పులిచెర్ల ఉదయ్ కుమార్ కథనం మేరకు జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి అల్లకొండ సమ్మయ్యతో బోయినపల్లి మండలం విలాసాగరం గ్రామానికి చెందిన శ్రీవాణి తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు అజయ్, కూతురు అక్షిత ఉన్నారు. పెళ్ళైన తొలినాళ్ళ లోనే సమ్మయ్య, శ్రీవాణిల మధ్య గొడవలు జరగ్గా పెద్దల జోక్యంతో పరిష్కరించు కున్నారు. కాగా బుధవారం సాయంత్రం ఇంట్లో పిల్లలతో గొడవపడ్డ శ్రీవాణి క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఫ్యానుకు చీరతో ఉరివేసుకుంది. గమనించిన బంధువులు, చుట్టుపక్కల వాళ్ళు వెంటనే శ్రీవా ణిని కిందికి దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెంది నట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## కాంగ్రెస్ హయాంలోనే రైతులకు భరోసా

ప్రజాపక్షం/రామడుగు: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి భరోసా ఉందని యువజన కాంగ్రెస్ నాయకులు మామిడి దిలీప్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన మాట ప్రకారం 9 రోజులలో 9 వేల కోట్లు రైతుల ఖాతాలలో రైతు భరో నిధులు విడుదల చేసిన సంధర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెండింగ్ పనులు వెంటనే మొదలు పెట్టండి

### అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ కే. హైమవతి



ప్రజాపక్షం/ సిద్దిపేట/హుస్నాబాద్: హుస్నాబాద్ డివి జన్ కోహెడ, అక్కన్నపేట , హుస్నాబాద్ మండలాల్లో పెండిగ్‌లోయున్న అభివృద్ధి పనులను వెంటనే మొదలు పెట్టి పనుల పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే హైమవతి అధికారులను అదేశించారు. గురువారం సిద్ది పేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ పరిదిలోని మూడు మండలాల్లో ప్రభుత్వం ప్రకటించిన పలు అభివృద్ధి పను లపై అధికారులతో హుస్నాబాద్ మున్సిపల్ కార్యాల యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నా బాద్ నుండి కొత్తపెల్లి వరకు చేపట్టే 4 వరులస రహదారి నిర్మాణం ,పనులను వేగం చేయుటకు అనుమతులను ఇవ్వాలని టెండర్ విధానం పూర్తి చేసి రోడ్డుకు ఇరుప్ర క్కల ఉన్న చెట్లను తొలగించుటకు ఈ నెల చివరి కల్ల పూర్తి చేయాలని అధికారులను అదే శించారు. అంతక్కపేటలో 220 కె వి విద్యుత్ జంక్షన్‌కు 10 ఎకరాల స్థలము మండల రెవెన్యూ అధికారి వద్ద సిద్దంగా ఉందని విద్యుత్ అధి కారుల వెంటనే అనుమతి తీసుకోవా లని కొరారు. జిలెల్ల గడ్డవద్ద గల స్థలంను అనుమతి తీసుకుని ఇంజనీ రింగ్ అధికారులకు అప్పగించాలని కొరారు. పట్టణంలోని కొత్త చెరువు మినీట్యాంక్‌బండ్ పనులకు ఇరిగెషన్ అధికారుల అను మతులు ఇవ్వాలని అదేశించారు. రంగనాయక సాగర్ నుండి నీటిని అందించేందుకు బస్వాపూర్, పోరెడి పల్లి , భూములకు అవార్డు కాపీలను పూర్తి అయినందున పనుల చూడలన్నారు. హుస్నాబాద్ నుండి జనగాం వరకు చేపట్టె రోడ్డు పనులకు ప్రపోజల్‌స్టేజీ లో ఉందని నాక్ సెంటర్ కోసం స్థల సేకరణ పూర్తి అయిందని తెలి పారు. హుస్నాబాద్‌లో అర్డియే కార్యలయం కోసం స్థలం చూపించాలని రెవెన్యూ అధికారులను కోరారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలకు పి జి కోర్సు ఎం, కాం మంజూరు అయిందని అందులో 60 సీట్లు కేటాయించి నట్లు తెలిపారు. ఇందిర్మ ఇళ్ల పనులను ఎంపిడివోలు పర్యవేక్షన చేయాలని కోరారు. కొహెడ మండలంలో సమీకృత పాఠశాల భవనం , 150 పడకల అసుపత్రీ నిర్మాణం, పరిశ్రమల పార్కు, ఎల్లమ్మ చెరువు సుందరీక రణ, సింగరాయ చెరువు ద్వారా సాగు నీటిని అందిచే ందుకు క్వాలల కోసం భూ సేకరణ పనులు, స్టేడియం పనులు స్విమింగ్‌పూల్, జిమ్‌లు తదితర అభివృద్ధి పను లపై అధికారులతో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో అర్డివో రామూర్తి, అయా మండలాల రెవెన్యూ అధికా రులు, ఇంజనీరింగ్ అధికారుల పాల్గోన్నారు.

## మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి టియుడబ్ల్యుజె ఆహ్వానం



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూని యన్ జిల్లా 3వ మహాసభ ఈనెల 9న జరుగుతుందని మహాసభకు రావా లని ఆ సంఘం నేతలు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డిని కోరారు. జగి త్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో గురువారం మార్యదపూర్వకంగా కలిసి జగిత్యాల జిల్లా టియుడబ్ల్యుజే(ఐజేయూ)3వ మహాసభ పట్టణం లోని సుమంగళి గార్డెన్‌లో జరుగనుండగా జిల్లా టియుడబ్ల్యూజే(ఐ జేయూ) ఆహ్వాన కమిటీ సభ్యులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. జీవన్‌రెడ్డిని కలిసిన వారిలో యూనియన్ నాయకులు చీటి శ్రీనివాస్‌రావు, బొడ్డుపెల్లి అంజయ్య, సిరిసిల్ల వేణుగో పాల్ , అలిశెట్టి మదన్‌మోహన్, గడ్డల హరికృష్ణ లున్నారు.

## విపత్తు సమయంలో 'ఆపద మిత్ర' వలంటీర్లు ముందుండాలి

### కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, దుర్ఘటన సమ యంలో ప్రజలను రక్షించేందుకు ఆపద మిత్ర వాలంటీర్లు ముందుండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రెవెన్యూ శాఖ విపత్తుల నిర్వహణ విభాగం ఆధ్వ ర్యంలో జిల్లాలోని 120 మంది డిగ్రీ విధ్యార్థులు, ఎన్‌సిసి వాలంటీర్లకు 12 రోజుల పాటు ఇవ్వ నున్న ఆపదమిత్ర శిక్షణను గురువారం బిసి స్టడీ సర్కిల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లా డుతూ అవగాహన లేకపోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రమాదం జరిగే అవకాశాలను ముందుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమన్నారు. ప్రమాదులు ఎదర్కొనేందుకు మొదటి దఫాలో గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వాలంటీర్లకు ఆపద మిత్ర శిక్షణ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. రెండవ దఫా డిగ్రీ కళాశాల స్థాయి, ఎన్‌సిసి విధ్యా ర్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆపద మిత్ర శిక్షణలో భాగంగా ఫైర్, పోలీస్, పంచాయ తీరాజ్, వైద్యశాఖ, పశుసంవర్ధశాఖ, సైబర్ తది తర అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామ న్నారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపద మిత్ర శిక్షణ తీసుకున్న వారు ప్రమాదాల నివార ణకు ముందుంటారని తెలిపారు. శిక్షణకు హాజ రైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌వొ వెంకటేశ్వర్లు, జిల్లా అగ్ని మాపక అధికారి ఎం.శ్రీనివాస రెడ్డి, బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్‌లు పాల్గొన్నారు.

## రోగులకు డైట్ ఫుడ్ అందించాలి

### కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: రోగులకు డైట్ ఫుడ్ అందించ డంతో పాటు పాలు, ఇడ్లీ , బ్రెడ్, ఫ్రూట్స్ పోషక పదార్థాలు అందిం చాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదే శించారు. గురువారం రాయికల్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీ చేసి ఓపి సేవలు, ఐపీ సేవలు, రికార్డ్స్, ల్యాబ్ రికార్ట్స్. ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసినీ జిల్లా కలెక్టర్ పరిశీలించారు ఆసుపత్రిలో వైద్యసేవలను గురించి నేరుగా పేషెంట్లని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. వైద్యసేవలుమెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని అధికారులను ఆదేశిం చారు. రోజుకు ఎన్ని ఓపిలను చూస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందస్తు వర్షాకాలం సీజనల్ వ్యాధులు పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ మలేరియా, ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, ఎంఆర్‌వో నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్ డిమాండ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:మాన కొండూర్ పట్టణంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండిం గ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలకు గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి ప్రహరీ గోడను నిర్మించాలని కోరారు. ఇంటర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని , ప్రభుత్వ జూనియర్ కళాశా లను అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వం 12 ఎస్సీ గురు కుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని మానుకోవాలన్నారు. మానకొండూర్‌లోని ప్రైవేట్ పాఠ శాలలు ఇష్టానుసారంగా నిబంధనలు లెక్కచేయని వైనంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నియంత్రణకు ప్రణాళికా బద్ధంగా పని చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : క్యాన్సర్ నియం త్రణకు ప్రణాళిక బద్దంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలె క్టరేట్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ పై సంబంధిత అధి కారులతో సమీక్ష నిర్వహించారు. రోహిణి ఫౌండే షన్ ద్వారా 10 గ్రామాలలో పర్యటించి 2 వేల కు పైగా ప్రజలను క్యాన్సర్ స్క్రీనింగ్ చేశామని అన్నారు. ప్రజల అలవాట్ల ఆధారంగా పరీక్షలు నిర్వహించి 104 మందికి క్యాన్సర్ గుర్తించా మని, వీరిలో 90 మంది స్టేజి 3, స్టేజి 4 దశలో ఉన్నారని అధికారులు వివ రించారు. ప్రైవేట్ ఆసుపత్రుల, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ రంగం లోని క్యాన్సర్ చికిత్స అందించే ఆసుప త్రులతో కోఆర్డినేట్ చేసుకుంటూ క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని అన్నారు.30 సంవ త్సరాల కంటే ఎక్కువ వయస్సు గల వారిని ఎన్‌సిడి సర్వే లో భాగంగా నోటి క్యాన్సర్ లక్ష ణాలు పరిశీలించి, అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. క్యాన్సర్ రోగులకు చికిత్స అందించిన తర్వాత మళ్ళీ చెడు అలవాట్లు బారినపడకుండా కౌన్సెలింగ్ అందిం చాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీలు చెయాలి

### ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/హుజురాబాద్: హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠ శాల, కళాశాల బస్సులను తనిఖీలు చేసి ఫిట్ నెస్ లేని బస్సు లను సీజ్ చేయా లని, స్పెషల్ డ్రైవ్ చెయ్యాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) హుజురాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచె వేణుకి గురువారం వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గం లో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీలు చేయాలని అలాగే ప్రతి బస్సుకు ఎడ మవైపు, వెనుక స్కూల్ పేరు చిరునామా, ఫోన్ నెంబర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండే విధంగా చూడాలని ఫైర్ సేఫ్టి బస్సు కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో కొన్ని ప్రవేట్ పాఠ శాల బస్సులో సామర్థ్యానికి ఎక్కువగా విద్యార్థులను ఏక్కించుకుంటున్నారని, అలాగే అనుమతి లేకుండా ఫిట్ నెస్ లేకుండా తిరుగుతున్నాయని వెంటనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అలాగే బస్సుల పత్రాలను, డ్రైవర్ సామర్థ్యా లను డ్రైవర్ లైసెన్స్ లను పరిశీలించాలని నిబంధనలు పాటించని ఫిట్నెస్ సర్టి ఫికెట్స్ లేనటువంటి ప్రైవేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గణేష్, రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల బియ్యం పక్కదారి!

### 60 క్వింటాళ్ళ రైస్‌పట్టుకున్న పోలీస్-టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: పేదలకు దక్కల్సినా బియ్యం పక్కదారి పడుతుందనే విషయం తెలు సుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం వలపన్ని పట్టుకున్నారు.రాజన్న సిరిసిల్లా జిల్లా ఎస్పీ మహేష్‌గితే ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. గురువారం గొల్లపల్లి గ్రామానికి చెందిన వీణవేని దేవయ్య అను వ్యక్తి వివిధ ప్రాంతాలలో తక్కువ దరకు రేషన్ బియ్యం సేకరించి ఎక్కువ ధరకు రేషన్ బియ్యం అమ్మడా నికి నిల్వ ఉంచాడన్న సమాచారం అందని తెలు సుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో ఎల్లారెడ్డిపే టలో సంయుక్త ఆకస్మికంగా దాడి చేసి సుమా రుగా అరవై క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని దేవయ్యను రేషన్ బియ్యాన్ని ఎల్లారెడ్డి పేట పోలీసుస్టేషన్‌కు అప్పచెప్పారు. అక్ర మంగా రాష్ట్రప్రభుత్వం పేదలకు అందా ల్సిన బియ్యం పక్కదారి పట్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు నిరంతర నిఘా పెడు తున్నామని విస్తృత స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ దాడు లలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాజేష్, తిరు పతి, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

## పేదల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారం...

### బానిసలుగా మారుతున్న తోపుడు బండ్ల వీధి వ్యాపారులు. !

ప్రజా పక్షం / మెట్ పల్లి: పేదల అవసరాలు అసరాగా తీసుకోని కొందరు రోజువారిగా వడ్డీ వ్యాపారులకు వరంగా మారుతోంది. వడ్డీ వ్యాపారులు పేద మొత్తంలో అప్పులు ఇచ్చి అధిక మొత్తం వసూళ్లు చేస్తూ పేదల కష్టాన్ని వడ్డీ వ్యాపారులు కాజేస్తున్నారు. దీంతో తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించక కుంటుబాన్ని వది లేసి వెళ్లే పరిస్థితులు వస్తున్నాయి. చెసిన అప్పు తీర్చడా నికి రోజువారి కూలీగా పనిచేసి జమ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి అప్పు తీర్చిన కాని అదనంగా రూ.1000 వసూలు చేస్తున్నారు. దీంతో అప్పు తీసుకు న్నది కొద్దిగా చెల్లించాల్సిన అప్పు పెద్ద మొత్తం ఉండ దంతో సంపాదన అంతా వడ్డీలకే సరిపోతుందని దీనితో వారి కుంటుంబం పోషణ కష్టంగా మారుతుందని ఎవ రైనా ఆసుపత్రి పాలైనప్పుడు పెద్ద మొత్తం అప్పు చేయాల్సి వస్తుంది అని బాధితులు వాపోతున్నారు.

**రాజకీయ అండదండల తో రెచ్చిపోతున్న అక్రమ వడ్డీ వ్యాపారులు...?**

మెట్ పల్లి పట్టణంలోని వెంకట్రావుపేట్ నుండి వట్టి వాగు వరకు తోపుడు బండ్లు , చిరు వీధి వ్యాపారులు, మెకానిక్ షాపులు, కిరాణా షాపులు, ఆటో డ్రైవర్లు, పాన్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు , చాయ్ హోటల్ లు, బేకరీలు , ఇతర షాప్ యాజమాన్యాలు తీసుకుంటు న్నారు. రోజువారి వడ్డీ 30, నుండి 40 రూపాయల వరకు పడుతుంది. ఈ వడ్డీ వ్యాపారులు పట్టణ చివరి కాలనీల మహిళలను లక్ష్మం చేసుకుని ఏరలై పాడుతు న్నారు. పేద ప్రజలు వారి అవసరాల కోసం అప్పు తీసు కొని కట్టకపోతే వారి దగ్గరి నుండి ముక్క పిండి వసూలు చేస్తున్నారు. చాలా మంది మహిళలు ఇలా పెద్ద మొత్తం వడ్డీలకు తీసుకొని బలైపోతున్నారు. ఈ వధ్యకాలంలో చాలా సంఘటనలు మెట్ పల్లి లో చోటు చేసుకుం టుంది. ఈసంఘటనలపై ఆధారంగా కాఫీ లాగితే రోజువారి వడ్డీ ఆగడలు ఒక్కొక్కటి బయటికి వస్తు న్నాయి. ప్రజల ప్రాణాలు కొలిపోవకముందే వడ్డీ వ్యాపారుల నుండి బాధితులను కాపాడాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎరువుల దుకాణం తనిఖీ



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:**కాగజ్‌నగర్ మండలంలోని ఫర్టిలైజర్ షాప్‌ను గురువారం ఎఇఒ సృజన తనిఖీ చేశారు. షాపులోని స్టాక్‌ను పరిశీలించి దుకాణంలో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలను తనిఖీ చేశారు. లైసెన్స్, ధరల పట్టిక, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి నాణ్యతను పరిక్షించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. రైతులకు విత్తనాలు లేదా ఎరువులు కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడాలని, ఏమైనా అనుమానాలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## అటవీ కార్యాలయాల ఫర్నీచర్ జప్తు



**ప్రజాపక్షం/ జన్నారం :**కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు జన్నారంలోని ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం, దండేపల్లి మండలం తాళ్ల పేట లోని స్పెషల్ రిజర్వ్ ఆఫీసర్ కార్యాలయాల ఫర్నీచర్‌ను, ఇతర సామగ్రిని కోర్టు సిబ్బంది గురువారం జప్తు చేశారు. అటవీ శాఖలో గతంలో పని చేసిన రాజన్నను విధుల నుంచి తొలగించడంతో, ఆయనకు 15.89 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అయితే, ఈ ఆదేశాలను అటవీ అధికారులు అమలు చేయడంలో విఫలం కావడంతో, కోర్టు అధికారులు ఈ చర్యకు పూనుకున్నారు.ఈజప్తు ప్రక్రియ గురువారం పూర్తయ్యింది.

## ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి 2025 26 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు యూనివర్సిటి నోటిఫికేషన్ జారీ చేసినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి, కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పాస్ అయిన లేదా తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఓపెన్ డిగ్రీ బి.ఎ, బి.కాం, బి.ఎస్‌సిలో ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఆన్‌లైన్ ద్వారా పొందాలన్నారు. ప్రవేశాలు పొందేందుకు ఆగస్టు 13 చివరి తేది అని తెలిపారు. యూనివర్సిటి వెబ్ సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని రెండు సెట్‌ల జిరాక్స్ కాపీలు కళాశాలలో ఇవ్వాలని తెలిపారు. డిగ్రీలో మధ్యలో ఆపివేసిన వారు యూనివర్సిటి పర్మిషన్‌తో అడ్మిషన్ కంటిన్యూ చేస్తున్న 2,3 సంవత్సరం (2016 సంవత్సరం నుండి) సెమిస్టర్ విద్యార్థులు, ప్రస్తుతం డిగ్రీ విద్య అభ్యసిస్తున్న 2021 22 నుంచి 2024 25 సంవత్సరం విద్యార్థులకు తమ ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 13వ తేదీలోగా చెల్లించాలని ఇతర వివరాలకు 9160144943, 949414314 లేదా 9866398678ను సంప్రదించాలని సూచించారు.

## లేబర్ కోడ్‌ల రద్దుకు 9న దేశవ్యాప్త సమ్మె



**ప్రజాపక్షం/నస్పూర్:**కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎఐటియుసి పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరిస్తాయని, వ్యాపార వర్గాలకే మేలు చేస్తాయని విమర్శించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు సైతం ఈ సమ్మెకు మద్దతుగా నల్ల బ్యాడ్జిలు ధరించి విధుల్లో పాల్గొంటారని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎఐటియుసి, ఎన్‌హెచ్‌ఎం నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణే సింగరేణి లక్ష్యం: జిఎం



**ప్రజాపక్షం / మందమర్రి:**సింగరేణి సంస్థ ప్రధాన లక్ష్యం నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణా అని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపల్లి రీజినల్ జిఎం (క్వాలిటీ) గోపాల్ సింగ్ అన్నారు. గురువారం ఆయన మందమర్రి ఏరియా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం జి.దేవేందర్, ఇతర అధికారులు మొక్కను అందచేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవేందర్ బొగ్గు నాణ్యత సహా పలు అంశాలపై గోపాల్ సింగ్‌తో చర్చించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, ఐఇడి ఎస్ఇ కిరణ్ కుమార్, సర్వే ఆఫీసర్ భుక్య దేశాయ్, క్వాలిటీ ఇంచార్జ్ ప్రదీప్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :**మున్సిపాలిటీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. జులై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ గజానంద్‌కు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జిఒ నంబర్ 60 ప్రకారం వెంటనే వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేసే లోపు కనీసం రూ.26 వేలు చెల్లించాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించకుండా చూడాలని, ఆ సంస్థలలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి తదితరులు ఉన్నారు.

## కారు,లారీ ఢీ.. రోడ్డు ప్రమాదంలో ఫిల్మ్ నగర్ ఎస్ఐ మృతి



**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:**కారు.. లారీ ఢీ కొన్న సంఘటనలో ఫిల్మ్ నగర్ ఎస్ఐ రాజేశ్వర్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం సంగారెడ్డి పట్టణంలోని చాణిక్య పురి కాలనీకి చెందిన రాజేశ్వర్ ఫిల్మ్ నగర్‌ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా బుధవారం డ్యూటీకి వెళ్లిన రాజేశ్వర్ బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బం దోభస్తు నిర్వహించి తిరిగి వస్తుండగా చేర్యాల గేటు వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్ర మాదం సంభవించింది. కారు ,లారీఢీ కొన్న సంఘటనలో ఫిల్మ్ నగర్ ఎస్ ఐ రాజేశ్వర్ మృతి చెందారు. ఎస్ఐ రాజేశ్వర్‌కు భార్య గాయిత్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపైకేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో గురువారం ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ట్రాఫిక్ ఎసిపి మస్తాన్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం..



జన్నారంలో విద్యార్థుల ర్యాలీ



**ప్రజాపక్షం / జన్నారం:**అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నిషేధ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పిలుపునిస్తూ రాఘవేంద్ర లిటిల్ హన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గురువారం జన్నారం మండల కేంద్రంలో రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాల నుండి ధర్మారం చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి, రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జన్నారం మాజీ జెడ్‌పిటిసి, రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ, తన చిన్నతనంలో మోదుగు ఆకులలో భోజనం చేసేవారని, అప్పుడు మంచి ఆరోగ్యంగా ఉండేవారమని గుర్తు చేసుకున్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడంతో రోగనిరోధక శక్తి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వస్తువుల్లో వేడివేడి ఆహార పదార్థాలు, టీ వంటివి తీసుకోవడం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, తెలియకుండానే అనేక రకాల వ్యాధులకు గురవుతున్నామని ఆయన అన్నారు. దశల వారీగా ప్లాస్టిక్‌ను దూరం చేసుకోవాలని, అందరూ మందం కలిగిన కాగితాలతో, తాడుతో తయారైన జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. గురువారం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే బేటీ అయ్యారు. నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితి గురించి మంత్రికి వివరించి గ్రామాలకు కొత్త రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. తక్షణం స్పందించిన మంత్రి రూ 32.20 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ పనుల ప్రారంభోత్సవానికి ఈనెల 7న జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి కోమటిరెడ్డి విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల తరపుణ మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

## డబుల్‌బెడ్రూమ్ ఇండ్లకు తాళాలు వేసిన అధికారులు



**ప్రజాపక్షం/బాన్సువాడ :**బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో గురువారం ఆరు ఇండ్లకు రెవెన్యూ అధికారులు తాళం వేయడం పట్ల డబుల్ బెడ్ రూం నివాసపు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నివాసులు మాట్లాడుతూ కొంతమంది వ్యవసాయ పనులు, ఆసుపత్రులకు, వారాంతపు సంతకు వెళ్లారని చెబుతున్నా రెవెన్యూ అధికారులు ఇండ్లకు తాళాలు వేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనకు సంబంధించిన పూర్తి విషయాలు తెలుసుకున్న బిజెపి నాయకులు దేశాయిపేట్ గ్రామానికి చేరుకొని తాళాలు వేసిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పక్క గ్రామంలోనే డబుల్ బెడ్ రూం ఇండ్ల పరిస్తితి ఇలా ఉంటే నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థమవుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో బిపిఎల్ కోట కింద అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించారని, సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లకు తాళం వేసిన వారికి అండగా ఉంటామని, బాధితుల పక్షాన బిజెపి పార్టీ ఎల్లప్పుడు పోరాడుతుందన్నారు. బాన్సువాడ పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇండ్లపై సమగ్ర విచారణ జరిపి నిజమైన లబ్దిదారులకు న్యాయం చేయాలన్నారు. ఇట్టి విషయమై తహసీల్దార్ వరప్రసాద్‌ను వివరణ కోరగా డబుల్ బెడ్ రూం ఇండ్లపై ఫిర్యాదులురావడంతో నివాసం లేని వారి ఇంటికి తాళాలు వేయడం జరిగిందని, నివాసముంటున్న వారు దరఖాస్తు ఇచ్చినట్లయితే విచారణ చేపట్టి వారికే ఇండ్లను అందిస్తామన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం: కలెక్టర్



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్:**ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. గురువారం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నదీమ్ అహ్మద్‌తో కలిసి ఆసిఫాబాద్ మం డలం, బాబాపూర్ గ్రామంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంటశాల, నిత్యావసర సరుకుల నాణ్యత, బియ్యం నిల్వలు, వండిన ఆహారం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గురుకుల పాఠశాల భవనం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులతో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిప ల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన సేవలే లక్ష్యం: కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్,లక్ష్మ ణ్‌చందా:**ప్రజలకువిద్య,వైద్య ం,వ్యవసాయ రంగాల్లో నాణ్యమైన సేవలు అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలా ష అభినవ్ అధికారులను అదేశించారు.లక్ష్మ ణచందా మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ లు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ,పాఠశాలలు,అంగన్వాడీలు,ఎరువుల దుకాణాలను పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి న క లెక్టర్,రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని అవసరమైన సదుపాయాలు, మందులు అందుబాటులో ఉండాలన్నారు.అనంతరం జెడ్‌పిహైస్కూల్‌ను సందర్శి ంచి,తరగతులపరిస్థితి,మిడ్డే మీల్,ఉపాధ్యాయుల హా జరు,విద్యార్థుల విద్యాస్థాయి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థులతో ఇంగ్లీష్,గణిత పాఠాలు చే యించి వారిని ప్రోత్సహించారు.వనమహోత్సవంలో భా గంగా పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.అంగ



న్వాడీలలో చిన్నారులకు పోషకాహారం,బొమ్మల పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నారు.తర్వాత గ్రో మోర్ ఎరువుల దుకాణంలో నిల్వలు రిజిస్టర్లు,విక్రయ వివరాలను తనీఖీ చేసిన కలెక్టర్,రైతులకు నకిలీ విత్తనాలు,మందులు విక్రయించకూడదని ఆ దేశించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జులై నెలకు అవసరమైన 9000 మెట్రిక్ టన్నుల యూరియా గాను ఇప్పటివరకు 8800 మెట్రిక్ టన్ను లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే,సంబంధింత షాపులపై చర్యలు తీసుకోవడంతోపాటు ఎంఆర్‌పి ధరలకు విక్రయి ంచకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు.అధికారులు ఎరువుల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారి ంచాలని సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లా విద్యాధికారి రామారావు,జిల్లా వైద్యాధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయాధికారి ,మండల ప్రత్యేక అధికారి,తహసీల్దార్‌సరిత ,ఎంపిడిఒరాధా రాథోడ్,ఎంఇఒ, సంబంధితశాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం

అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్;**ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని లబ్ధిదారులకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం గోవిందాపూర్ గ్రామంలో ఆయన పర్యటించి, ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం ద్వారా ప్రభుత్వం గూడు లేని నిరుపేదలకు ఇళ్లు కల్పిస్తోంది. బేస్మెంట్ వరకు పూర్తయిన నిర్మాణాలకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పాఠశాల, ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం శిబిరాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను, దివ్యాంగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. స్లాట్ బుక్ చేసుకుని హాజరైన వారికి పారదర్శకంగా ధృవపత్రాలు జారీ చేయాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరా సౌర గిరిజన వికాస పథకాన్ని సమర్థంగా అమలు చేయండి: కలెక్టర్




**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:**జిల్లాలో ఇందిరా సౌర గిరిజన వికాస పథకంను విజయవంతంగా,పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి (పీవో)కుష్బూగుప్తా,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పథకం కింద గిరిజనులు సాగు చేసుసకుంటున్న పోడు భూములకు ఉచితంగా బోర్లు తవ్వించి,సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.దీని ద్వారా గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం లభించడంతో పాటు వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని,వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పారు.పథకం అమలులో భాగంగా,మండల స్థాయిలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఐటిడిఎ పిఒ కుష్బూ గుప్తా మాట్లాడుతూ,లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని,కమిటీలుఅర్హులను గుర్తించి వారికి తగిన పరికరాలు అందజేయాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఎఫ్ఒ నాగిని భాను,జెడ్‌పి సిఇఒ గోవింద్,జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,ఉద్యాన వన శాఖ అధికారి రమణ, ఎంపిడిఒలు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలు అమలు చేయాలి

జులై 9నదేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మెదక్ జిల్లా ఎఐటియుసి కౌన్సిల్ సమావేశంలో తీర్మానం



**ప్రజాపక్షం మెదక్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలు అమలు చేయాలని మెదక్ జిల్లా ఎఐటియూసి కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు.మెదక్ జిల్లా కేంద్రంలో ఎఐటియూసి కౌన్సిల్ సమావేశం అయ్యవారి లక్ష్మ ణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు యేసురత్నం, సీనియర్ నాయకులు రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. మోడీ చేస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నాలుగు కోడ్లను అమలు చేస్తూ శ్రామిక ప్రజలపై బానిసత్వం పెంపొందించే విధంగా ఉన్నదని దుయ్యబట్టారు. కేంద్ర కార్మిక సంఘాలు జాతీయ కార్మిక సంఘాలు 8 పని గంటలు కనీస వేతనాలు 26000 ఇవ్వాలని డిమాండ చేశారు.నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను అమలు కోసం దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జూలై 9 వ తారీఖున ఉంటుందని తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు,కార్మికులు, కర్షకులు,రైతులు శ్రామికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.అన్ని ప్రజాస్వామ్య సంఘాలు ప్రజాస్వామ్యవాదులు దేశ భద్రత కొరకు జాతీయ ప్రయోజనాలకు జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.మెదక్ పట్టణంలో నర్సాపూర్,కౌడిపల్లి, తూప్రాన్,రామయంపేట్ నిజాంపేట,శంకరంపేట్ తదితర కార్మికులందరూ నిరసన తెలిపాలని జిల్లా కౌన్సిల్ లో తీర్మానించారు.ఇపిఎఫ్ బిడికార్మికులకు 6000 పెన్షన్ కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనిబిడిజిఎస్టి పన్నులను రద్దు చేయాలని కో రారు లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించా రు. మెదక్ జిల్లా కార్యదర్శి నందం మాట్లాడుతూ ఏఐటియూ సి జిల్లా ఆఫీసును మెదక్ లో ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వినయ్, ఆకుల బిక్షపతి, కొండి లక్ష్మ ణ్, విష్ణు, ఎర్ర దాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

# డబుల్ సెంచరీతో గిల్ కొత్త రికార్డ్



ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీ సాధించాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్‌సచిన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ 311 బంతుల్లో ద్విశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. జోష్ టంగ్ వేసిన 122 ఓవర్ తొలి బంతిని ఫైన్ లెగ్ దిశగా ఆడి క్విక్ సింగిల్‌తో డబుల్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. టెస్ట్ ఫార్మాట్‌లో శుభ్‌మన్ గిల్‌కు ఇది రెండో డబుల్ సెంచరీ కాగా.. ఇంగ్లండ గడ్డపై మొదటిది కావడం విశేషం. ఇంగ్లండ్ గడ్డపై డబుల్ సెంచరీ సాధించిన మూడో భారత బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు.

### భారీ స్కోర్ దిశగా భారత్..

310/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. శుభ్‌మన్ గిల్‌తో పాటు ఓవర్‌నైట్ బ్యాటర్ రవీంద్ర జడేజా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. సెంచరీ దిశగా సాగిన జడేజాను లంచ్ బ్రేక్‌కు ముందు జోష్ టంగ్ షార్ట్ పిచ్ డెలివరీతో కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 6వ వికెట్‌కు నమోదైన 203 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. జడేజా సూపర్ బ్యాటింగ్‌తో తొలి సెషన్‌లో టీమిండియా 5 ఓవర్లు ఆడి ఒకే ఒక్క వికెట్ కోల్పోయి 109 పరుగులు చేసింది. రెండో సెషన్‌లో వాషింగ్టన్ సుందర్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ ఆచితూచి ఆడి డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

### కోహ్లీ, సచిన్‌కు దక్కని రికార్డ్!

### గిల్ నయా చరిత్ర..

ఈ ద్విశతకంతో శుభ్‌మన్ గిల్ పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. సెనా దేశాల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆసియా కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. 2011లో లార్డ్స్ వేదికగా శ్రీలంక కెప్టెన్‌గా తిలకరత్న దిల్షాన్ 193 పరుగులు చేశాడు. ఇదే ఇప్పటి వరకు ఆసియా కెప్టెన్ అత్యధిక స్కోర్. ఇంగ్లండ్‌పై డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత కెప్టెన్‌గానూ చరిత్రకెక్కాడు. ఇంగ్లండ గడ్డపై డబుల్ సెంచరీ బాదిన తొలి పర్యాటక జట్టు కెప్టెన్‌గా కూడా నిలిచాడు. భారత కెప్టెన్‌గా డబుల్ సెంచరీ బాదిన రెండో పిన్నవయస్కుడిగా కూడా గిల్ నిలిచాడు. గిల్ కన్నా ముందు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ(23 ఏళ్ల 39 రోజుల వయసులో) ఈ ఫీట్ సాధించాడు. పటౌడీ ఇంగ్లండ్‌తో ఢిల్లీ వేదికగా 1964లో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ సాధించాడు. సచిన్ టెండూల్కర్(26 ఏళ్ల 189 రోజుల), విరాట్ కోహ్లీ(27 ఏళ్ల 260 రోజులు) గిల్ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

## భారత్‌కు పాకిస్థాన్ హాకీ టీమ్!



ఆసియా కప్ 2025 కోసం పాకిస్థాన్ హాకీ టీమ్ భారత్‌లో పర్యటించనుంది. ఇందుకు భారత ప్రభుత్వం అనుమతిచ్చినట్లు తెలుస్తోంది. భారత హోం మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి కావాల్సిన అన్ని అనుమతులు లభించాయని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 7 వరకు బీహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా ఆసియా కప్ హాకీ టోర్నీ 2025 జరగనుంది. ఆసియా కప్‌తో పాటు తమిళనాడులోని మధురై వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ వరల్డ్ కప్‌లో కూడా పాకిస్థాన్ జట్టు పాల్గొనేందుకు అనుమతి లభించిందని క్రీడా మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

పాకిస్థాన్ హాకీ ఆటగాళ్ల వీసాల ప్రక్రియ కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ సమాచారాన్ని హాకీ ఇండియాకు కూడా తెలియజేసినట్లు సమాచారం. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ వరల్డ్ కప్ జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 24 జట్లు పాల్గొననున్నాయి.'భారత్ వేదికగా అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే ఏ జట్టుకు కూడా మేం వ్యతిరేకం కాదు. కానీ ద్వైపాక్షిక మ్యాచ్‌లు వేరు. ఆసియా కప్, జూనియర్ హాకీ వరల్డ్ కప్ కోసం పాకిస్థాన్ జట్లు భారత్‌కు వస్తాయి. ఇందుకు కావాల్సిన అనుమతులన్నీ లభించాయి. భారత్.. ఒలింపిక్ చార్టర్‌ను అనుసరించాల్సి ఉంది. పోటీలో పాల్గొనకుండా ఓ దేశాన్ని మేం అడ్డుకోలేం'అని క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపాడు.

## కారు ప్రమాదంలో ఫుట్‌బాల్ స్టార్ మృతి




పోర్చుగీస్ ఫుట్‌బాల్ స్టార్, లివర్‌పూర్ ప్లేయర్ డియోగో జోటా(28) మృతి చెందాడు. బుధవారం జరిగిన ఘోర కారు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంలో డియోగో జోటాతో పాటు అతని సోదరుడు ఆండ్రీ సిల్వా కూడా మరణించాడు. స్థానిక మీడియా వివరాల ప్రకారం స్పెయిన్‌లోని జమెరా నగరంలో అర్ధరాత్రి 12.40 గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కారు అదుపు తప్పడంతో మంటలు చెలరేగాయని, ప్రమాదధాటికి అందులో ఉన్న డియోగోతో పాటు అతని సోదరుడు అగ్నికి ఆహుతి అయినట్లు తెలుస్తోంది. కారు టైర్ పేలడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు వార్తలు వస్తున్నాయి.

ఫోకస్ వ్యవసాయం

# వర్షాభావ పరిస్థితులు.. రైతులకు సూచనలు

## ఎంచుకోవాల్సిన పంటలు...



తక్కువ నీటి అవసరం ఉండే పంటలు (ఆరుతడి పంటలు) రైతులకు అనుకూలం. సజ్జలు, జొన్నలు, రాగులు, కందులు, పెసలు, మినుములు, శనగలు వంటి పంటలను ప్రయత్నించడం మంచిది. అదేవిధంగా గుమ్మడి, దోసకాయ, కాకరకాయ వంటి కూరగాయలు వేసుకోవచ్చు.

ఈ పంటలు తక్కువ వర్షపాతం ఉన్నా కూడా సంతృప్తికరమైన దిగుబడిని ఇస్తాయి. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో కనీసం రెండు నుంచి నాలుగు ఎకరాల్లో ఈ తక్కువ నీటి పంటలు వేసుకోవచ్చు. పంట మార్పిడి వల్ల తెగుళ్లు, పురుగులు కూడా తగ్గుతాయి. విత్తనాలు విత్తే ముందు నేల తేమను పరిశీలించాలి. మిశ్రమ పంటల వినియోగాన్ని పరిశీలించాలి.



ప్రస్తుతం దేశ వ్యాప్తంగా, ప్రత్యేకించి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సందర్భంలో వ్యవసాయ నిపుణుల సూచనలను పాటించడం రైతులకు అవసరం. ప్రత్యామ్నాయ పంటల సాగు వీటిలో ప్రధానమైనది. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా, సజ్జలు, జొన్నలు, రాగులు, కందులు, పెసలు వంటి తక్కువ నీటి అవసరం ఉండే పంటలను ఎంచుకోవాలి. ఒకే పంట కాకుండా, మిశ్రమ పంటలు వేసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. అదే విధంగా నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వా లి. వర్షపు నీటిని పొలాల్లో కాలువలు, చెరువులు, జలాశయాలలో నిల్వ చేసుకోవాలి. భూగర్భ జల రీఛార్జ్ కోసం రేచ్‌పిట్ లు, రేచ్‌వెల్స్ వంటి పద్ధతులను అమలు చేయాలి. ఈ చర్యలతోపాటు పొలం నిర్వహణ కూడా అవసరం. పొలం మీద మల్చింగ్ (పొడి ఆకులు, గడ్డి, పంట మిగులు) వేసి నేలలో తేమను నిల్వ చేసుకోవచ్చు. పొలం దున్నడం, మొక్కల మధ్య దూరం పెంచడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. సాగు కాలం మార్పులను చేపట్టాలి. విత్తే కాలాన్ని వర్షాలకు అనుగుణంగా మార్చుకోవాలి. స్వల్పకాలిక రకాల పంటలు ఎంచుకోవడం మంచిది. ప్రభుత్వ, వ్యవసాయ శాఖల సూచనలు పాటించాలి. స్థానిక వ్యవసాయ అధికారుల ప్రకటనలు, మార్గదర్శకాలను తెలుసుకోవాలి. పంటల బీమా, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ సహాయాలను వినియోగించుకోవాలి. తెగుళ్ల, పురుగుల నివారణపై దృష్టి కేంద్రీకరించాలి. వాతావరణానికి అనుగుణంగా తెగుళ్ల, పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలి. పశుపోషణ, కూరగాయలు, పూలు వంటి ఇతర ఉపాధి మార్గాలను కూడా పరిశీలించాలి. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాన్ని తగ్గించడానికి పంట వైవిధ్యం, నీటి సంరక్షణ, ప్రభుత్వ సహాయాలు, మరియు శాస్త్రీయ సూచనలు పాటించడం అత్యంత అవసరం.

### తేమ నిల్వ నిర్వహణ..



రైతులు వర్షాభావ పరిస్థితుల్లో నేల తేమ నిల్వను నిర్వహించే విధానాలను, మార్గాలను తెలుసుకోవాలి. ఆచరణలో పెట్టాలి. వీటిలో మల్చింగ్ (ఆచ్ఛాదన) అనేది పంట వ్యర్థాలు, పొడి ఆకులు, గడ్డి వంటి వాటిని నేలపై పరచడం ద్వారా నేలలో తేమను ఎక్కువ కాలం నిల్వ చేయొచ్చు. ఇది కలుపు నివారణకూ సహాయపడుతుంది. పొలాల చుట్టూ గట్టులు వేసి, వర్షపు నీరు పారిపోకుండా నిల్వ చేయాలి. ఇది నేల తేమను పెంచుతుంది. పొలం దున్నడాన్ని తగ్గించడం ద్వారా నేల తేమ ఆవిరైపోకుండా ఉంటుంది. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా తేమను ఎక్కువ రోజులు నిలుపుకోవచ్చు. చెరువులు, రేచ్‌పిట్‌లు, చిన్న జలాశయాలు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి. కలుపు మొక్కలను తొలగించడం వల్ల నేల తేమను పంటలే ఎక్కువగా వినియోగించుకుంటాయి. ఈ పద్ధతులు వర్షాభావ పరిస్థితుల్లో నేల తేమను నిల్వ చేసి, పంటలకు అవసరమైన తేమ అందుబాటులో ఉండేలా చేస్తాయి.

### విత్తన శుద్ధిపై దృష్టి పెట్టండి

వ్యవసాయ పనులు ప్రారంభమైన వెంటనే, విత్తన శుద్ధిపై రైతులు దృష్టి కేంద్రీకరించాలి. ఈ విధంగా శుద్ధి చేయడం ద్వారా విత్తనాలపై ఉండే కీటకాలు, శిలీంద్రాలు, తెగుళ్లను నివారించి పంటకు రక్షణ కల్పించవచ్చు. విత్తన శుద్ధి పద్ధతులు ప్రధానంగా మూడు విధాలుగా ఉంటాయి....

**పొడి విత్తన శుద్ధి:** విత్తనాలకు క్రిమిసంహారక మందులను పొడి రూపంలో కలిపి బాగా కలపడం. ఉదాహరణకు, వరి విత్తనాలకు 1 కిలో విత్తనానికి 23 గ్రాముల కార్బండిజమ్ పొడి కలిపి 24 గంటల తర్వాత విత్తనాన్ని చల్లుకోవాలి.

**తడి విత్తన శుద్ధి:** సిఫారసు చేసిన మందులను నీటిలో కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 12 నుంచి 24 గంటలు నానబెట్టి, ఆ తర్వాత మడిలో చల్లించి విత్తకం చేయడం.

**పైపూత లేదా కోటింగ్ పద్ధతి:** విత్తనంపై తడి లేదా పొడి పదార్థాలతో మందును పూతగా వేయడం, ఇది విత్తనానికి మందు బాగా అంటుకునేందుకు సహాయపడుతుంది. ఆధునిక పద్ధతుల్లో ప్రత్యేక జిగురు పదార్థాలతో కోటింగ్ చేస్తారు.

అధునాతనంగా, విత్తన చుట్టూ గుళిక (పెల్లెటింగ్) చేయడం ద్వారా విత్తనపు ఆకారాన్ని మార్చి విత్తడం సులభతరం చేస్తారు, కానీ ఇది ఖరీదైన పద్ధతి.

విత్తన శుద్ధి కోసం ఉపయోగించే మందులు, రసాయనాలు మానవులు, పశువులకు హానికరమైనవిగా ఉండవచ్చు కాబట్టి జాగ్రత్తగా, సూచించిన మోతాదులో మాత్రమే వాడాలి. శుద్ధి చేసిన విత్తనాలను తినకూడదు. విత్తనాల్లో తేమ 8 నుంచి 10 శాతం వరకు ఉండేలా చూసి శుద్ధి చేయాలి.

సారాంశంగా, విత్తన శుద్ధి ప్రక్రియలో విత్తనాలను క్రిమిసంహారక మందులతో పొడి లేదా తడి రూపంలో కలిపి, లేదా పైపూత వేసి, విత్తనాలను రోగాల నుంచి రక్షించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ పంట దిగుబడిని పెంచడంలో, వ్యాధుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది.

# 9న సార్వత్రిక సమ్మెకు విస్తృత సన్నాహాలు

ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :కేంద్రప్రభుత్వ కార్మిక విధానాలను నిరసిస్తూ ఈనెల తొమ్మిదిన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ వందేళ్లు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌ల అమలు చేయాలని చూస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈనెల తొమ్మిదిన జరిగే సార్వత్రిక సమ్మెకు ఖమ్మం జిల్లా కార్మికులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ, కార్యనిర్వహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, పేర బోయిన మోహన్‌రావు, ఎఐకెఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి కొండపర్తి గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపూడి రవి, జిల్లా ఉపాధ్యక్షులు మిడికంటి వెంకటరెడ్డి, బాగం ప్రసాద్, కొల్లి రవికుమార్, వేముల రవికుమార్, మహిళా సమాఖ్య నాయకురాలు పోటు కళావతి తో పాటు అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పెద్దపల్లి..

**హనుమకొండ :** హనుమకొండ బాలసముద్రం లోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జూలై 9న దేశవ్యాప్తంగా జరుగనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యాక్రమంలో జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజుగౌడ్, నాయకులు బత్తిని సదానందం, కొట్టెపాక రవి, ఓదేలు, దామేర సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె ఓసిపి 5 లో కార్మిక సంఘాల జెఎసి నాయకులు కొరిమి రాజ్ కుమార్, సదానందం, మెండె శ్రీనివాస్, వడ్డెపెల్లి శంకర్,కట్ట విశ్వనాథం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం మాదన మహేష్, బోగ సతీష్ బాబు, గుర్రం ప్రభుదాస్, గండి ప్రసాద్, చంద తిరుపతి, పర్లపెల్లి రామస్వామి, గంద్ర దామోదర్‌రావు, ఆంజనేయులు, బేబి శ్రీను, జనగామ శ్రీను, గౌస్, వెంకట్‌రెడ్డి, జావిద్‌పాషా, పొలాడి శ్రీనివాస్, గోపి, డి.లచ్చన్న, ఎం.డి.ఖాసీం, కె.కుమార్ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి, సిఐటియు జిల్లా కార్మిక వర్గానికి పిలుపునిచ్చాయి. కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్‌లోని సిపిఎం కార్యాలయంలో జాయింట్ యాక్షన్ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సిఐటియూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఎం. సత్తయ్య, సిఐటియూ నాయకులు తోట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల :** 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను అమలు చేయడం కార్పొరేట్ అధిపతులకు అనుకూలమని వామపక్ష పార్టీలు విమర్శించాయి. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రం లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన వామపక్ష పార్టీల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి సంకే రవి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎ. లాల్ కుమార్, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి దేవరాజు మాట్లాడారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని నిరసన తెలపాలని వారు పిలుపునిచ్చారు.



ఖమ్మం..

**నిజామాబాద్ అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తు దేశవ్యాప్తంగా జూలై 9న జాతీయ కార్మిక సంఘాల సమ్మెకు వామపక్షాల పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్‌బాబు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తు నాలుగు కోడ్‌లను తెచ్చి మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు వంత పాడుతున్నదన్నారు.



హన్మకొండ..



మంచిర్యాల



ఆసిఫాబాద్..




నిజామాబాద్..

## తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ను రాష్ట్రప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు. పాల్వంచలోని చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో గురువారం ఎఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. మహాసభలో ఎఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. పూర్తి స్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై, విద్యా, ఉపాధి హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేయాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. దేశంలో పుట్టిన ప్రతీ బిడ్డకు సమాన విద్యను అందించాలని, డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థికి భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఇఒ, ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రభుత్వవిద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అజిత్, హరీశ్. షాహిద్ , రణధీర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో మాజీ జిల్లాసహాయ కార్యదర్శి ఎస్‌కె.చాంద్‌పాషా, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.పహీందాదా, అధ్యక్షులు జర్పుల ఉపేందర్, గుండాల సుజన, పవన్‌సాయి, నాగేంద్రబాబు, బతుల సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.




## ఒరిస్సాకు సింగరేణి కార్మికులను పంపొద్దు

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ వినతి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ఒరిస్సాలోని నైని బ్లాక్‌కు సింగరేణి కార్మికులను, ఉద్యోగులను బలవంతంగా పంపొద్దని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. గురువారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఒరిస్సాలోని నైని బ్లాక్ కోసం క్లర్క్‌లను, సెక్యూరిటీ గార్డులను, ఇతర వృత్తులలో పనిచేస్తున్న కార్మికులను సర్క్యులర్ జారీ చేస్తూ బలవంతంగా పంపుతుందని, ఇది సరైన విధానం కాదని, దీనిని గుర్తింపు సంఘం ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఒరిస్సాలోని నైని బ్లాక్‌కు పంపడం వల్ల కార్మికులు బాషాపరంగా, కుటుంబాన్ని షిఫ్ట్ చేయడం తదితర ఇబ్బందులకు గురవుతారన్నారు. యాజమాన్యంకు అవసరం ఉంటే కార్మికులు వెళ్ళేందుకు ఇష్టపడితే సర్క్యులర్ జారీ చేసి వారిని పంపాలని ఆయన సూచించారు. లేకుంటే ఒరిస్సా రాష్ట్రంలో నోటిఫికేషన్ ద్వారా అక్కడి వారిని తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా క్లరికల్ విభాగంలో ఖాళీగా ఉన్న 365 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని వెంటనే మెరిట్ ఆధారంగా వాటిని భర్తీ చేయాలని ఆయన కోరారు. యాక్టింగ్ క్లర్క్‌లు కూడా రెగ్యులరైజ్ చేయాలని, వారు కోర్టు కు వెళ్ళారని, దానిని యాజమాన్యం కోర్టు కేసు ను వెకెట్ చేయించి వారిని ఖాళీల ఆధారంగా నిబంధనల ప్రకారం తీసుకోవాలని ఆయన కోరా రు. కార్మికులను కొన్ని సంఘాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని, వాటిని పట్టించుకోవద్దని కోరారు. ఎఐటియుసి ఏదైతే కార్మికులకు చెప్పిందే, అదే చేస్తుందన్నారు. గుర్తింపు ఎన్నికల్లో ఎఐటియుసి గెలిచిన తరువాత ఎలాంటి అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని యాజమాన్యంకు సూచించడం జరిందన్నారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, కార్మిక నాయకులు సయ్యద్ సోహేల్, బండి మల్లేష్, ఎంఎ.గౌస్, కొరిమి శ్రావణ్‌కుమార్, ఎ.రవికుమార్, పెద్దెల్లి శంకర్, దాసరి రామస్వామి, కల్వల జగన్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## చేనేత కార్మికులకు రుణమాఫీపై కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ శాయంపేట :** చేనేత కార్మికుల కష్టాలను గుర్తించి చేనేత కార్మికులకు అందజేసిన రూ.33 కోట్ల రుణాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేసిందని తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ బోర్డు మెంబర్ బాసాని చంద్రప్రకాష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు,రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, బిసి సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్‌కి, స్థానిక భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులకు బాసాని చంద్రప్రకాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు అండగా కొత్త రుణాలను మంజూరు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

## సోక్ పిట్‌లను ప్రతి ఒక్కరూ నిర్మించాలి : కలెక్టర్ జ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** సోక్ పిట్‌లను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిర్మాణం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలో పర్యటించి మ్యాజిక్ సోక్‌పిట్ నిర్మాణాలను, ఫెర్టిలైజర్ షాపులను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోక్ పిట్‌లు ప్రతి ఒక్కరు నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోక్ పిట్స్ నిర్మాణం తో చుక్క వర్షం నీరు వృధాగా పోయే అవకాశం ఉండదన్నారు. దీనితో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు విక్రయించేటప్పుడు తప్పక పేరు, గ్రామం పేరు,సెల్ నెంబర్ నమోదు చేయాలన్నారు. బండ్లగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చులకు అడిగి తెలుసుకున్నారు. ఏ సామాగ్రికి ఎంత ఖర్చు అయ్యిందంటు లబ్ధిదారులను అడిగారు. కలెక్టర్ వెంట తహాశీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** రాష్ట్రంలోని ప్రతి పేదల కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హామీలో కాలయాపన చేస్తూ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. గురువారం జనగామ నియోజకవర్గంలోని 816మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జనగామ పట్టణంలోని సాయిరామ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆర్డీఓ గోపిరాం అధ్యక్షత వహించగా ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో నిరుపేదల కళ సకారం అవుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇళ్లు అందుతుందని, ఎన్నడు లేని విధంగా ప్రతి నియోజకవర్గంలో మూడు వేల 500 ఇళ్లు నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, త్వరలోనే కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500లకే గ్యాస్ కనెక్షన్, రుణమాఫీ, పేదలకు సన్న బియ్యం పంపిణీ, సకాలంలో రైతు బరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇలా అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పిఏసిఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, హౌసింగ్ పిడి మాతృనాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌టిఐ సభ్యులు అభిగౌడ్ పాల్గొన్నారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని పిఎంకు ఎంపి చామల పోస్ట్‌కార్డ్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** కరెన్సీపై అంబేద్కర్ పోటో ముద్రించాలని కోరుతూ భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పోస్ట్‌కార్డు వేశారు. కరెన్సీపై అంబేద్కర్ పోటో సాదన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో గురువారం ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డిని కలిశారు. పరశురామ్‌లు ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ పోస్టుకార్డ్ వేశారు. ఈ సందర్భంగా ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబ సాహెబ్ అంబేద్కర్ పోటోను కరెన్సీపై ముద్రించాలని కోరారు. ప్రధానమంత్రి చొరవ తీసుకొని పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మేడ శ్రీనివాస్, పులి శేఖర్, తిప్పారపు ప్రసాద్, కె నాగరాజు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి :కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. లబ్ధిదారులు జంగా రాణీ, నాలుక రా మ్మూర్తి , తరగంప కరుణ లత ఇండ్ల నిర్మాణ పనులను పశీలించారు. కలెక్టర్ రాహుల్ శర్మ లబ్ధిదారులతో ఇంటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఎంతవరకు పూర్తి చేసారు ఏమైనా సాంకేతిక, సామాగ్రి సంబంధిత సమస్యలు ఉన్నాయా, ఇసుక ఎక్కడి నుండి తీసుకుంటున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి పారిశుద్య కార్యక్రమాలను పరిశీలించారు. వర్షాల వల్ల మురుగు నీటి నిల్వలు లేకుం డా ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశు భ్రం చేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పీడిలోకి లాల్, ఎంపిడిఓ నాగ రాజు,గృహ నిర్మాణ శాఖ ఒఇ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

## బిసి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సంకల్పం గట్టిగా ఉంటే ఎంతటి పనైనా సాధించవచ్చని, అందుకు బిసి కమ్యూనిటీ హాల్ ఒక నిదర్శనమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. బీమారం 55వ డివిజన్‌లో ఎంపి నిధుల నుండి 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న బిసి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్ట్ నాయకపు సుభాష్ జ్ఞాపకార్థంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకుని త్వరలో ప్రారంభించుకోబోతుంన్నామని తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ కోసం సుభాష్ ఎంతగానో కృషి చేశాడని వారి సంకల్పం వల్లే ఈ రోజు సాధ్యం అ య్యిందన్నారు. సుభాష్ ఇప్పుడు మన మధ్యలో లేక పోవడం బాధాకరమని అన్నారు. మరో రెండు నెలల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సుభాష్ కుటుంబ సభ్యులు వారి వ్యక్తిగతంగా సహాయం కొరకుండా అందరికి ఉపయోగపడే లాగా వారి జ్ఞాపకార్థంగా కమ్యూనిటీ హాల్ ఉండాలని కోరుకోవడం గొప్ప విషయం అన్నారు. సుభాష్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని భగవంతున్ని ప్రార్థించారు. ఇటీవల పలువురు జర్నలిస్ట్‌ల ఆకాల మరణలు తనను ఎంతో బాధించాయని ఎంపి అన్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుం డా పని చేస్తు న్న జర్నలిస్టు సోదరులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం చేయడంలో ప్రభుత్వం విఫలం

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** తెలంగాణలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టం చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్లా శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకుడు శివ కుమార్ అధ్యక్షతన జరిగిన ఖిల్లా వరంగల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య పేద వారికి అందని ద్రాక్షగా మారిందని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను అంగడి సరుకుగా మార్చాయని విమర్శించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, బుక్స్ ఫీ జులంటూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలో శ్రీచైతన్య, నారాయణ ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలకి వి ద్యాశాఖ అధికారులు వత్తాసు పలకడం ద్వారా వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, కనీసం వాటిని నియంత్రించే చర్యలు కూడా తీసుకోవడం లేదన్నారు. విద్యా సంస్థల్లో ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు చేపట్టవద్దంటూ అనేక జిఒలు ఉన్నా వాటిని తుంగలోతొక్కి వారి సొంత చట్టాలను అమలు చేసుకుంటూ, విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, వారి రక్తాన్ని జలగల్లా పట్టి పీడిస్తు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా పేదవాడు విద్యను కొనుక్కునే స్థానంలో ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాకేష్, ప్రశాంత్ ,సోను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దర్ముల రామ్మూర్తి



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జూలై 9న జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొంటారని ఎల్కతుర్తి మండల ఎంఈఓ కు తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధర్ముల రామ్మూర్తి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుకోడులుగా విభజించి పెట్టుబడిదారి వర్గానికి అనుకూలంగా మార్చుటకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్ర చేసిందని అన్నారు. దీనివలన కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని, మళ్లీ 12 గంటల పని దినాలు పెంచి పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా ఈ చట్టాలను మారుస్తున్నదని, దీనికి వ్యతిరేకంగానే పాత చట్టాలనే కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా అమలు చేయలేని ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా చట్టాలను మారుస్తూ, కార్మికులపై పెనుబారం మోపే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మికులు 9 జూలై న వంటలు బందు చేసి హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, అర్థం కవిత, మౌటం కళ్యాణి పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల మండలంలోని మలక్ పేట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సందర్శించారు. ఇటీవల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శ్రీవాణి అనే పదవ తరగతి చదువుతున్న బాలిక పాఠశాల ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గురువారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముందుగా ఏకు శ్రీవాణి కుటుంబాన్ని సందర్శించి ఆమె తల్లిదండ్రులకు సానుభూతి ప్రకటించారు. ప్రభుత్వపరంగా కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. మలక్ పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. శ్రీవాణి మరణానికి సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలును వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సిబ్బందిని శ్రీవాణి మృతికి గల కారణాలు ఏమై ఉంటాయని విడివిడిగా విచారించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చురుకుగా ఉండేదని, ఆమె ఆత్మహత్య చేసుకునే అంత పిరికితనం లేదని అన్నారు. ఏది ఏమైనా శ్రీ వాణి మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. శ్రీవాణి మృతి చెందిన అప్పటినుండి ఆమె మృతికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశానన్నారు. పోలీసులు, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు వివరాలు సేకరించుకొని పరిష్కార మార్గాలను తెలుసుకున్నానన్నారు. ఎమ్మెల్యే వెంట పరకాల ఆర్డిఓ నారాయణ, ఎ సిపి సతీష్ బాబు, స్థానిక తహసిల్దార్ విజయలక్ష్మి ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 5న సిపిఐ జిల్లా మహాసభలు

మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో 5,6తేదీల్లో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. 5న జరిగే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని ఆయన తెలిపారు. 5న 5వేల మందితో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా జిల్లా నలుమూలల నుంచి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. 6న ప్రతినిథుల స భకు 500మంది డెలిగేట్స్ ఎంపిక చేసి నిర్వహిస్తున్నట్లు విజయసారథి తెలిపా రు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నిక లు, మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందడానికి తగిన కార్యచరణ రూపొందించి ముందుకుపోతామనిఈమహాసభలను జయప్రదంచేయాలనిఆయన కోరారు.

## సిపిఐ మానుకోట పట్టణ కార్యదర్శిగా పెరుగు కుమార్

సహాయ కార్యదర్శులుగా రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** సిపిఐ మహబూబాబాద్ పట్టణ మహాసభ పేరాల కట్టయ్య పంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణ సిపిఐ కార్యదర్శిగా పెరుగు కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మానుకోట పట్టణం కొండపల్లి గోపాలరావు నగర్ కాలనీకి చెందిన పెరుగు కుమార్ 1998 నుండి ఎఐఎస్ఎఫ్‌లో క్రియాశీలకంగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమంలోకూ క్రియాశీలకంగా పనిచేశారు. సిపిఐ మండల స హాయ కార్యదర్శిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పలు దఫాలు పనిచేశారు. 3న జరిగిన పట్టణ 14వ మహాసభలో మరోసారి సిపిఐ పట్టణ కార్యదర్శిగా పెరుగు కుమార్‌ను ఎన్నుకోవడం జరిగింది. తన ఎన్నికకు కృషి చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డికి పెరుగు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతన సహాయ కార్యదర్శులుగా రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే నూతన కౌన్సిల్ సభ్యులుగా 95మందిని ఎన్నుకున్నారు. 31మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే 8మంది పట్టణ కార్యదర్శిగ్ర సభ్యులుగా ఎన్నుకున్నారు. పెరుగు కుమార్, రేషపల్లి నవీన్,చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా,నర్రా శ్రావన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## నేడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి

హాజరుకానున్న నారాయణ, తక్కెళ్లపల్లి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండిలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన వా రిలో దొడ్డి కొమురయ్య ఒకరన్నారు. నూనుగు మీసాల వయస్సులోనే రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ విస్నూర్ దేశ్‌ముఖ్ గుండాల ఆగడాలపై ర్యాలీ నిర్వయిస్తునన తరుణంలో నైజాం మూఖలు జరిగిపి కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరుడయ్యాడన్నారు. ఆయన మరణంతో తెలంగాణలో ఉద్యమమం ఉవ్వెత్తున లేవడంతో పాటు 4వేల మంది అమరుల త్యాగాలతో 10లక్షల ఎకరాల భూములు పంపిణీ చేయబడిందన్నారు. నిజం దాచేస్తే దాగదుఅబద్ధం వాస్తవం ముందు నిలవదు అన్న ట్లు చరిత్రను ప్రజలకు తెలియజేయడం కోసం సిపిఐ జిల్లా సమితీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని నిర్వహించనున ్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నందున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు.

## నేతన్నల రుణాలన్నింటినీ మాఫీ చేయాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల రుణాలను అన్నింటిని మాఫీ చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల పోరాటాలతో పాటు ప్రతినిధులు ముఖ్యమంత్రికి, చేనేత శాఖామంత్రికి సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని ఫలితంగా కొన్ని చర్య లైనా చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవల ప్రభుత్వం నేతన్నలకు లక్ష రూపాయల వరకు రుణమాఫీపై జీవో విడుదల చేసిందని కానీ దాన్ని సవరించి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతన్నలకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం నేతన్నలపై వివక్షత చూపడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందులలో ఉండి కార్మికులకు పనులు కలిగించలేకపోతున్నాయని, ఫలితంగా కార్మికులు ఉపాధి లేక అనేక ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘాల రుణాలన్నింటిని మాఫీ చేసి, తిరిగి వడ్డీ లేని రుణాలు అందించాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని కోరారు.

## పాఠశాలలను విద్యాశాఖ ఆర్‌జెడి డైరెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** వెంకటాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, టీచర్ల డైరీలు, మధ్యాహ్న భోజన రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్, బియ్యం స్టాక్ రిజిస్టర్, పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని రికార్డులతో పాటుగా లైబ్రరీ రూమ్, ఐఎఫ్‌పి ప్యానల్ వివరాలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ప్రాజెక్టు వివరాలు, డార్మెంటరీ, కిచెన్ రూమ్స్‌లను సందర్శించి మధ్యాహ్న బోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలకు సంబంధించి నిర్వహించిన లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, ఫౌండేషన్ అండ్ లిట్రసి అండ్ న్యూమరస్సికి సంబంధించిన మూల్యాంకం పేపర్లను తక్షణమే ఆన్‌లైన్ చేయాలని, మండల విద్యావనరుల కేంద్రం నుండి తీసుకున్న పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో ఆయన వెంట ములుగు జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి రాధిక, సీనియర్ ఉపాధ్యాయులు జనగాం బాబూరావు, ప్రాథమిక పాఠశాల ఇన్‌ఛార్జ్ ఉపాధ్యాయులు చిన్న శేఖరరావు, టి రాజయ్య, ఫిజికల్ డైరెక్టర్ బి వేణు, సిఆర్‌పి కుమార్ పాల్గొన్నారు.

# విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే సమర్థ విపత్తు నిర్వహణ

ఎన్‌డిఎంఎ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే సమర్థ విపత్తు నిర్వహణ సాధ్యమని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డిఎంఎ) సీనియర్ అధికారుల బృందం ఎన్‌డిఎంఎ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్, అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, సీనియర్ కన్సల్టెంట్లు వసీం ఇక్బాల్, డాక్టర్ గౌతమ్ కృష్ణా, సంద్రా, అనుపమలు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక నవీకరణ, డిజాస్టర్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ కార్యకలాపాలు, విపత్తు ముప్పు తగ్గింపుతో పాటు భవిష్యత్తు విపత్తులను ఎదుర్కొనే వ్యవస్థ పటిష్టత తదితర అంశాలపై సమీక్షించి, సమన్వయ శాఖల అధికారులతో చర్చించారు. మాక్ డ్రిల్స్ నిర్వహణ సామర్థ్య నిర్మాణంపై అధికారులకు శిక్షణ, సమన్వయం వంటి అంశాల్లో జిల్లాలో చర్యలపై కూడా చర్చించారు. వరదల సమయంలో బాధితులకు చేయూతనివ్వడం, పునర్మిర్మాణ చర్యల్లో అధికార యంత్రాంగం చూపిన చొరవను కూడా బృందం సభ్యులు ప్రశంసించారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సరైన సన్నద్ధత విషయంలో ప్రతి శాఖా తమదైన ప్రత్యేక విపత్తు నిర్వహణ ప్రణాళికలను రూపొందించడం కీలకమని చెప్పారు. చట్ట ప్రకారం కొత్తగా పట్టణ విపత్తు నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రియల్ టైమ్ హెచ్చరికల వ్యవస్థలో సచేత్ కీలక మైలురాయి అని, ఈ యాప్ పై అధికారులతో పాటు ప్రజలకు ముఖ్యంగా గ్రామస్తులలో అవగాహన కల్పించాలని సూచించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ వంటి సాంకేతికతలను పొందుపరచడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఆపద మిత్ర, ఇతర వాలంటీర్ సేవలకు ముఖ్యంగా యువతను ప్రోత్సహించాలని ఎన్డీఎంఎ అధికారుల బృంద సభ్యులు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో విపత్తు నిర్వహణ ప్రణాళికలతో పాటు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి, జాతీయ విపత్తు తగ్గించే నిధిని కూడా అందిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు,జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించడం జరిగింద ని, విపత్తుల సమయంలో చేపట్టే చర్య లు, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలపై వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందు జా గ్రత్త చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరం వరదల వల్ల ఆకేరు వాగు నీటి వరద వల్ల 40 మంది ప్రయాణికులతో ఉన్న బస్సు నీటిలో దిగ్బంధం కాగా స్థానికుల సహకారంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా బయటికి రావడం జరిగిందన్నారు. గోదావరి, కృష్ణ నదుల మధ్యలో వరంగల్ జిల్లా ఎత్తైన ప్రదేశంలో ఉన్నందున వరద ముప్పులేదని, అధిక వర్షాలు కురవడం వల్ల వరద సంభవించే అవకాశం ఉందని, అందుకు నగరంలోని ప్రధాన నాలాలను డీసిల్టేషన్ చేయడం జరిగిందన్నారు. గతంలో రాజులు నిర్మించిన గొలుసు చెట్టు చెరువులలో వర్షపు నీరు చేరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నగరం ముంపు గురి కాకుండా స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని తొలగించడం జరుగుతున్నదన్నారు. ఈ సమావేశంలో జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్‌పా యి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్‌పి సిఇఒ రామిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సివిల్ సప్లయ్ అధికారులకు సమ్మె నోటీస్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సివిల్ సప్లయ్ అధికారులకు ఎఐటియుసి నాయకులు కంచర్ల జమలయ్య, గిద్దాడ నగేష్‌లు గురువారం సమ్మె నటీస్ అందజేసారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలోని సివిల్ సప్లై గోదాము ఇన్‌చార్జికి ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా సమ్మె నోటీస్‌ను అందించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా గోదాము హమాలీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా హమాలీ కార్మికులు గోదాముల్లో పనిచేస్తున్నప్పటికీ ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ఊసు లేకుండా కాలం గడుపుతూనే వస్తుందన్నారు. కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయకపోగా ప్రతీ నిత్యం గోదాముకు వచ్చే లారీల్లో ఎగుమతి, దిగుమతి చేస్తున్న క్వింటాళ్లకు తగిన రేటు పెంచకపోవడం మోడి పాలన మొండి వైఖరికి నిదర్శనమన్నారు. 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని హక్కులను సాధించుకోవాలన్నారు. 60 సం.దాటిన కార్మికులకు ప్రభుత్వం ఎటువంటి పించన్ సదుపాయాన్ని సైతం మంజూరీ చేయకపోవడం బాధాకరమన్నారు. హమాలీ సంఘం నాయకులు వెలిశాల రమణయ్య, అల్లి ముత్తయ్య, తూరసాటి సారయ్య, రాయల వెంకటేశ్వర్లు, జనార్ధన్, కొమరయ్య, దామోదర్, హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మహిళా ఆరోగ్యవికాస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు

**ప్రజాపక్షం/భద్రాచలం :** మహిళా ఆరోగ్యవికాస్ అందిస్తున్న సేవలను మహిళంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక జీయర్ మఠంలో వికాసతరంగిణి, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఇచిత గర్భకోశ వ్యాధుల పరీక్ష శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఆరోగ్య వికాస్ అందిస్తున్న సేవలు నియోజకవర్గ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన మహిళలు తప్పనిసరిగా గర్భకోశ పరీక్షలు చేయించుకోవాలని, ఎలాంటి దోషాలు ఉన్నా వెంటనే మందులు వాడటం మొదలుపెట్టి తగ్గించుకోవాలని సూచించారు. నేటి రోజుల్లో ఆరోగ్యాలను కాపాడుకోవడం ఎంతో అవసరమని, ఇందుకోసం ప్రతీ ఒక్క మహిళా వ్యక్తిగత ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరం వద్ద ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వికాసతరంగిణి, లయన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని
సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఈనెల 9న జరుగనున్న దేశవ్యాప్త ఒక్క రోజు సమ్మెలో సింగరేణి అన్నివిభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం కార్పోరేట్ ప్రధాన కార్యాలయ బంగ్లాస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు గేట్ మీటింగులను జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు, ఎఐటియుసి కృష్ణయ్య, క్రిష్టాఫర్, పితాంబరం, ఆల్బర్ట్, భూక్యా రమేష్, సతీష్‌లు పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం నాలగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. పోరాడే హక్కును, సమ్మె చేసే హక్కును, వేతనాల కోసం బేరసారాలు ఆడే హక్కులను లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగాన్ని పూర్తిగా ప్రైవేటు పెట్టుబడి దారులకు దోచిపెట్టడానికే సింగరేణి బొగ్గుబావులను కూడా బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పే ప్రయత్నం కేంద్రం చేస్తుందన్నారు. పనిగంటలను పెంచి శ్రమదోపిడీకి పాల్పడేయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ప్రభుత్వరంగాన్ని రక్షించుకోవడానికి 9న తేదిన జరుగుతున్న సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎస్.రాము, టి.నాగయ్య, చంద్రశేఖర్, ఐఎన్‌టియూసి నాయకులు సైమన్, శ్రీను, టిబిజికేఎస్ ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## పత్తి సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పత్తి సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పత్తిలో గులాబీ రంగు పురుగు సమగ్ర సస్యరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ప్రోటక్షన్ ఆఫీసర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ పత్తి సాగుకు సంబంధించి ఎకరానికి ఐదు లింగాకర్షక బుట్టలు పెట్టుకోని గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించాలన్నారు. గులాబీ రంగు పురుగును గుర్తించిన యేడల ముందుగా వేపనూనెతో పిచికారి చేయాలని తర్వాత కూడా ఉధృతి ఎక్కువగా ఉంటే రసాయన మందులు వాడాలని తెలిపారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ మిత్ర పురుగులు, ట్రైకోకార్డ్ పరాన్న జీవుల ఉపయోగాల గురించి, ఎన్‌పిఎస్‌ఎస్ మొబైల్ యాప్ ఉపయోగం గురించి వివరించారు. రసాయన పురుగు మందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అసిస్టెంట్ ప్లాంట్ ప్రోటెక్షన్ అధికారి బసవనప్ప, విత్తన శుద్ధి ఉపయోగాల గురించి హోన్నప్ప వివరించారు. ఏఈవో వేదిత పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విపత్కర సమయాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విపత్కర సమయాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. డిడిఆర్‌ఎఫ్, అగ్నిమాపకశాఖ, 6వ బెటాలియన్, టిజిఎస్‌పి అధికారులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమాదవశాత్తు వరదల్లో చిక్కుకున్న బాధితులను రక్షించేందుకు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 డిడిఆర్‌ఎఫ్ బృంధాలు నిత్యం అందుబాటులో ఉండేందుకు వీలుగా అన్ని శాఖలతో సమన్వయం పాటిస్తూ ముందుకెళ్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. ప్రధానంగా గోదావరి వరదముంపు సంభవించినప్పుడు నదీ పరివాహక ప్రాంతాల్లో నివసింటే లోతట్టు ప్రాంత ప్రజలను సంరక్షించేందుకు ఈ బృందాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. రెస్క్యూ సమయంలో అవసరమయ్యే లైఫ్ జాకెట్లు, లైఫ్‌బాయ్ రింగ్స్, బోట్ పెడల్లు, రోప్స్‌లు, ఇంతర సామాగ్రిని ఈ బృంధాలకు సమకూర్చినట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేంధర్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి క్రాంతికుమార్, 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, అపరేషన్స్ ఆర్‌ఐ రవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వరద ఉధృతి అంచనాలను అందించాలి

ప్రమాద హెచ్చరికల ఎస్‌ఒపి సిద్ధం
నీటి వనరుల రిపోర్టింగ్ షెడ్యూల్ తయారు చేయాలి
విపత్తుల సన్నద్ధతపై కలెక్టర్ సమావేశం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వరద ఉధృతి అంచనాలను సమర్థవంతంగా అందించాలని ఆ దిశగా పటిష్ట వ్యవస్థను జిల్లాలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి విపత్తుల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల గురించి మనకు ఎంత త్వరగా తెలిస్తే అంత త్వరగా ప్రజల సంరక్షణకు చర్యలు తీసుకోవచ్చునన్నారు. వరద అంచనా వ్యవస్థ కట్టుదిట్టంగా పని చేయాలని, నీటి వనరుల్లో నీటి నిల్వలు, పైన ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షాలు, వస్తున్న వరదల వివరాలను నీటిపారుదల శాఖాధికారులు రెగ్యులర్‌గా మానిటర్ చేయాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతికి సంబంధించి పకడ్బందీ వ్యవస్థ ఉందని భద్రాచలం వద్ద వరద వివరాలు ప్రతి గంటకు తెలుస్తాయని ఆ దిశగా ఖమ్మంజిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని, వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా అంచనా వేయాలన్నారు. తీర్థాల, మున్నేరు, ఆకేరు తదితర వాటి వద్ద నీటి ప్రవాహం, నీటి నిల్వ ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. జిల్లాలో అవసరమైనచోట వాటర్ గేజ్ ఏర్పాటు చేయాలన్నారు. గత వరదలను దృష్టిలో ఉంచుకుని మన జిల్లాకు వరద ఎంత వస్తుంది అనే సమాచారం ముందుగానే అందేలా చూడాలని, దీనికి సంబంధించి బాధ్యతలను నీటిపారుదల శాఖకు అప్పగిస్తూ మెమో జారీ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులతో వాట్సప్ గ్రూప్ తయారు చేయాలన్నారు. నీటివనరుల పరిస్థితులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రాబోయే మూడు నెలల పాటు రిపోర్టింగ్ షెడ్యూల్ సిద్ధం చేసి సోమవారం నాటికి అందించాలన్నారు. విపత్తు సమయంలో ప్రజలకు కమ్యూనికేషన్ చాలా వేగంగా జరగాలన్నారు. మున్నేరు నది ఖమ్మం నగరానికి మొదటి, రెండవ, మూడవ ప్రమాద హెచ్చరికలు ఎప్పుడు జారీ చేయాలి, ఏహెచ్చరిక సమయంలో ఏ ప్రాంతాలు ముంపునకు గురవుతాయి, ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఎస్‌ఒపి సిద్ధం చేయాలన్నారు. ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వరద విపత్తు నిర్వహణ బాధ్యత అధికంగా రెవెన్యూ వ్యవస్థపై ఉంటుందని అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న నీటి వనరులను పరిశీలించి తెగిపోకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఇ ఎం.వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్, జిల్లా ఇరిగేషన్ అధికారి వెంకట్రామ్, ఆర్డీవో జి.నర్సింహారావు, ఇరిగేషన్ డిఇలు, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్‌లు సైదులు, రాంప్రసాద్ పాల్గొన్నారు.



## విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వాతావరణలో మార్పులు సంభవిస్తున్న నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఐడిఓసిలో జిల్లాలోని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మాసిస్టులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని, టెస్టింగ్ కిట్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. వివిధ హోదాల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని, ఇప్పటికే అన్ని ఆస్పత్రులకు కావాల్సిన మందులు రీఏజెంట్లు, మౌలిక వసతులు, ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసిన క్రమంలో రాబోయే రోజుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. ఆస్పత్రుల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. జిల్లా డిసిహెచ్ఎస్ డా.రవిబాబు, వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, ఫార్మసిస్టులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, శానిటేషన్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం

జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కొత్తూగూడెంలోని రైటర్ బస్తీని భవిత కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడి సౌకర్యాలు, అందుబాటులో ఉన్న పద్ధతులు, నిర్వహణతీరు, విద్యార్థుల హాజరును ఆయన పరిశీలించారు. అనంతరం కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉజ్వల భవిషత్ కేంద్రాలగా దివ్యాంగులకు భవిత సెంటర్‌లు ఉపయోగపడుతున్నాయని, ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధనకు కోసం అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని ఆదే శించారు. రెయిలింగ్, ర్యాంపు, రాంప్ వంటివి పటిష్టంగా ఉండాలన్నారు. ఫిజియోథెరిపిస్టు ఖచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలని, భవిత కేంద్రాంలో విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్ది ప్రత్యేక పాఠశాల నుండి సాధారణ పాఠశాలకు పంపడానికి చేస్తున్న కృషిని, సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిచేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ డా.ప్రభు దయాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాము పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈవిఎం గోదాము పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆర్‌డిఓ కార్యాలయం ప్రాంగణంలోని ఈవిఎం గోదామును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవిఎం భద్రతకు సంబంధించి ప్రతినెలా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు తనిఖీ చేసినట్లు చెప్పారు. సిసి కెమోరాల పనితీరును కూడా పరిశీలించామన్నారు. అనుమతి లేనిదే గోదాములోనికి ఎవ్వరినీ అనుమతించరాదని అధికారులు, సెక్యూరిటీ గార్డులకు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి రూ.2.96 కోట్లు మంజూరు

నిధులను సద్వినియోగం చేసుకోవాలన్న అదనపు కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ. 2.96 కోట్లు మంజూరు చేసిందని ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. గురువారం కలెక్టరేట్ నందు అదనపు కలెక్టర్ పి. శ్రీజ అధ్యక్షతన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, పంచాయతీరాజ్, టిజిఎస్ ఆర్టిసి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ. 2.96 కోట్లు నిధులు కేటాయించారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ నిధులను కళాశాలల రిపేర్లు, వాటర్ సప్లయ్, ఎలక్ట్రికల్ రిపేర్, సివిల్ రిపేర్లు, టాయిలెట్ రిపేర్లు, ల్యాబ్ మెటీరియల్ కొనుగోలుకు, కళాశాల భవనాల రంగులకు వినియోగించాలన్నారు. ఈ పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. ప్రిన్సిపాల్స్ నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆర్టీసి బస్సుల ద్వారా విద్యార్థులు కళాశాలలకు సకాలంలో హాజరయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఐఇవొ కె.రవిబాబు, టిజిఎస్ ఆర్టీసి సిఐ రామయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, పంచాయతీరాజ్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** సాంప్రదాయ పంటలు కాకుండా రైతులు ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. గురువారం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో పర్యటించి పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పత్తి, పెసర, ఆయిల్ పామ్‌లో అంతర పంటగా సాగు చేస్తున్న పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పంటల సాగుకు సంబంధించి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ రైతులు యూరియా, డిఏపికి బదులు నానో యూరియా, డిఏపిలను వాడాలన్నారు. వాటి వాడకం వల్ల రైతులకు రసాయనాలకు పెట్టేటటువంటి ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణ కాలుష్యం అవ్వకుండా, భూమిని కూడా కాపాడుకోవచ్చునన్నారు. నీటి వసతి ఉన్న రైతులందరూ ఆయిల్ పామ్ సాగు చేసుకోవాలని తద్వారా అన్ని పంటల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలుగా ఇతర పంటలు సాగు చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహం కూడా ఇస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు మొదటి మూడు సంవత్సరాలు రాయితీలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో ప్రతిభ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 6న సిపిఐ నగర మహాసభ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం నగర సమితి మహాసభ ఈనెల 6న జరుగుతుందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా నేడొక ప్రకటనలో తెలిపారు. ముస్తఫా నగర్‌లోని సెంట్ మేరీస్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందన్నారు. ఈ మహాసభలో సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ శాసన సభ్యుడు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. పార్టీ నిర్మాణం, నగర సమస్యలు తదితర వాటిపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు తెలిపారు.

## గ్రామగ్రామాన ఉత్సాహభరితంగా మండల మహాసభలు

**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలో మండల సమితి సమావేశం మండల కార్యదర్శి ఓర్సు రమేష్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా నాయకుడు శ్రావణ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ వందేళ్లు పూర్తికావస్తున్నటువంటి సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ నూతన ఉత్సహంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో గ్రామగ్రామాన కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ముందుకు సాగేవిధంగా గ్రామస్థాయి నుంచి మండల స్థాయివరకు మహాసభలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా ఈనెల ఆరున సిపిఐ తల్లాడ మండల మహాసభ ఉత్సాహభరితమైన వాతావరణంలో ఆ మహాసభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ మహాసభ బడుగు, బలహీన వర్గాలకు వెన్నంటి ఉండి పనిచేస్తున్నటువంటి కమ్యూనిస్టు పార్టీ నూతన నాయకత్వాన్ని ఏర్పాటుచేసుకోవడంతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమ నిర్మాణాలను ఆ మహాసభ ద్వారా తీర్మానం చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నల్లమోతు నర్సింహారావు, సిపిఐ సీనియర్ నాయకులు తమ్మారపు వెంకటేశ్వర్లు, రాయప్ప, పఠాన్, మాదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై అవగాహన

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని హర్యా తండా గ్రామంలో నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పత్తి, మిర్చి, వరి, కూరగాయలు పండించే రైతులు భూమిలో సేంద్రియ కార్బనాన్ని, సేంద్రీయ పదార్థాన్ని పెంపొందించుకుంటే రసాయన ఎరువుల వాడే అవసరం తగ్గుతుందన్నారు. రసాయనిక ఎరువులు అయినటువంటి యూరియా, డిఏపి కాంప్లెక్స్‌లు వాడినట్లయితే భూమి సారం దెబ్బతిని చౌడబారుతుందన్నారు. యూరియా, డిఏపిలకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డిఏపిలను వాడుకుంటే రైతులకు రసాయన ఎరువుల మీద పెట్టేటటువంటి ఖర్చు కూడా తగ్గడంతో పాటు భూసారం మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ మహీందర్‌రెడ్డి, ఏఈవో శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

# ‘పాలేరు’ అభివృద్ధికి రూ.1400 కోట్లు


కూసుమంచి అభివృద్ధికి ప్రాధాన్యత
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/కూసుమంచి :** పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి 19మాసాల కాలంలో రూ.1400 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి మండల కేంద్రాన్ని ప్రధాన పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. గురువారం కూసుమంచిమండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ధర్మతండా గ్రామంలో రూ.36లక్షలతో చేపట్టే కూసుమంచి, ధర్మతండా రోడ్డు మరమ్మతు పనులకు లోక్యాతండాలో రూ. 1.26 కోట్లతో చేపట్టే రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించడంతో పాటు లోక్యాతండాలో రూ.2.90కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ధనియాతండా, ముటాపురం బిటి రోడ్డు నిర్మాణ పనులకు కూసుమంచి గ్రామంలో రూ.6.50 కోట్లతో చేపట్టే జంక్షన్ అభివృద్ధి పనులు ఖమ్మం, కోదాడ, కూసుమంచి, నేలకొండపల్లి పట్టణ పరిధిలోని డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. లోక్యాతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో విడతల వారీగా జమ చేస్తామని పొంగులేటి తెలిపారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కూసుమంచి మండల కేంద్రంలో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, తాగునీటి సమస్యను పరిష్కరించామని, ఇదే సందర్భంలో రూ.50లక్షలతో నిర్మించే షాదీఖానాను కూడా మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. దీనికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ.5.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఈఈ మిషన్ భగీరథ వాణిశ్రీ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత, స్థానిక మండల అధికారులు పాల్గొన్నారు.

# రీల్

## గ్రామీణ నేపథ్యంలో 'కొత్తపల్లిలో ఒకప్పుడు'



గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ యువకుడి కథతో తెరకెక్కిన సినిమా కొత్తపల్లిలో ఒకప్పుడు. ఈ చిత్రం ద్వారా ప్రవీణ పరుచూరి దర్శకురాలిగా అరంగేట్రం చేస్తున్నారు. కేరాఫ్ కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య వంటి చిత్రాలను నిర్మించిన ప్రవీణ ఇప్పుడు డైరెక్షన్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రం ఒక సంఘటన తర్వాత ఊహించని మలుపు తిరిగిన ఒక గ్రామ యువకుడి నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమా అన్నీ వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉండబోతోంది. కొత్తపల్లిలో ఒకప్పుడు త్వరలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమా తెర మీదకు రావడానికి దగ్గ పాటి రాణా అన్ని విధాలుగా సహాయం హాహాకారాలు అందించారు.

## 'హరి హర వీరమల్లు' ట్రైలర్ విడుదల



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు ట్రైలర్ విడుదల అయింది. గురువారం హైదరాబాద్ లోని విమల్ థియేటర్ లో 'హరి హర వీరమల్లు' ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అభిమానుల కోసం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ట్రైలర్ ను ప్రదర్శించారు. 'హరి హర వీరమల్లు' ట్రైలర్ ను మూడు నిమిషాల నిడివితో రూపొందించారు. ఢిల్లీ సుల్తానుల నుండి సనాతన ధర్మాన్ని రక్షించడానికి నడుం బిగించిన యోధుడు, మొఘల్ శక్తిని ధిక్కరించిన వీరుడు 'వీరమల్లు'గా పవన్ కళ్యాణ్ కనిపించారు. మొఘల్ సామ్రాజ్యంలో అత్యంత అపఖ్యాతి పాలైన పాలకులలో ఒకరైన ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ కనిపిస్తున్నారు. పంచమి పాత్రలో నిధి అగర్వాల్ నటించింది ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చిత్ర సమర్పకులు, ప్రముఖ నిర్మాత ఎ. ఎం. రత్నం మాట్లాడుతూ 'చరిత్రను గుర్తుచేసే సినిమా ఇది. పవన్ కళ్యాణ్ చేసిన పూర్తిస్థాయి పాన్ ఇండియా యాక్షన్ చిత్రమిది.నిర్మాత ఎ. దయాకర్ రావు మాట్లాడుతూ.. 'ఇది ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా జూలై 24న వస్తుంది. దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ.. 'కొందరు సినిమా గురించి అసత్య ప్రచారాలు చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. మా పని మేము చేసుకుంటూనే ఉన్నాము. ఎ. ఎం. రత్నం ఎక్కువగా భారీ బడ్జెట్ సినిమాలే చేస్తారు.ఈ సినిమాకి పునాది వేసిన క్రిష్ కు ధన్యవాదాలు. ఈసారి డేట్ మారదు. ఇండస్ట్రీ రికార్డులు మారతాయి.' అని అన్నారు. కథానాయిక నిధి అగర్వాల్ మాట్లాడుతూ 'మీ అందరికీ ట్రైలర్ నచ్చింది అనుకుంటున్నాను. ఈ సినిమాతో ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ కొట్టబోతున్నాం అన్నారు.

## సైకో కిల్లర్‌గా చేయాలనుంది

### హీరోయిన్ వర్ష చిట్ చాట్



నితిన్ హీరోగా లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్న 'తమ్ముడు' సినిమా ఈ నెల 4న విడుదల అవుతున్న సందర్భంగా హీరోయిన్ వర్ష బొల్లమ్మ మీడియాతో చిట్ చాట్ చేశారు.

నేను గతంలో ఎస్‌విసి సంస్థలో 'జాను' అనే మూవీలో నటించాను. 'తమ్ముడు' కోసం పిలవగానే వచ్చి ఆడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్ లో వెంటనే ఓకే అయ్యాను. దర్శకుడు వేణు ఈ మూవీ గురించి చెబుతూ అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ఇప్పుడే చెప్పండి అన్నారు. నేను ఛాలెంజింగ్ గా తీసుకుని చేస్తాను అని చెప్పాను. అలా చిత్ర క్యారెక్టర్ కు నేను సెలెక్ట్ అయ్యాను. ఈ సినిమా కోసం నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. రియల్ లైఫ్ లో కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఉండేది. అది ఈ సినిమాతో కుదిరింది. ఏదైనా చేయాలనుకుంటే వెంటనే అడుగువేసే క్యారెక్టర్ చిత్రది. నా రియల్ లైఫ్ లో నేను అలా కాదు. 'తమ్ముడు' మూవీని ఏదైనా స్టూడియోలో ఉన్న చిన్న అడవిలో కూడా షూట్ చేయొచ్చు కానీ సహజంగా ఉండేలా మారేడుమిల్లి అడవిలో చిత్రీకరించాం. అది దట్టమైన అడవి. వర్షాకాలంలో పాములు, తేళ్లు కనిపించేవి. రాత్రిపూట షూటింగ్ లో కేవలం కాగడాలు పట్టుకుని నటించాం. లయ అమెరికా నుంచి వచ్చారు. అక్కడ సుకుమారంగా ఉండి ఈ అడవిలో చెప్పులు లేకుండా నటించారు. రోజూ ఏదో ఒక గాయం అయ్యేది. అయినా ఉత్సాహంగా షూటింగ్ లో పాల్గొన్నారు. హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్... ఇలాంటి తేడాలు చూడాలని అనుకోవడం లేదు. వర్ష బాగా పర్ఫార్మ్ చేసింది అనే పేరు తెచ్చుకుంటే చాలు. నిత్యామీనన్ ను ఎగ్జాంపుల్ గా తీసుకుంటే తనకు పర్ ఫార్మర్ గా పేరుంది. నేను అలాగే పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నా. 'తమ్ముడు' మూవీ బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ప్రధానంగా సాగుతుంది. అయితే ఇందులో అనేక లేయర్స్ ఉంటాయి. నా క్యారెక్టర్ కు సంబంధించి సాలిడ్ యాక్షన్ ఉంటుంది. ప్రస్తుతం కానిస్టేబుల్ కనకం అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నాను. దీంతో పాటు మరో సిరీస్ చేస్తున్నా. రెండు సినిమాలు కూడా కన్ఫర్మ్ అయ్యాయి. వాటి డీటెయిల్స్ త్వరలో చెబుతా. సైకో కిల్లర్ క్యారెక్టర్ లో కనిపించాలనేది నా కోరిక. నేను సైకో కిల్లర్ ఏంటి అనుకుంటారు. కానీ మనం ఆ జానర్ మూవీస్ చూస్తే ఎవరూ ఊహించని పాత్రలే క్రైమ్స్ చేస్తుంటాయి. అలాంటి అవకాశం వస్తే నటిస్తా.

## 25న ఫెంటాస్టిక్ ఫోర్




భారీ గ్రాఫిక్స్ తో తెరకెక్కించిన ఫెంటాస్టిక్ ఫోర్ చిత్రం జూలై 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కు సన్నాహాలు చేస్తున్నారు రిచర్డ్స్ మిస్టర్ ఫెంటాస్టిక్ పాత్రలో పెడ్రో పాస్కల్ నటించారు సూ స్టార్మ్ ఇన్విజిబుల్ ఉమెన్ గా వెనెస్సా కిర్బీ నటించారు. భావోద్వేగ భరితంగా ఈ కథను తెరకెక్కించారు. జానీ స్టార్మ్ హ్యూమన్ టార్చ్ గా జోసెఫ్ క్విన్ కనిపిస్తారు బెన్ గ్రిమ్ ది థింగ్ పాత్రలో ఎబోన్ మోస్‌బ్రాచ్ నటించారు. ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్ జూలై 25న భారతీయ థియేటర్లలో ఇంగ్లీష్, హిందీ, తమిళం తెలుగు భాషలలో విడుదల అవుతుంది.



## నాగబాబు కూతురు రెండో చిత్రం షురూ

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెం.2 గా నిహారిక కొణిదెల నిర్మిస్తున్న చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించనున్నారు. ఈ చిత్రానికి కథను మానస శర్మ అందించగా.. స్క్రీన్ ప్లే, డైలాగ్స్‌ను మానస శర్మ, మహేష్ ఉప్పాల అందించారు. ఈ మూవీకి మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాల్ని అన్నపూర్ణ స్టూడియోస్ గ్లాస్ హౌస్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్, కళ్యాణ్ శంకర్, మల్లిడి వశిష్ట అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టగా.. వశిష్ట కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి సన్నివేశానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ జూలై 15 నుంచి హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జరగనుంది.



## లాభాలు వస్తే పని చేసిన వారికి డబ్బులిస్తా

**చిత్ర నిర్మాత సతీష్**

సెవెన్ హిల్స్ బ్యానర్ పై నిర్మించిన సోలో బాయ్ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో చిత్ర నిర్మాత సతీష్ మీడియాతో 'చిట్ చాట్' చేశారు. సోలో బాయ్ చిత్ర హీరో గౌతమ్ కృష్ణ నాకు చాలా మంచి స్నేహితుడు. అతను ఈ సినిమా లైన్ చెప్పినప్పుడు మధ్యతరగతి కుటుంబంలోని 17 సంవత్సరాల నుండి సెటిల్ అవ్వడానికి పడే కష్టం తాలూకా పాయింట్ నాకు చాలా బాగా నచ్చింది. వెంటనే షూటింగ్ మొదలు పెట్టాం. అనవసరమైన ఖర్చులు ఎక్కడ పెట్టకుండా ప్రతి విషయంలో జాగ్రత్త పడి ఖర్చు పెట్టాము. చిత్రానికి పనిచేసిన యంగ్ టీం అంతా తక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటూ సినిమాకు బాగా సపోర్ట్ చేశారు. సినిమా విడుదల తర్వాత వారికి లాభాల నుండి డబ్బును ఇస్తాను. గతంలో బట్టల రామకృష్ణ బయోపిక్ సినిమా తీసినప్పుడు ఒక ప్రయోగాత్మకంగా చేశాము. అది మాకు వర్కౌట్ అయింది. ఇప్పుడు ఆ సమయంలో నేర్చుకున్న వాటిని బేస్ చేసుకుని తగ్గ జాగ్రత్తలు తీసుకుంటూ సోలో బాయ్ సినిమా చేశాము.



## మహావతార్ నరసింహా హిరణ్యకశిపు 'ప్రోమో రిలీజ్'

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ హోంబాలే ఫిలమ్స్ క్లీమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి ప్రతిష్టాత్మకమైన, సెన్సేషనల్ వెంచర్ మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ కోసం చేతులు కలిపింది. ఈ విజనరీ యానిమేటెడ్ ఫ్రాంచైజీ విష్ణువు దశ అవతారాల పురాణ గాథను జీవం పోస్తుంది. ఇది అత్యాధునిక యానిమేషన్, భారతీయ పురాణాల బెస్ట్ కంటెంట్‌లో ఇంతకు ముందు ఎన్నడూ ప్రయత్నించని సినిమాటిక్ స్కేల్ తో అలరించబోతోంది. దర్శకుడు అశ్విన్ కుమార్ దర్శకత్వంలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మాతలు నిర్మిస్తున్న మహావతార్ నరసింహా, మొదటి భాగం జూలై 25న ఐదు ప్రధాన భారతీయ భాషలలో అత్యాధునిక 3డీ ఫార్మాట్‌లో విడుదల కానుంది. మహావతార్ నరసింహా భారతీయ సినిమాలో పౌరాణిక కథ చెప్పే స్కేల్ ని రీడిఫైన్ చేస్తోంది. ఇది డివైన్ యూనివర్స్, విష్ణువు దశ అవతారాల అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.

## 23మంది ఉద్యోగులకు సుమన్ టివి ఇళ్ల పట్టాలు



**హైదరాబాద్ :** తమ సంస్థలో పనిచేస్తున్న 23 మంది ఉద్యోగులకు ఇండ్ల పట్టాలను సుమన్ టివి ఎండి సుమన్ పంపిణీ చేసి మీడియా సంస్థలకు ఆదర్శంగా నిలిచారు. సంస్థలో మొదటి నుండి పనిచేస్తున్న ఉద్యోగులకు సుమన్ టివి 10 వార్షికోత్సవం సందర్భంగా తమ సంస్థలో గత ఐదేళ్లు నుంచి పనిచేస్తున్న 23 మంది ఉద్యోగులకు ఇండ్ల పట్టాలు అందజేశారు. వారికి ఆ స్థలాల్లో 2027 నాటికి ఇళ్లు నిర్మించి అందజేస్తామని ప్రకటించారు. గతంలో సుమన్ టివిలో పనిచేసిన కొంత మందికి బెంజ్ కార్లు ఇచ్చి సంచలనం సృష్టించిన సుమన్ తాజాగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న కెమెరా పర్సన్, ఎస్ఇఒలకు, ఉద్యోగులకు వారి తల్లి దండ్రుల సమక్షంలో పట్టాలు ఇవ్వడంతో కుటుంబ సభ్యులు సుమన్‌కు ధన్యవాదాలు తెలియ జేశారు.

## 9న దేశవ్యాప్త నిరసనలు


### సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ, రాష్ట్ర నాయకుల పిలుపు




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న అఖిలభారత సమ్మె, దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు వెల్లడించారు. గురువారం బషీర్బాగ్ దేశోద్ధారక భవన్ లో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు విస్సా కిరణ్ కుమార్, పశ్య పద్మ, పి సాగర్, బిక్షపతి, ప్రభాకర్ ,జక్కుల వెంకటయ్య లతో కలిసి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావ్ మీడియాతో మాట్లాడారు. రైతులు ఎన్నో ఏండ్లుగా డిమాండ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించకుండా, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం రైతుల పంటలకు న్యాయమైన ధరలు కల్పించకపోగా, ఆదానీ వంటి కార్పోరేటర్ల చేతుల్లో భారత వ్యవసాయాన్ని బంధిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణ విమోచన చట్టం చేయాలని దీర్ఘకాలికంగా డిమాండ చేస్తున్న వినిపించుకోకపోగా కార్పొరేటర్లకు పదేళ్లలో రూ .16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులకు విగాథం కలిగిస్తూ చట్ట సవరణలు చేయడమే కాక , ఆపరేషన్ కాగార్ పేరుతో వందలాది ఆదివాసీలను చంపేస్తుందని అన్నారు. అటవీ సంపదను ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెడుతూ సుదీర్ఘకాల పోరాటాలతో కార్మిక వర్గం సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వీటిని వ్యతిరేకిస్తూ జరిపే అఖిల భారత సమ్మె, దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు

### సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో పర్యటించి ఎస్సి కాలనీ నందు (ఎస్ సిసి) నిధులు రూ. 50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా తొలి విడత గుడిసెల్లో ఉన్న నిరుపేదలను ఎంపిక చేసి ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా గుడిసెల్లో ఉంటూ ఇందిరమ్మ ఇండ్లు రాని వారు ఉంటే ప్రతిపాదనలు అందించాలని వెంటనే మంజూరు చేస్తామన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం సాగు పెట్టుబడికి ఉపయోగపడేవిధంగా వ్యవసాయోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పథకం క్రింద రూ. 6వేలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలను అందిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని తెలిపారు.

## ప్రతికూల వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

గురువారం తన 'ఫేస్‌బుక్ పోస్ట్'లో పిలుపునిచ్చారు. ప్రాధాన్యత లేని కుటుంబాలకు కార్డుకు 5 కిలోల బియ్యం రూ. 830 రేట్‌కు అందించాలని కేరళ డిమాండ్ చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి అందిస్తున్న బియ్యం కేటాయింపు ఆటుపోట్లతో ఉన్నదని ఆయన చెప్పారు. రెండేళ్ల క్రితం వరకు గోధుమల కేటాయింపును తాత్కాలిక కేటాయింపుగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసిందని, దానిని పునరుద్ధరించాలని ఆయన చెప్పారు. ప్రత్యేక సందర్భమైన ఓనం పండుగ సమయంలో మార్కెట్లో ధరలు విచ్చలవిడిగా పెరుగకుండా నియంత్రించేందుకు వీలైనంత మేరకు ప్రాధాన్యత లేని వర్గాలకు ఆహారధాన్యాల లభ్యత ఉండేలా నిర్ధారించుకోవడం అవసరమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ నొక్కిచెప్పారు. ఈ సందర్భంలోనే రాష్ట్రం ప్రాధాన్యతలేని తరగతులకు అదనపు బియ్యం డిమాండ్‌ను చేసిందని ముఖ్యమంత్రి తన పోస్ట్‌లో చెప్పారు. ఆరోగ్య గణాంకాల ప్రకారం ఒక రాష్ట్ర జనాభాలో ఒక ముఖ్యమైన వర్గం మధుమేహం వ్యాధితో బాధపడుతోందని, అందుకే తాము ప్రాధాన్యతలేని వర్గాలకు గోధుమం కేటాయింపును పునరుద్ధరించాలని డిమాండ్‌చేసినట్లు విజయన్ వెల్లడించారు. 'కానీ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు సహాయం చేయడానికి ఉద్దేశించిన చట్టాలను, పథకాలను నిర్దాక్షిణ్యంగా తిరస్కరిస్తోంది. పార్టీ రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ విషయంలో ఐక్యనిరసన వ్యక్తం చేయాలి' అని సిఎం నొక్కిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కేరళ వ్యతిరేక విధానాన్ని సరిదిద్దడానికి ప్రజల నిరసన చాలా అవసరం అని, అందుకోసం మనమంతా ఐక్యంగా నిలబడాలని ముఖ్యమంత్రి కోరారు.

## కోర్టుకు రాష్ట్ర సర్కార్?

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాలని హైకోర్ట్ ఆదేశించింది. ఇంకో వైపు బిసిల రిజర్వేషన్ ఖరారు కాకుండా ఎన్నికలు నిర్వహించొద్దని బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో బిసి రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేస్తోంది. ఒక వైపు రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్, మరోవైపు స్థానిక ఎన్నికలపై హైకోర్ట్ తీర్పు నేపథ్యంలో ఎలా ముందుకు కెళ్ళాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అడ్వొకేట్ జనరల్‌తో పాటు, న్యాయనిపుణులతో చర్చించినట్లు తెలిసింది. రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన తర్వాతనే ఎన్నికలకు పోవాలని,అదే సమయంలో హైకోర్ట్ తీర్పును కూడా పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. బిసి రిజర్వేషన్ అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉన్నదని మరి కొందరు ఇలా రకరకాల వాదనలు వినిపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఒక జిఒ ద్వారా అమలు చేసే అవకాశం ఉంటుందని కొందరు, జిఒ ద్వారా రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని మరి కొందరు ఇలా భిన్న వాదనలను వినిపిస్తున్నారు.

**సుప్రీం కోర్ట్‌కు వెళ్తామా?:**శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టుకోవడంపై సుప్రీంకోర్టులో తమిళనాడు ప్రభుత్వం వేసిన కేసులో, చట్టసభల ఆమోదం పొందిన బిల్లుల పరిశీలనపై రాష్ట్రపతి, గవర్నర్‌లు నిర్ణీత సమయాన్ని నిర్దేశిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును ఉపయోగించుకొని సుప్రీం కోర్టును ఆశ్రయించే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు తీర్పును అమలు చేయాలంటే, అప్పటికలా బిసి బిల్లుపై కేంద్ర ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ లేకుండా ఆ ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్‌ల పెంపు సాధ్యం కాదు. కాబట్టి ఆ తీర్పుపై స్టే కోరుతూ, మరోవైపు నిర్దేశిత సమయంలో బిల్లులను క్లియర్ చేయాలన్న తాజా సుప్రీం కోర్టు తీర్పును ఊటంకిస్తూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్‌ల పెంపు బిల్లును సత్వరం పరిష్కరించాలని ఆదేశించాల్సిందిగా సుప్రీం కోర్టును కోరాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. స్థానిక సంస్థలలో బిసిల రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా సుప్రీం కోర్ట్‌లో ప్రస్తావించాలని, తద్వారా ఏమైనా స్పష్టత వచ్చే అవకాశాలు ఉంటాయని, దీంతో తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల విషయంలో ఒక నిర్ణయం తీసుకునేందుకు వెసులుబాటు ఉంటుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదే సమయంలో హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్తే స్థానిక సంస్థలు ఆలస్యం చేసామనే బద్నాం తమపైకి రాకూడదనే ఆలోచనలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఒకవైపు బిసిల రిజర్వేషన్లను అమలు చేసి, త్వరితగతిన స్థానిక ఎన్నికలకు నిర్వహించేందుకు ఉన్న మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది.ందుకే హైకోర్టు తీర్పును అమలు చేస్తూనే, స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆలోచన కూడా ఉంది. బిసి రిజర్వేషన్‌లను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెంచేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూనే, అవసరమైతేనే సుప్రీం కోర్టుకు వెళ్ళాలని, ఇందుకు ఆచితూచి అడుగు ముందుకు వేయాలని అనుకుంటున్నట్లు సమాచారం. మరో వైపు కేంద్రంపైన కూడా ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తోంది.

**'బిసి' భారం రాష్ట్రానిదే అంటున్న బిజెపి :**

కేంద్రంలోని బిజెపి మాత్రం 'బిసి రిజర్వేషన్ బిల్లు' ఆమోదించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు ఉన్నాయి. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపించే బిల్లుకు శాసనసభ, శాసనమండలిలో బిజెపి మద్దతు తెలిపింది. కానీ, ఆ పార్టీ మద్దతు కేవలం చట్ట సభలకే పరిమితమైందనే ఆరోపణలు ఉన్నాయి. బిసి రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేసే అవకాశాలు ఉన్నాయని, కేంద్ర నిర్ణయం కోసం ఎదురుచూడకుండా స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లను అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని బిజెపి నేతలు వాదిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి ప్రకారం బిసి రిజర్వేషన్లను అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదని బిజెపికి చెందిన ఒక ఎంపి ఇటీవల తెలిపారు. ఆ మాట ప్రకారమే పెంచిన బిసి రిజర్వేషన్లు అమలు జరిగితే, ఆ పనిని గతంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు చేయలేదనే చర్చ తెరపైకి వచ్చింది. ఈ వాదనను బిసి సంఘాలు తప్పుపడుతున్నారు. కేవలం ఒక జిఒ, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ద్వారా కొందరు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాలు ఉంటాయని, తద్వారా బిసిలకు అన్యాయం జరుగుతుంది, రిజర్వేషన్ల అంశాన్ని న్యాయ చిక్కుల్లో వేసేందుకే ఇటువంటి చర్చను కొందరు తెరపైకి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఏ రాష్ట్రంలో జిఒ ద్వారా బిసిల రిజర్వేషన్లను అమలు చేశారో చూపాలని డిమాండ్ చేస్తున్నాయి.

## శాంతికి చేరువలో గాజా!

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఇజ్రాయెల్ జైళ్ళల్లో ఉన్న పాలస్తీనియన్లను నెలన్యాహూ ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంటుంది. ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినాగానీ, గాజాలో కాల్పుల విరమణ పాటించాలని నెతన్యాహూపై ట్రంప్ ఇటీవలికాలంలో ఒత్తిడి తీవ్రత పెంచారు. పరిస్థితులు అనుకూలించి వచ్చేవారంలోనే ఒప్పందం కుదిరిగే బాహాట వేదికలపై బందీలను అప్పగించే కార్యక్రమాలకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ అంగీకారం తెలియజేసినట్లు సమాచారం. అదేవిధంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు సంభాషణలు జరిగినంతకాలం సైనిక చర్యలను పునరుద్ధరించకూడదన్న షరతుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని తెలుస్తున్నది. ఇంత కాలంగా మొండిపట్టుదలలు ప్రదర్శించిన హమాస్–ఇజ్రాయెల్ ప్రతినిధివర్గాలు ఇటీవలికాలంలో పట్టువిడుపుల ధోరణి చూపిస్తున్నాయన్నది మధ్యవర్తి వర్గాల సమాచారం. ఈ తాత్కాలిక 60 రోజుల కాల్పుల విరమణ శాశ్వత శాంతికి దారితీయాలని హమాస్ ఆకాంక్షించింది. దీంతో గాజా యుద్ధ ప్రాంతం త్వరలోనే శాంతికి చేరువయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిదశలో అమలు చేసిన 45 రోజుల కాల్పుల విరమణ ముగిశాక కొనసాగిన ఉద్రిక్తపరిస్థితులకు భిన్నం గా ఇప్పుడు హమాస్–ఇజ్రాయెల్ మధ్య ఒక స్పష్ట న ఒప్పందం కుదరడానికి కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ట్రంప్ బుధవారంనాడు తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ, నెతన్యాహూ కాల్పుల విరమణకు సు ముఖంగా ఉన్నారని ప్రకటించారు. ఇజ్రాయెల్‌ను ఒప్పించే బాధ్యతలు తాను స్వీకరించాననీ, హమాస్‌ను ఒప్పించే బాధ్యతలు మధ్యవర్తులుగా ఖతార్, ఈజిప్టు దేశాలు తీసుకున్నాయని ట్రంప్ ప్రకటించారు. కొద్దినెలలుగా గాజాలో శాంతి సాధనకు కసరత్తు జరుగుతోందన్నారు. ఈ వార్తలమధ్య వచ్చేవారంలో నెతన్యాహూ వాషింగ్టన్ పర్యటనకు అధికారికంగా సిద్ధం అవుతున్నారు. అవినీతి ఆరోపణల కేసులో కోర్టు హాజరుకావాల్సిందేనని మొదట షరదు విధించిన న్యాయస్థానం ఆ తర్వాత పరిస్థితులు అర్థం చేసుకుని మధ్యప్రాచ్యంలో శాంతి సాధనకు వీలుగా, కొన్నాళ్ళు కోర్టు వాతావరణం నుండి ఆయనకు ఉపశమనం కలిగించింది. దీంతో నెతన్యాహూ అమెరికా పర్యటన ఖరారైంది. మొదట నెతన్యాహూ నుండి సమ్మతి లభించింది. ఇప్పుడు హర్షాతిరేకాల పేరుతో హమాస్ నుండి కూడా సమ్మతి లభించిందనే అందరూ భావిస్తున్నారు. ఇక మిగిలిన చిన్న చిన్న ఆటంకాలు కూడా అధిగమిస్తే తాత్కాలికంగా కాల్పుల విరమణకు మార్గం ఏర్పడుతుంది. ఈ వారంలోనే ఇజ్రాయెల్ బందీల విడుదల జరుగుతుందని ట్రంప్ హడావుడిగా ప్రకటించారు. 2023 అక్టోబరు 7 వ తేదీన హమాస్ ఉగ్రవాదు లు భారీ ఎత్తున ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి కాల్పు లు జరిపి 1200 మందిని హతమార్చారు. 250 మం దిని బందీలుగా తీసుకుపోయారు. వీరిలో వివిధ దేశాలకు చెందిన ఇజ్రాయెల్ వాసులు ఉన్నారు.ఇం కా 56 మంది బందీలు 21 నెలలుగా హమాస్ వద్ద ఉండిపోయారు. ఐతే వీరిలో కేవలం 24 మం ది లేదా 26 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని ఇజ్రాయెల్ ప్రభుత్వం అంచనావేస్తున్నది. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ 56,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. లక్షలమంది గాయపడ్డారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com